కిషన్‌చందర్ రచనలు-1
రూ॥ 200/-
పేజీలు: 220




నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



విశేష ప్రతిభావంతుడు.. 'విశ్వంభరుడు' సినారె

సామాజిక సమస్యలపై డికెన్స్ పోరాటం

అక్రమ వలసదారులపై ఆకస్మిక దాడులు

లోపలి పేజీల్లో



సంపుటి 08, సంచిక: 189 | సోమవారం | 09 -06-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే

## మాగంటి గోపీనాథ్ కన్నుమూత

సిఎం రేవంత్‌రెడ్డి, ఎపి సిఎం చంద్రబాబునాయుడు, పలువురు నేతలు సంతాపం

మాగంటి భౌతికకాయాన్ని చూసి విలపించిన కెసిఆర్

ప్రభుత్వ లాంఛనాలతో మహాప్రస్థానంలో ముగిసిన అంత్యక్రియలు



ప్రజాపక్షం/హైదరాబాద్

జూబ్లీహిల్స్ బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కన్నుమూశారు. గత కొన్ని రోలుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం ఉదయం 5.45 నిమిషాలకు తుదిశ్వాస విడిచారు. గురువారం సాయంత్రం తీవ్రమైన ఛాతినొప్పితో బాధపడిన గోపీనాథ్‌ను కుటుంబ సభ్యులు గచ్చిబౌలిలోని ఎఐజి ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారు. కార్డియాక్ తరువాయి 2లో

### కూనంనేని తీవ్ర దిగ్భ్రాంతి

బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ హఠాన్మరణం పట్ల సిపిఐ శాసనసభ పక్ష నాయకులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. సహచర ఎమ్మెల్యే అకాల మరణం బాధ కలిగించిందన్నారు. ఆయనతో వ్యక్తిగతంగా మంచి సంబంధాలు ఉన్నాయని, ఈ మధ్యకాలంలోనే ఇంటికి రావాలని కూడా తనను ఆహ్వానించారని ఆయన తెలిపారు. మాగంటి గోపీనాథ్ చిన్న వయసులోనే మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్‌టిఆర్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి ప్రవేశించి విద్యార్థి, యువజన నాయకుడుగా అంచెలంచెలుగా ఎదిగారన్నారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైనారని గుర్తు చేశారు. ఆయన మరణం పట్ల సంతాపం వ్యక్తంచేసి, వారి కుటుంబ సభ్యులకు కూనంనేని సాంబశివరావు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఎట్టకేలకు మంత్రివర్గ విస్తరణ

- ఇద్దరు దళిత, ఒక బిసి సామాజిక వర్గానికి చోటు
- నూతన మంత్రులుగా ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, అడ్లూరి లక్ష్మణ్, వాకిటి శ్రీహరి ప్రమాణం
- 15కు చేరిన మంత్రుల సంఖ్య
- ఖాళీగా ఉన్న మరో మూడు స్థానాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎట్టకేలకు తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ జరిగింది.సామాజిక సమీకరణ నేపథ్యంలో ఇద్దరు దళిత సామాజిక వర్గానికి చెందిన (మాల,మాదిగ),ఒక బిసి సామాజిక వర్గానికి చెందిన (ముదిరాజ్) మొత్తం ముగ్గురితో మంత్రివర్గ విస్తరణ జరిగింది. దీంతో మంత్రివర్గ సంఖ్య మొత్తం 15కు చేరింది.(సిఎంతో కలిపి) మంత్రివర్గంలో మరో మూడు మంత్రివర్గ స్థానాల ఖాళీలు ఉన్నాయి. నూతన మంత్రులుగా చెన్నూర్ ఎంఎల్‌ఎ గడ్డం వివేక్ వెంకటస్వామి(మాల),ధర్మపూరి ఎంఎల్‌ఎ అడ్లూరి లక్ష్మణ్(మాదిగ), మక్తల్ ఎంఎల్‌ఎ వాకిటి శ్రీహరి (బిసి ముదిరాజ్)లతో తరువాయి 2లో





03

'ప్రజల కథే నా ఆత్మకథ'

పుస్తకాన్ని ఆవిష్కరించిన మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

## 'బుజ్జగింపుల' పర్వం

ఆశావహుల ఇంటికి వెళ్లిన కాంగ్రెస్ ముఖ్యులు - భవిష్యత్‌లో అవకాశాలు ఉంటాయని హామీ!

ప్రజాపక్షం/హైదరాబాద్

మంత్రివర్గంలో అవకావం దక్కకుండా నిరాశతో తీవ్ర అసంతృప్తిలో ఉన్న నాయకులను కాంగ్రెస్ అధిష్టానం ఆదివారం బుజ్జగించింది. మంత్రివర్గంలో తమకు అవకాశం దక్కుతుందని చివరి వరకు ఆశలు పెట్టుకున్న నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, మంచిర్యాల జిల్లాకు చెందిన ప్రేమ్‌సాగర్‌రావు, రంగారెడ్డి జిల్లాకు చెందిన మల్‌రెడ్డి రంగారెడ్డి , నల్లగొండ జిల్లాకు చెందిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని బుజ్జగించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగానే కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ బృందం రంగంలోనికి దిగింది. సుదర్శన్ రెడ్డిని బుజ్జగించేందుకు జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసానికి మీనాక్షి నటరాజన్, మహేష్‌కుమార్‌గౌడ్‌తో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ తదితరులు వెళ్లారు. సామాజిక సమతుల్యతలో భాగంగానే మంత్రివర్గ కూర్పు జరిగిందని వారు సుదర్శన్ రెడ్డికి వివరించారు. అక్కడి నుంచి బేగంపేటలోని ప్రేమ్‌సాగర్ నివాసికి వెళ్లారు. అయితే మల్‌రెడ్డి రంగారెడ్డితో కాంగ్రెస్ బుజ్జగింపు ప్రతినిధి బృందం ఫోన్‌లో మాట్లాడింది. దీంతో ఆయన తరువాయి 2లో

## ఉద్యమాలే ఊపిరిగా ముందుకు

అసమానతలులేని సమసమాజ స్థాపనే లక్ష్యం

బిజెపి హిందుత్వ ఎజెండాను వ్యతిరేకించాలి

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు






ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి

ప్రజా ఉద్యమాలే ఊపిరిగా ముందుకు సాగాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అసమానతలు లేని సమసమాజ స్థాపన ఎర్రజెండాతోనే సాధ్యమన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం హిందుత్వ ఎజెండాతో ముందుకు సాగుతుందని దీనిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో యల్లావుల రాములు, ఉప్పేల నారాయణరెడ్డి, కొండా కోటమ్మల అధ్యక్షవర్గంగా వ్యవహరించిన పార్టీ నాలుగవ జిల్లా మహాసభలో ఆయన మాట్లాడారు. ఎర్రజెండా విలువలు తెలిస్తే ప్రతి ఒక్కరూ చివరి వరకూ కమ్యూనిస్టుగా జీవనం సాగిస్తారని అన్నారు. పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఆది నుండి పార్టీలో తరువాయి 12లో




చేప ప్రసాదం పంపిణీకి భారీగా తరలివచ్చిన ఆస్తమా బాధితులు 03

ప్రజాసేవలో సిఆర్ ఫౌండేషన్ ముందుంటుంది 03



## 6000 దాటిన కరోనా కేసులు

65కు చేరిన మరణాలు



న్యూఢిల్లీ: మళ్లీ కొవిడ్ కలకలం మొదలైంది. ఇటీవల కొన్ని రోజులుగా దేశంలో కొవిడ్ కేసులు పెరుగుదల నమోదవుతున్నది. తాజాగా ఈ వైరస్ బారిన పడిన వారి సంఖ్య ఆరు వేలు దాటింది. ఇప్పటి వరకు కొవిడ్‌తో దేశవ్యాప్తంగా 65 మంది మరణించినట్లు కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. గత 24 గంటల్లో దేశవ్యాప్తంగా క్రియాశీల కేసుల సంఖ్య 6,133లకు చేరింది. గత 24 గంటల్లో 378 కొత్త కేసులు నమోదు కాగా.. ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. కేరళలో అత్యధికంగా 1950 యాక్టివ్ కేసులు ఉండగా.. గుజరాత్, పశ్చిమబెంగాల్, దిల్లీ తర్వాతి స్థానాల్లో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ.. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డేటా బోర్డు వెల్లడించిన సమాచారం ప్రకారం, కేరళలో అత్యధికంగా 1950 కేసులు నమోదయ్యాయి. గుజరాత్ 822, పశ్చిమబెంగాల్ 693, ఢిల్లీ 686, మహారాష్ట్ర 595, కర్ణాటక 366, ఉత్తర ప్రదేశ్ 219, తమిళనాడు 194, రాజస్థాన్ 132, హరియాణా 102, ఆంధ్రప్రదేశ్ 86, బిహార్ 49, ఛత్తీస్‌గఢ్ 41, మధ్యప్రదేశ్ 39, పంజాబ్ 35, ఒడిశా 33, సిక్కిం 23, పుదుచ్చేరి 15, తెలంగాణ 10, జమ్మూ కశ్మీర్, గోవా, ఉత్తరాఖండ్‌లలో ఒక్కో రాష్ట్రంలో 9 చొప్పున కేసులు, అస్సాం 6, జార్ఖండ్ 4, హిమాచల్ ప్రదేశ్ 3, చండీగఢ్ 2, త్రిపురలో ఒకరు వైరస్ బారినపడినట్లు సమాచారం. అరుణాచల్ ప్రదేశ్, మిజోరాంలలో ఎటువంటి కేసులు నమోదు కాలేదు.

### నేడు సిట్ విచారణకు ప్రభాకరరావు?

పజాపక్షం/హైదరాబాద్



తెలంగాణలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి) మాజీ చీఫ్ టి. ప్రభాకర్ రావు సోమవారం సిట్ విచారణకు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని అధికారులు భావిస్తున్నారు. ఈ నెల 5నే విచారణకు హజరవుతారని అధికారులు భావించారు. అయితే అనివార్య కారణాల వల్ల అమెరికాలో ఉన్న ప్రభాకరరావు భారత్‌కు రాలేకపోయారు. అతని తరువాయి 2లో

## మణిపూర్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు

ఐదు జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలు బంద్

**ఇంఫాల్:** మళ్లీ ఘర్షణలు చెలరేగిన మణిపూర్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్నాయి. జాతుల మధ్య వైరం కొనసాగుతున్నది. మైతీ వర్గానికి చెందిన సంస్థ అరాంబాయ్ టెంగోల్‌కు చెందిన కొంత మంది నేతలను అరెస్టు చేశారన్న వార్త దావానలంలా వ్యాపించడంతో, రాష్ట్రమంతా ఉద్రిక్తంగా మారింది. పలు ప్రాంతాల్లో నిరసనలు జరిగాయి. ఆ క్రమంలోనే కొన్ని హింసాత్మక సంఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. దీనితో ఐదు జిల్లాల్లో ఇంటర్నెట్, మొబైల్ టాడా సర్వీసులు నిలిపివేశారు. బిష్ణుపూర్ జిల్లాలో కర్ఫ్యూ విధించారు. ఆరెస్టు చేసిన నేతలను వెంటనే విడుదల చేయాలన్న డిమాండ్‌తో, తరువాయి 2లో





## మేడిగడ్డ బ్యారేజీలో గల్లంతైన యువకుల మృతదేహాలు లభ్యం

అందరూ 19 ఏళ్ల లోపువారే

అంబట్ పల్లి, కొర్లకుంట గ్రామాల్లో విషాదం

**ప్రజాపక్షం/మహాదేవపూర్ :** మేడిగడ్డ బ్యారేజీలో గల్లంతై ఆరుగురు యువకులు మృతి చెందిన ఘటన విషాదాన్ని మిగిల్చింది. జయశంకర్ జిల్లా మహాదేవపూర్ మండలం అంబట్‌పల్లి గ్రామంలో శనివారం వివాహ వేడుకల్లో పాల్గొన్న యువకులు స్నానానికి వెళ్లి గోదావరి నదిలో మునిగి మృతి చెందిన ఘటన తెలిసిందే. ఆదివారం మృతదేహాలు లభ్యమవడంతో మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాలను కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. గత రెండు రోజుల క్రితం పత్తి గోల్కొండ మల్లయ్య ఇంట్లో జరిగిన పెళ్లి సందడితో ఆ ఇంట్లో ఆనందం అంతలోనే విషాదంగా మారింది. వివరాల్లోకి వెళితే.. అంబట్ పల్లి గ్రామంలో వివాహ వేడుకల్లో పాల్గొనడానికి వచ్చిన మల్లయ్య బంధువులు పట్టి వెంకటస్వామి తన కుమారులతో పాటు వారి స్నేహితులైన మహా ముత్తారం కొర్లకుంట గ్రామానికి చెందిన యువకులు అంబట్ పల్లికి చెందిన ఐదుగురు యువకులతో కలిసి మేడిగడ్డ సందర్శించడానికి వెళ్లి అక్కడ స్నానం తరువాయి 2లో

## పార్లమెంట్ తొలగించడానికి ముందే...

జస్టిస్ యశ్వంత్‌వర్మ ముందున్న ఏకైక మార్గం రాజీనామానే ?

ఆయనే రాజీనామా చేస్తే పెన్షన్, ఇతర ప్రయోజనాలకు అర్హుడని అధికారవర్గాలు వెల్లడి



**న్యూఢిల్లీ :** అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మను ఆ పదవిలో నుంచి తొలగించడానికి కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో అభిశంసన తీర్మానం తీసుకువచ్చేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్న నేపథ్యంలో ఇక ఆయన ముందున్న ఏకైక ఎంపిక మార్గం రాజీనామా చేయడమే. సుప్రీంకోర్టు, హైకోర్ట్ న్యాయమూర్తులను నియమించడం, తొలగించడం ఎలా అనే విధానం గురించి సమగ్రంగా తెలిసిన అధికారులు ఏ సభలోనైనా చట్టసభల ప్రతినిధుల ముందు తన కేసును సమర్థించుకుంటూ జస్టిస్ యశ్వంత్‌వర్మ తాను రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించవచ్చని, ఆయన మౌఖిక ప్రకటననే రాజీనామాగా పరిగణిస్తారని ఈ విషయాన్ని ఎత్తిచూపారు. జస్టిస్ యశ్వంత్‌వర్మ రాజీనామా చేయాలని నిర్ణయించుకుంటే అతను రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తికి అర్హమైన పెన్షన్, ఇతర ప్రయోజనాలను పొందగలుగుతాడు. కానీ పార్లమెంట్ అభిశంసన ద్వారా జస్టిస్ వర్మను తొలగించిన పక్షంలో ఆయనకు పెన్షన్, ఇతర ఏ ప్రయోజనాలు అందనని వారు తెలిపారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 217ప్రకారం ఒక హైకోర్ట్ న్యాయమూర్తి 'రాష్ట్రపతికి తన స్వదస్తూరితో లేఖ రాయడం ద్వారా తన పదవికి రాజీనామా చేయవచ్చు'. అయితే రాజీనామాకు ఎటువంటి ఆమోదం అవసరం లేదు. ఒక సాధారణ రాజీనామా లేఖ సరిపోతుంది.ఒక న్యాయమూర్తి పదవీ విరమణ చేయడానికి తాను ఏ తేదీలో రాజీనామా చేయబోతున్నానో తెలియజేస్తూ ఒక భావి (భవిష్యత్‌కు సంబంధించిన )తేదీని ఇవ్వవచ్చు. అలాంటి సందర్భాలలో, న్యాయమూర్తి పదవిలో చివరి రోజుగా పేర్కొన్న తేదీకి ముందే తరువాయి 2లో

## అసోంలో మెరుగైన వరద పరిస్థితి

12జిల్లాలలో వరదల బారినపడ్డ 3.37 లక్షల మంది

ఏడాదిలో కొండచరియలు విరిగిపడి 23మంది మృతి

**గువహతి / రాంగియా :** అసోంలో వరద పరిస్థితి మెరుగుపడుతున్నది. వరదలకు ప్రభావితం అవుతున్న జనాభా, విస్తీర్ణం వరుసగా 12జిల్లాల్లో దాదాపు 3.37 లక్షలకు తగ్గిందని ఆదివారం అధికారులు తెలిపారు. శనివారం వరకు బురదతో కూడిన కొండ చరియలు విరిగిపడటంతో ఆరుగురు మరణించడం సహా ఈ ఏడాది కొండచరియలు విరిగిపడటంలో మొత్తం 23మంది మరణించారని అధికారిక బులెటిన్ తెలియజేసింది. బ్రహ్మపుత్ర సహా ప్రధాన నదులు తగ్గుముఖం పడుతుండగా, వీటిలో కొన్ని నదులు మాత్రం ప్రమాదస్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. ఈ క్రమంలో గత వారం నుంచి తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## జాతీయవాద రాజకీయాలు దురదృష్టకరం : పోప్



**వాటికన్ సిటీ :** జాతీయవాద రాజకీయ ఉద్యమాలు దురదృష్టకరమైనవని పోప్ లియో విమర్శించారు. వాటికన్ నగరంలో సెయింట్ పీటర్స్ స్క్వేర్‌లో ఆదివారం ప్రార్థనకు హాజరైన పదుల వేల మందిని ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ సరిహద్దులను తెరవాలని, గోడలను బద్ధలు కొట్టాలని, విద్వేషాన్ని వదిలించుకోవాలని కోరారు. అపోహలకు, పొరుగువారిని వేరు చేసే భద్రతా జోన్‌లకు, వేరు చేసే ఆలోచన ధోరణికి తావులేదని, దురదృష్టవశాత్తు ఈ పోకడలను వెల్లువెత్తుతున్న రాజకీయ జాతీయవాదాలలో చూస్తున్నామని అన్నారు.

# అక్రమ వలసదారులపై ఆకస్మిక దాడులు

### లాస్ ఏంజెలిస్‌లో తీవ్ర నిరసనలు 2వేల మంది నేషనల్ గార్డ్స్‌ను పంపిన ట్రంప్



**లాస్ ఏంజెలిస్ :** అమెరికాలో అక్రమవలసదారులపై దాడుల క్రమంలో లాస్ ఏంజెలిస్ నగరంలో తీవ్ర నిరసనలు వెల్లువెత్తాయి. శనివారం ఆకస్మిక దాడులకు చేయగా పెద్ద ఎత్తున్న నిరసన ప్రదర్శనలు జరిగాయి. లాస్ ఏంజెలిస్‌లో హింస కొనసాగినట్లయితే పెద్ద ఎత్తున బలగాలను దింపేందుకు పెంటగాన్ సిద్ధంగా ఉన్నదని, క్యాంప్ డెండెల్‌టన్ హై అలెర్ట్‌గా ఉందని రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్సెత్ నిరసనకారులను హెచ్చరించారు. కాగా 2వేల మంది నేషనల్ గార్డ్ ట్రూప్‌లను అక్కడికి పంపించాలనే ఆదేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేశారు. ఈ చర్య కావాలనే అగ్నికి ఆజ్యం పోసినట్లు అవుతుందని కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూస్ అన్నారు. చర్చల ద్వారానే సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆగ్నేయ లాస్ ఏంజెలిస్‌లో శనివారం నాడు మెక్సికో జెండాలతో ప్రదర్శన నిర్వహించిన నిరసనకారులకు ఫెడరల్ సెక్యూరిటీ దళాలకు మధ్య ఘర్షణలు జరిగాయి. రెండో రోజు కూడా ఘర్షణలు కొనసాగుతున్నాయి.

కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూస్, లాస్ ఏంజెలిస్ మేయర్ కారెన్ బాస్ తమ బాధ్యతలను నిర్వర్తించలేదని, ఈ విషయం అందరికీ తెలిసిందేనని, కాబట్టి ఫెడరల్ ప్రభుత్వం జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరిస్తుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్ట్ చేశారు. దోపిడీదారుల సమస్య మాదిరిగానే ఆందోళనకారుల సమస్యను కూడా పరిష్కరిస్తామని ఆయన అన్నారు. లాస్ ఏంజెలిస్‌లో 44 మంది అక్రమ వలసదారులతో సహా తమను అడ్డుకున్న ఒకరిని అరెస్ట్ చేసినట్లు ఫెడరల్ అధికారులు వెల్లడించారు. ఈ ఘటన నేపథ్యంలోనే అక్కడ ఘర్షణలు చోటుచేసుకున్నాయి. వందలాది మంది, వారిల కొందరు మెక్సికో జెండాలను పట్టుకొని రోడ్లపైకి వచ్చి నిరసన తెలియజేశారు. పోలీసులు వారిపై లాఠీఛార్జ్, టియర్ గ్యాస్‌ను ప్రయోగించారు. సర్వీస్ ఎంప్లాయీస్ ఇంటర్నేషనల్ యూనియన్ కాలిఫోర్నియా అధ్యక్షుడు డేవిడ్ హుయెర్టాను అధికారుల అదుపులోకి తీసుకోగా, నిరసనకారులు ఫెడరల్ భవనం వద్దకు వెళ్ళి ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## పౌరసత్వం, కార్మిక సంస్కరణలపై ఇటలీలో రెఫరెండం



**రోమ్ :** ఇటలీలో నివసిస్తున్న లక్షలాది వలసదారుల భవితవ్యాన్ని తేల్చే రెండు రోజుల రెఫరండం ఆదివారం నాడు ప్రారంభమైంది. దేశంలోకి చట్టబద్ధంగా ప్రవేశించిన విదేశీయులు పౌరసత్వం పొందే ప్రక్రియకు సంబంధించి రెఫరెండం చేపట్టారు. అంతేకాకుండా, ఉద్యోగ భద్రతను పెంపొందించే విధంగా కార్మిక సంస్కరణలను వెనక్కి తీసుకోవడం కూడా రిఫరెండంలో ఒక అంశం. ప్రతిపక్షాలు, కార్మిక సంఘాలు, సామాజిక కార్యకర్తలు రెఫరెండంలో అంశాలను బలపరుస్తున్నారు. ఇటలీలో ఐరోపాయేతర తల్లిదండ్రులకు జన్మించిన రెండవ తరం ఇటలీవాసులకు పౌరసత్వం త్వరితగతిన ఇచ్చే అంశం ఇందులో ఉంది. అలాంటి వారికి పౌరసత్వం ఇచ్చేందుకు ఇటలీలో నివాస గడువును పదేళ్ల నుంచి ఐదేళ్ళకు తగ్గించడంపై ప్రజాభిప్రాయాన్ని కోరుతున్నారు. ఇది ఆమోదం పొందినట్లయితే 15 లక్షల మంది విదేశీయులకు తక్షణమే ఇటలీ పౌరసత్వం వస్తుంది. అందులో 3లక్షల మంది మైనర్‌లు ఉన్నారు. అంతే కాకుండా ఇటలీలో నివసిస్తున్న వలసదారులలో సగం మంది అంటే, 50 లక్షల మందికి పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం లభిస్తుంది. ఇటలీలో మితవాద ప్రధాన మంత్రి జియార్జియా మెలోనీ కఠినమైన పౌరసత్వ నిబంధనలు నేపథ్యంలో జరుగుతున్న ఈ రెఫరండం ఫలితాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. కాగా, రెఫరెండంను బహిష్కరిస్తున్నట్లు ఆమె ప్రకటించగా, ఆమెకు మద్దతిస్తున్న అధికార కూటమి పార్టీలు సైతం ఓటింగ్‌కు బదులు బీచ్‌కు వెళ్లండి అని తమ మద్దతుదారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. రెఫరెండంను పరిగణలోకి తీసుకోవాలంటే 50 శాతం మంది ఓటర్లు ఓటు వేయాల్సి ఉంటుంది.

## కొలంబియా సెనేటర్‌పై హత్యాయత్నం



**బొగొటా :** వచ్చే ఏడాది జరగన్ను కొలంబియా దేశ అధ్యక్ష ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం ఉందని ప్రచారం జరుగుతున్న సెనేటర్ మెగ్యెల్ ఉరైబ్ తుర్బే (39)పై శనివారం సాయంత్రం దుండగులు కాల్పులు జరిపారు. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ఆయనను ఆసుపత్రికి తరలించగా, ఆయన చావుబతుకుల మధ్య పోరాడుతున్నట్లు డాక్టర్‌లు తెలిపారు. బొగొటాలో ప్రచార సభలో మెగ్యెల్ ఉరైబ్ ప్రసంగిస్తుండగా కొందరు దుండగులు వెనుకనుండి కాల్పులు జరిపారని ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న మితవాద డెమొక్రటిక్ సెంటర్ పార్టీ ఆరోపించింది. అయితే, ఘటనాస్థలిలో తుపాకితో తిరుగుతున్న 15 ఏళ్ళ మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## మాగంటి గోపీనాథ్ కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

అరెస్టు కావడం, సిపిఆర్‌తో తిరిగి గుండె కొట్టుకోవడంతో పాటు నాడి సాధారణ స్థితికి వచ్చినా, అపస్మారక స్థితి నుంచి ఆయన బయటపడలేదు. పరిస్థితి విషమించడంతో ఆదివారం ఉదయం కన్నుమూశారు. గత కొద్దిరోజులుగా కిడ్నీ సంబంధిత సమస్యలతో గోపీనాథ్ బాధపడుతున్నారు. ఈక్రమంలో మూడు నెలల కిందట ఆయన ఏఐజి ఆస్పత్రిలో చేరి డయాలసిస్ చేయించుకున్నట్లు తెలిసింది. గోపీనాథ్‌కు భార్య సునీత, కుమారుడు వాత్సల్యనాథ్, కుమార్తె అక్షరనాగ ఉన్నారు.

**ప్రభుత్వ లాంఛనాలతో గోపీనాథ్ అంత్యక్రియలు**

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అంత్యక్రియలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలను ప్రభుత్వ అధికారిక లాంఛనాల మధ్య నిర్వహించారు. మాగంటి గోపీనాథ్ భౌతికకాయానికి పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అంతకు ముందు గాల్లోకి మూడురౌండ్లు కాల్పులు జరిపారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు పలువురు నేతలు అంతిమ సంస్కారాల్లో పాల్గొన్నారు. అంతకు ముందు అంతిమయాత్రలో కెటిఆర్, హరీశ్‌రావు పాడెను మోశారు. బిఆర్ఎస్ ఎంఎల్‌ఎ, ఎంఎల్‌సి, మాజీ మంత్రులు, పలవురు నాయకులు, కార్యకర్తలు అంత్యక్రియాల్లో పాల్గొన్నారు.

**మూడుసార్లు ఎమ్మెల్యేగా..**

మాగంటి గోపీనాథ్ 1963 జూన్ 2న హైదరాబాద్‌లోని హైదర్‌గూడలో జన్మించారు. 1980లో వెంకటేశ్వర ట్యుటోరియల్స్ నుంచి ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. 1983లో ఉస్మానియా యూనివర్సిటీలో బిఏ పూర్తిచేశారు. 2014, 2018, 2023 శాసనసభ ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి వరుసగా గెలుపొందారు. 1985 నుంచి 1992 వరకు తెలుగు యవత అధ్యక్షుడిగా పనిచేసిన మాగంటి 2014 ఎన్నికల్లో టిడిపి తరపున బరిలోకి దిగారు. తన సమీప మజ్లిస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌పై 9 వేలకుపైగా ఓట్ల ఆధిక్యంతో తొలిసారే విజయం సాధించారు. ఆ తర్వాత బిఆర్ఎస్‌లో చేరి 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పి. విష్ణువర్ధన్ రెడ్డి విజయం సాధించారు. గత ఎన్నికల్లోనూ మరోసారి జూబ్లీహిల్స్ నుంచే పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ అజారుద్దీన్‌పై గెలిచి, హ్యాట్రిక్ సాధించారు.

**మాగంటి భౌతికకాయాన్ని చూసి విలపించిన కెసిఆర్**

మాగంటి గోపీనాథ్ కుటుంబ సభ్యులను బిఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు(కెసిఆర్) పరామర్శించారు. గోపీనాథ్ భౌతికకాయాన్ని చూసి విలపించారు. హైదరాబాద్ మాదాపూర్‌లోని ఎమ్మెల్యే నివాసానికి చేరుకుని శ్రద్ధాంజలి ఘటించారు. మాగంటి గోపీనాథ్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం గోపీనాథ్ భార్య, పిల్లలను ఓదార్చారు. వారికి ధైర్యం చెప్పారు. గోపీనాథ్ కుమారుడు వాత్యల్సనాథ్‌ను దగ్గరకు తీసుకుని ఓదార్చారు. కష్టకాలంలో వారికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మాగంటి కుమారుడిని పట్టుకుని కెసిఆర్ కన్నీళ్లు పెట్టుకున్నారు. అంతకు ముందు మాగంటి గోపీనాథ్ మరణం పట్ల కెసిఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మాగంటి గోపీనాథ్ మరణం పార్టీకి తీరని లోటని అన్నారు. ఆయన మరణానికి చింతిస్తూ సంతాపాన్ని ప్రకటించారు. ఎంతో కష్టపడి రాజకీయాల్లో అంచలంచెలుగా ఎదిగిన గోపీనాథ్ ఎంతో సౌమ్యుడుగా ప్రజానేతగా పేరు సంపాదించారని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ హైదరాబాద్ నగర సీనియర్ రాజకీయ నాయకుడిగా మాగంటి తనదైన స్థానాన్ని సంపాదించుకున్నారని కెసిఆర్ గుర్తుచేసుకున్నారు. మాగంటి మరణంతో శోకతప్తులైన కుటుంబ సభ్యులు, మిత్రులు, అభిమానులకు కెసిఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలియజే శారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిం చారు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి పట్ల బిఆర్ఎస్ నేతలు, మాజీ మంత్రులు కెటిఆర్, టి. హరీశ్ రావు సంతాపం వ్యక్తం చేశారు.

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం**

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం పట్ల సంతాపం ప్రకటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, మాగంటి కుటుంబ సభ్యులకు సిఎం రేవంత్ రెడ్డి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**మాగంటి మృతి పట్ల చంద్రబాబు సంతాపం**

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతిపట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏఐజి ఆసుపత్రిలో చేరిన గోపీనాథ్ చికిత్స పొందుతూ మృతి చెందడం బాధాకరమన్నారు. గోపీనాథ్ రాజకీయ ప్రయాణం తెలుగుదేశం పార్టీతో ప్రారంభమైందని, ఉమ్మడి రాష్ట్రంలో తెలుగు యువత ప్రధాన కార్యదర్శిగా, హైదరాబాద్ అర్బన్ అధ్యక్షుడిగా పని చేశారని ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు గుర్తు చేసుకున్నారు. 2014లో టిడిపి తరపున జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేగా గెలిచిన గోపీనాథ్ మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారని తెలిపారు.

**మాగంటి గోపీనాథ్ కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎపి మంత్రి నారా లోకేశ్ దంపతులు**

జూబ్లీహిల్స్ శాసనసభ్యుడు మాగంటి గోపీనాథ్ అకాల మరణం అందరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటి, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్, ఆయన సతీమణి నారా బ్రాహ్మణి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మాదాపూర్‌లోని మాగంటి గోపీనాథ్ నివాసానికి వెళ్లి ఆయన భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు. తీవ్ర విషాదంలో ఉన్న గోపీనాథ్ కుటుంబ సభ్యులను లోకేశ్, బ్రాహ్మణి దంపతులు పరామర్శించారు. వారికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి, ధైర్యం చెప్పారు. అనంతరం నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా మాగంటి గోపీనాథ్ మృతి పట్ల తన సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని అన్నారు.

### ఆహారం కోసం వెళ్తున్న గాజావాసులపై
## ఇజ్రాయెల్ కాల్పులు
### ఐదుగురి దుర్మరణం

**గాజా :** ఇరాన్ అమానుషకాండ కొనసాగుతూనే ఉంది. ఆకలితో నకనకలాడుతూ దక్షిణ గాజాలో సహాయ పంపిణీ కేంద్రం వద్దకు వెళ్తున్న వారిపై ఆదివారం నాడు ఇజ్రాయెల్ సైనికులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఐదుగురు మరణించగా, వంద మంది గాయపడినట్లు పాలస్తీనా వర్గాలు తెలిపాయి. సైనికులు వద్దకు దూసుకు వస్తుండగా, వారిని హెచ్చరికలు చేస్తూ తమ బలగాలు కాల్పులు చేశాయని ఇజ్రాయెల్ మిలిటరీ ఒక ప్రకటనలో తెలిపింది.

## 12 దేశాలకు అమెరికాలో నో ఎంట్రీ

**వాషింగ్టన్ :** అమెరికాలో ప్రవేశించకుండా 12 దేశాల పౌరులపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన నిషేధం సోమవారం నుండి అమలులోకి రానుంది. విదేశీ ఉగ్రవాదుల నుంచి దేశాన్ని రక్షించుకునేందుకే ఈ చర్య తీసుకున్నట్లు ట్రంప్ తెలిపారు. నిషేధానికి గురైన దేశాలలో అఫ్గానిస్థాన్, మయన్మార్, ఛాడ్, రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఈక్వెటోరియల్ గినియా, హైతీ, ఇరాన్, లిబియా, సోమాలియా, సుడాన్, యెమెన్‌లు ఉన్నాయి

## విస్తరణ

(మొదటి పేజీ తరువాయి)



గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో ఆదివారం మధ్యాహ్నం 12:19 నిమిషాలకు ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, డిప్యూటీ మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొత్తగా ప్రమాణస్వీకారం చేసిన మంత్రులకు సిఎం రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక న్యాయాన్ని పరిగణనలోకి తీసుకుని ఎస్‌సి,ఎస్‌టి,బిసిలకు మాత్రమే ప్రాధాన్యత ఇవ్వాలని కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయించింది. ఇందులో భాగంగా ఎస్‌సి,బిసి వర్గానికి చెందిన వారినే మంత్రివర్గంలోకి తీసుకున్నారు. కాగా మంత్రి పదవులు పొందిన ముగ్గురిలో ఇద్దరు మొదటి సారి ఎంఎల్‌ఏగా గెలుపొందగా, వివేక్ మాత్రం ఎంపిగా గెలిచినప్పటికీ ఆయన కూడా మొదటిసారి ఎంఎల్‌ఏగా గెలుపొందారు. అయితే ఎస్‌టి సామాజిక వర్గానికి చెందిన (లంబాడా) రామచంద్రు నాయక్‌ను శాసనసభ ఉప సభాపతిగా ఎంపిక చేశారు. విస్తరణలో నలుగురికి అవకాశం కల్పించాలని తొలుత ప్రచారం జరిగింది. మంత్రులుగా సుదర్శన్ రెడ్డి, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పేర్లు మొదటి నుంచీ వినిపించినప్పటికీ అధిష్ఠానం ప్రస్తుతం ఎస్‌సి,బిసిలకు మాత్రమే అవకాశం కల్పించింది.

**'గడ్డం' కుటుంబంలో పరిపూర్ణం**

గడ్డం వెంకటస్వామి కుటుంబం మంత్రి పదవిలో పరిపూర్ణం అయింది. తండ్రి వెంకట స్వామి పలుసార్లు మంత్రి పదవులు పొందగా, వివేక్ వెంకట స్వామి సోదరుడు గడ్డం వినోద్ కార్మిక శాఖ మంత్రిగా పని చేశారు. ఆ తర్వాత ప్రస్తుతం వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి దక్కింది. ప్రముఖ కాంగ్రెస్ నాయకుడు దివంగత జి.వెంకటస్వామి కుమారుడు వివేక్ వెంకటస్వామి ఎంబిబిఎస్ పూర్తి చేశారు. ఆయనకు భార్య జి.సరోజ, కుమారుడు వంశీకృష్ణ ప్రస్తుతం వంశీకృష్ణ కాంగ్రెస్ తరపున పెద్దపల్లి ఎంపిగా గెలుపొందారు. మొదటి సారి 2009లో కాంగ్రెస్ తరపున పెద్దపల్లి ఎంపిగా గెలిచారు. 2009లో కాంగ్రెస్ తరపున పెద్దపల్లి పార్లమెంట్ సభ్యునిగా పోటీ చేసి ఎన్నికయ్యారు. తెలంగాణ ఉద్యమ సమయంలో 2013 జూన్‌లో ఆయన టిఆర్ఎస్/బిఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో టిఆర్ఎస్ నుంచి మళ్లీ కాంగ్రెస్‌లో చేరిన వివేక్ ఎంపిగా పోటీ చేసి ఓడిపోయారు.ఆ తర్వాత మళ్లీ 2016లో తిరిగి టిఆర్ఎస్‌లో ఆయన చేరారు. 2019 లోక్‌సభ ఎన్నికలో ఆయనకు బిఆర్ఎస్‌లో ఎంపి టికెట్ దక్కకపోవడంతో ఎన్నికలకు దూరంగా ఉన్నారు. ఆ తర్వాత 2019లోనే ఆయన బిజెపిలో చేరారు. కాగా ఆయన కుమారుడు వంశీ 2024లోక్‌సభ ఎన్నికల్లో పెద్దపల్లి ఎంపిగా గెలుపొందారు.

**విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో అడుగుపెట్టిన అడ్లూరి లక్ష్మణ్**

ఆడ్లూరి నాగయ్య, ఆడ్లూరి లక్ష్మి దంపతులకు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ 1968లో జన్మించారు. ఆయన ఇంటర్,ఐటిఐ(ఎం.ఎం) పూర్తి చేశారు. 1982 –1985 వరకు కరీంనగర్ జిల్లాలో గోదావరి జూనియర్ కళాశాల ఎన్ఎస్‌యుఐ అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1994లో రాజకీయ రంగ ప్రవేశం చేశారు. 1994–96 వరకు యువజన కాంగ్రెస్ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా1996–2001 వరకు ఎపి యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. మొదటి సారి 2006లో ధర్మారం మండలం జెట్‌పిటిసిగా గెలుపొందారు. ఆ తర్వాత 2010 –2012 వరకు కరీంనగర్ జిల్లా జెడ్‌పిపి ఛైర్మన్‌గా పని చేశారు. 2013 నుంచి 14 వరకు ఎపిఎస్‌సి ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పనిచేశారు. 2014, 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున ఎంఎల్‌ఏగా పోటీ చేసి ఓడిపోయారు. 2023 లో అడ్లూరి ఎంఎల్‌గా గెలుపొందారు.

**సర్పంచ్ నుంచి మంత్రి వరకు వాకిటి శ్రీహరి ...**

వాకిటి నర్సింహులు, వాకిటి రాములమ్మ దంపతులకు పట్టిన వాకిటి శ్రీహరి బిఎ పూర్తి చేశారు. గ్రామ సర్పంచ్ నుంచి అంచెలంచెలుగా రాష్ట్ర మంత్రి పదవి వరకు ఎదిగారు. ఆయన ఎన్ఎస్ఐయు, యూత్ కాంగ్రెస్‌తో పాటు కాంగ్రెస్ పార్టీలో వివిధ హోదాలలో శ్రీహరి సేవలను అందించారు. మక్తల్ సర్పంచ్‌గా (2001 నుంచి 2006వరకు),మక్తల్ జెడ్‌పిటిసి (2014 నుంచి 2018 వరకు) పనిచేశారు. నారాయణపేట డిపిపి అధ్యక్షుడు(2022 సెప్టెంబర్ 3 నుంచి 2024 ఫిబ్రవరి వరకు) ఉన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ మక్తల్ మండల్ కార్యదర్శిగా కూడా పనిచేశారు. కృష్ణా జలాల పరిరక్షణ సమితి సభ్యుడిగా వ్యవహరించారు. 2023 డిసెంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో వాకిటి శ్రీహరి 17,000 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. సుదీర్ఘకాలంగా కాంగ్రెస్‌కు విధేయునిగా కొనసాగుతున్నారు. శాసనసభ్యునిగా ఎన్నికైన మొదటిసారే శ్రీహరికి మంత్రి పదవి దక్కడం విశేషం. రాష్ట్ర వ్యాప్తంగా గెలిచిన ఎంఎల్‌ఏలలో ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఒకే ఎంఎల్‌ఎ శ్రీహరి. సామాజిక సమీకరణాలు, విధేయతను పరిగణలోకి తీసుకుని అధిష్ఠానం ఆయనకు మంత్రిగా అవకాశం కల్పించింది. కాగా వాకిటి శ్రీహరి భార్య, తమ్ముడు, మరదలు కూడా ప్రజాప్రతినిధులుగా ప్రజాసేవలో ఉన్నారు.

## పార్లమెంట్ తొలగించడానికి ముందే...

(మొదటి పేజీ తరువాయి)

అతడు లేదా ఆమె తన రాజీనామాను కూడా ఉపసంహరించుకోవచ్చు. పార్లమెంట్ ద్వారా జడ్జిని తొలగించడం అనేది కూడా ఆయన తన పదవి నుంచి తొలగించే మరొక పద్ధతి ఉంది. ఢిల్లీ న్యాయమూర్తిగా ఉన్న సమయంలో జస్టిస్ యశ్వంత్‌వర్మ అధికారిక నివాసంలో నగదు కట్టలు కనుగొనడం పెద్ద చర్చనీయాంశమైన నేపథ్యంలో భారత ప్రధాన న్యాయమూర్తి సంజీవ్‌ఖన్నా రాష్ట్రపతి, ప్రధానమంత్రికి జస్టిస్ వర్మను న్యాయమూర్తి పదవి నుంచి తొలగించాలని కొద్దికాలం క్రితం ఒక లేఖను రాయడం జరిగింది. ఈ కేసును ముగ్గురు న్యాయమూర్తుల హౌస్ కమిటీ దర్యాప్తు చేసింది. ఆ కమిటీ కనుగొన్న విషయాల ఆధారంగా జస్టిస్ ఖన్నా నివేదికను రూపొందించారు. జస్టిస్ ఖన్నా వర్మను రాజీనామా చేయాలని ప్రోత్సహించారు. కానీ జస్టిస్ యశ్వంత్‌వర్మ రాజీనామాను నిరాకరించినట్లు సంబంధితవర్గాలు ఇదివరకే చెప్పిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ ఉభయసభలలో దేనిలోనైనా ఒక తీర్మానాన్ని తీసుకురావచ్చు. రాజ్యసభలో కనీసం 50మంది సభ్యులు ఈ తీర్మానంపై సంతకం చేయాల్సి ఉంటుంది. లోక్‌సభలో కనీసం 100మంది సభ్యులు ఈ తీర్మానానికి మద్దతు ఇవ్వాలి. జడ్జిల (విచారణ) చట్టం1968 ప్రకారం ఒక న్యాయమూర్తిని తొలగించాలంటూ ఏదైనా ఒక సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టిన తర్వాత స్పీకర్ లేదా ఛైర్మన్ సందర్భాన్ని బట్టి తొలగింపు (లేదా ప్రజాదరణ పొందిన పదం ప్రకారం అభిశంసన)ను కోరవచ్చు. ఈ కమిటీలో భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) లేదా సుప్రీం కోర్టు న్యాయమూర్తి, 25హైకోర్టలలో ఏదైనా ఒక హైకోర్ట్‌కు సంబంధించిన ప్రధాన న్యాయమూర్తి, ఒక ప్రముఖ న్యాయ నిపుణుడు ఉంటారు. పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరెణ్ రిజిజు గత వారం దీనిపై స్పందించిన సమయంలో ప్రస్తుతం ఈ కేసు 'కొంచెం భిన్నంగా' ఉంది అని చెప్పారు. హౌస్ కమిటీని ఏర్పాటు చేసిన తర్వాత భారత ప్రధాన న్యాయమూర్తి ఇప్పటికే తన నివేదికను అందజేశారని కేంద్రమంత్రి కిరెణ్ రిజుజు ఇప్పటికే చెప్పి ఉన్నారు. 'కాబట్టి ఈ విషయంలో మేం ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటాం' అని రిజిజు చెప్పారు.ఈ ప్రక్రియలను అనుసరించాల్సి ఉందని, అయితే 'ఇప్పటికే నిర్వహించిన విచారణను ఎలా ఏకీకృతం చేయాలో నిర్ణయించాల్సి ఉంది' అని మంత్రి కిరెణ్ రిజుజు తెలిపారు.'నియమం ప్రకారం ఒక కమిటీని నియమించాలి. ఆ కమిటీ ఒక నివేదికను సమర్పించాలి. నివేదికను ఆ నివేదికను భ ముందు అభిశంసన కోసం చర్చలు ప్రారంభం అవుతాయి.ఇక్కడ పార్లమెంట్ ద్వారా కాకుండా ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేశారు.కానీ దానిని పక్కన పెట్టలేం' ఎందుకంటే దానిని సిజెఐ ఏర్పాటు చేశారు అని ఆయన చెప్పారు.పార్లమెంట్ వర్షాకా సమావేశాలు జూన్ 21న ప్రారంభమై ఆగష్టు 12న ముగుస్తాయి. దేశరాజధానిలో జస్టిస్ యశ్వంత్ వర్మ ఢిల్లీ జడ్జిగా ఉన్న సమయంలో ఆయన అధికారిక నివాసంలో కాలిపోయిన డబ్బుకట్టలు కనుగొనబడిన విషయం విదితమే.

## నేడు సిట్ విచారణకు ప్రభాకరరావు?

(మొదటి పేజీ తరువాయి)

పాస్‌పోర్టును గతంలోనే దర్యాప్తు అధికారులు రద్దు చేశారు. అయితే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అతనికి తాత్కాలిక పాస్‌పోర్టు మంజూరు చేశారు. పాస్‌పోర్టు మంజూరు చేసిన మూడు రోజుల్లో భారత్‌కు రావాలని కూడా కోర్టు ఆదేశాలు ఉన్నాయి. అయితే ఈ నెల ఆరున ప్రభాకరరావుకు తాత్కాలిక పాస్‌పోర్టు మంజూరు చేసినట్లు తెలిసింది. ఈ లెక్కన ప్రభాకరావు ఆదివారం అర్ధరాత్రి లేదా సోమవారం తెల్లవారు జామున భారత్‌కు చేరుకోనున్నట్లు సమాచారం. హైదరాబాద్‌కు చేరుకున్న వెంటనే అతను ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ అధికారి జూబ్లీహిల్స్ ఎసిపి వద్ద హాజరుకావాల్సి ఉంది. ఈ కేసులో 2018–23 మధ్యకాలంలో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, విపక్ష నాయకులు, వ్యాపారవేత్తలు, జర్నలిస్టులు, ఉన్నతాధికారులు, న్యాయమూర్తుల ఫోన్ కాల్‌లను అనధికారికంగా ట్యాప్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కార్యకలాపాలు బిఆర్ఎస్ ప్రభుత్వానికి రాజకీయ ప్రయోజనాలు కల్పించేందుకు జరిగినట్లు తెలంగాణ పోలీసులు ఆరోపిస్తున్నారు.ప్రభాకర్ రావు జూన్ సోమవారం విచారణకు హాజరైన తర్వాత, ఈ కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

## అందుకే మేం దాడులు చేస్తున్నాం : ఐడీఎఫ్

**టెల్‌అవీవ్ :** గాజాలో హమాస్ ను తుడిచిపెట్టేయడమే లక్ష్యంగా ఆస్పత్రులు, పౌర ఆవాసాలను సైతం వదలకుండా దాడులు చేస్తున్న ఇజ్రాయిల్ సైన్యం (ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్స్‌ఐడీఎఫ్)పై ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వ్యక్తమవుతున్న సంగతి విదితమే. వివిధ దేశాధినేతలు ఇప్పటికే ఇజ్రాయిల్ తీరును తప్పుబడుతున్నారు. ప్రధాని నెతన్యాహు ధోరణిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే గాజాపై తమ దాడులను సమర్థించుకుంటూ ఐడీఎఫ్ తాజాగా ఓ వీడియో బయటపెట్టింది. ఖాన్ యూనిస్‌లోని ఒక కీలక ఆస్పత్రి కింద హమాస్ సొరంగం కనుగొన్నామంటూ ఆ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. వీడియోలోని దశ్యాలను గమనిస్తే... యూరోపియన్ హాస్పిటల్ కాంపౌండ్‌లో సొరంగం కనిపిస్తోంది. హమాస్ కమాండ్‌అండ్ కంట్రోల్ సెంటర్‌గా ఉపయోగిస్తోందని, ఇక్కడి నుంచే ఇజ్రాయిల్‌పై దాడులకు ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ఐడీఎఫ్ ఆరోపించింది.

## తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు

(మొదటి పేజీ తరువాయి)

చాలా ప్రాంతాల్లో ఊరేగింపులు, ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఇంఫాల్‌లోని కావాకేథెల్, యురిపోక్ తదితర ప్రాంతాల్లో ఆందోళనకారులు రోడ్లపైకి వచ్చి నిరసనలు వ్యక్తం చేశారు. కొంత మంది టైర్లకు, వాహనాలకు నిప్పటించారు. ఆందోళనకారులు, భద్రతా బలగాలకు మధ్య ఘర్షణ చెలరేగింది. కావాకేథేల్ అవుట్‌పోస్టుపై ఆందోళనకారులు దాడికి దిగిన ఘటనలో ఇద్దరు జర్నలిస్టులుసహా ముగ్గురు గాయపడినట్టు సమాచారం. మణిపూర్‌లో మైతీ వర్గానికి చెందిన అత్యంత శక్తివంతమైన యుజవన సంస్థ అరాంబాయ్ టెంగోల్. ఈ సంస్థకు చెందిన పలువురు కీలక నాయకులను ప్రభుత్వం అరెస్టు చేసిందన్న వార్త మీడియాలో చక్కర్లు కొట్టింది. సోషల్ మీడియా ఈ విషయంపై ప్రత్యేక కథనాలు రావడంతో, మైతీ వర్గానికి చెందిన వారు ఆందోళనకు దిగడంతో, పరిస్థితులు చేదాటే ప్రమాదం కనిపిస్తున్నది. ఆదివారం ఉదయం నుంచి హింసాత్మక ఘటనలు జరగకపోయినప్పటికీ, ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న భయాందోళనలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఇంఫాల్ వెస్ట్, ఇంఫాల్ ఈస్ట్, తౌబల్, బిష్ణుపూర్, కాక్‌చింగ్ జిల్లాల్లో శనివారం రాత్రి 11.45 నుంచి ఐదురోజుల పాటు ఇంటర్నెట్, మొబైల్ డాటా, విఎస్‌ఎటి, విపిఎస్ సర్వీసులను రద్దు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. కాగా, నిరసనలు, ఆందోళనలు చోటుచేసుకున్న జిల్లాల్లో భద్రతా బలగాలను మోహరించారు. అల్లరి మూకలను చెరరగొట్టడానికి కొన్ని ప్రాంతాల్లో భద్రతా బలగాలు గాల్లో కాల్పులు జరిపిన ఘటనను దృష్టిలో ఉంచుకొని, ఉన్నతాధికారు విస్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. సోషల్ మీడియా లేదా మరేదైనా మాధ్యమాన్నయినా ఉపయోగించుకొని, ఉద్రిక్తతలు రెచ్చగొట్టే ప్రయత్నాలను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

**మణిపూర్ సంక్షోభ నిర్వహణ ఏదీ?**
**మోదీపై కాంగ్రెస్ ధ్వజం**

న్యూఢిల్లీ : మణిపూర్ రాజధానితో పాటు లోయ ప్రాంతాల్లో మళ్లీ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొనడంపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ పార్టీ ఆదివారం తీవ్ర విమర్శలు గుప్పించింది. రాష్ట్రంలోని ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆదివారం 'ఎక్స్' లో 'మణిపూర్ ప్రజల బాధ, వేదన తగ్గకుండా కొనసాగుతోంది' అని పేర్కొన్నారు. మణిపూర్ మండుతున్నప్పటికీ, ప్రధాన మంత్రి మోదీ రాష్ట్రంలోని రాజకీయ లేదా పౌర సమాజ నాయకులను కలవలేదని, సంక్షోభ నిర్వహణను పూర్తిగా కేంద్ర హోం మంత్రికి వదిలివేశారని ఆరోపించారు. జూన్ 4, 2023న కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ గడువు అనేక సార్లు దాటిందని, ఇప్పుడు నవంబరు 2025 నాటికి తన నివేదికను సమర్పించే అవకాశం జైరాం రమేశ్ గుర్తు చేశారు. మణిపూర్‌లో 'రాజ్యాంగ యంత్రాంగం పూర్తిగా విచ్ఛిన్నం' పై సుప్రీం కోర్టు ఆగస్టు 2023లో చేసిన వ్యాఖ్యను కూడా ఆయన ప్రస్తావించారు. ఈ సంవత్సరం ఫిబ్రవరిలో కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానాన్ని ప్రకటించిన తర్వాత మాత్రమే రాష్ట్రపతి పాలన విధించడంలో జాప్యాన్ని విమర్శించారు. 'అయితే రాష్ట్రపతి పాలన వల్ల ఎటువంటి తేడా లేదు' అని ఆయన అన్నారు. శాంతిభద్రతలు దెబ్బతినడంతో గవర్నర్ ఇప్పుడు విమానాశ్రయం నుంచి రాజ్ భవన్‌కు హెలికాప్టర్‌లో ప్రయాణించాల్సి వచ్చిందని ఆరోపించారు. మణిపూర్‌లో తీవ్రమవుతున్న సంక్షోభాన్ని పరిష్కరించడానికి కాకుండా ప్రపంచాన్ని పర్యటించడానికి సమయం దొరికిన 'తరచుగా ప్రయాణించే ప్రధాన మంత్రి'గా మోదీని ముద్ర వేశారు. 'ప్రధాన మంత్రి ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు ప్రయాణించారు. కానీ మణిపూర్‌కు చెందిన రాజకీయ నాయకులు లేదా పౌర సమాజ సంస్థలను ఎప్పుడూ కలవలేదు. కేంద్రం విధానం నిర్లక్ష్యంగా, పూర్తిగా ఉదాసీనంగా' అని పేర్కొన్నారు.

## యువకుల మృతదేహాలు లభ్యం

(మొదటి పేజీ తరువాయి)

చేసే క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యారు.తన కుమారులతో పాటు ఒక్కొక్కరు నీట మునిగి గల్లంతౌతుంటే ఏమి చేయలేని పరిస్థితిలో వెకటస్వామి హతాషుడయ్యాడు ఒక్కరు సురక్షితంగా బయటపడ్డారు.గల్లంతైన వారిలో అంబట్ పల్లి గ్రామానికి చెందిన పట్టి మదుసూదన్ 18,పట్టి శివ మనోజ్ 15,తౌగరి రక్షిత్,13,కర్నాల సాగర్ 16,మహా ముత్తారం కొర్లకుంటకు గ్రామానికి చెందిన పండు 18;రాహుల్ 19 ఉన్నారు.యువకుల గల్లంతు సమాచారం అందుకున్న రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి వెటనే జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడంతో అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని సింగరేణి రెస్క్యూ టీం గజ ఈతగాళ్లతో మృతదేహాల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.అర్ధరాత్రి వరకు గాలింపు చేట్టినా ఆచూకి లభించలేదు.శనివారం సాయంత్రం జరిగిన ఘటనతో మృతుల కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక సహాయకునితో మృతదేహాలను ఆసుపత్రికి పంపించి చేయవలసిన కార్యక్రమాలకు ఏర్పాట్లు చేసారు. వారి కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని తెలిపారు.

## 'బుజ్జగింపుల' పర్వం

(మొదటి పేజీ తరువాయి)

తన ప్రెస్‌మీట్‌ను వాయిదా వేసుకున్నారు. అయితే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మాత్రం అందుబాటులో రాలేదని తెలిసింది. మొత్తానికి ప్రస్తుతం ఆరు మంత్రిపదవిలో ముగ్గురికి అవకాశం కల్పించడం, సామాజిక సమతుల్యత, అధిష్టాన ఆలోచన విధానం తదితర అంశాలు బుజ్జగింపు ప్రతినిధి బృందం ఆశావాహులకు వివరించింది. భవిష్యత్తులో మంచి అవకాశాలు ఉంటాయని,పార్టీకి చేసిన సేవలను అధిష్టానం గుర్తిస్తుందని వారు హామీనిచ్చినట్టు సమాచారం.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఆరోగ్యం కోసం యోగా




ప్రజాపక్షం/హైదరాబాద్: మంచి ఆరోగ్యం పొందాలంటే ప్రతి ఒక్కరూ యోగ చేయాలని ప్రభుత్వ హోమియో ఆసుపత్రి, మోతీగల్లి, చార్మినార్, సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ దేవి అన్నారు.అంతర్జాతీయ యోగా దినోత్సవం 2025 పురస్కరించుకొని ఆదివారం యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో ప్రతి ఒక్కరూ వివిధరకాల ఒత్తిళ్లకు గురవ్వుతూ అనారోగ్యాల పాలవుతున్నారని పేర్కొన్నారు. ఆరోగ్య సమస్యలను అధిగమించడానికి తమకు వీలున్న సమయంలో తప్పనిసరిగా యోగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

## చేప ప్రసాదం పంపిణీకి భారీగా తరలివచ్చిన ఆస్తమా బాధితులు



ప్రజాపక్షం/హైదరాబాద్ : మృగశిర కార్తె సందర్భంగా హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ మైదానంలో చేప ప్రసాదం పంపిణీని ఆదివారం బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, పిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, మత్స్య శాఖ అభివృద్ధి చైర్మన్ మెట్టు సాయికుమార్, మాజీ ఎంపిలు, మధుయాష్కీ గౌడ్, వి.హనుమంతరావులకు బత్తిని కుటుంబం చేప ప్రసాదం వేసి ఈ కార్యక్రమాన్నిలాంఛనంగా ప్రారంభించారు. ఆస్తమా, శ్వాస సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి గడిచిన 170 సంవత్సరాలుగా ప్రతి ఏటా బత్తిని కుటుంబ సభ్యులు చేప ప్రసాదం పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాది కూడ చేపప్రసాదం పంపిణీకి ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, బీహార్, ఉత్తరప్రదేశ్, నుంచి అస్తమా బాధితులు భారీగా తరలి వచ్చారు. 13 కౌంటర్లు, ద్వారా చేప ప్రసాదం పంపిణీ చేస్తున్నారు. ఇందుకు సంబంధించి 42 క్యూలైన్లను ఏర్పాటు చేశారు. సోమవారం కూడ ఈ కార్యక్రమం కొనసాగనుంది. జెబిఎస్, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, కాచిగూడ, ఎంజిబిఎస్, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌కు 150 ప్రత్యేక బస్సులను నడిపంది. పోలీసు శాఖ 1200 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

**చేపప్రసాదంపై ప్రజలకు విశ్వాసం ఉంది : మంత్రి పొన్నం ప్రభాకర్**

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బత్తిని కుటుంబం పంపిణీ చేస్తున్న చేప ప్రసాదంపై ప్రజలకు ప్రగాఢ విశ్వాసం ఉందన్నారు. ఆస్తమా ఉబ్బసంతో ఇబ్బందులు పడుతూ చేప ప్రసాదం తీసుకున్నవారు చాలామంది ఈ వ్యాధుల నుండి విముక్తి పొందరన్నారు. పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ మృగశిర కార్తె రోజున చేప ప్రసాదం తీసుకుంటే అనేక వ్యాధులు మటుమాయం అవుతాయని ప్రజల విశ్వాసం అని తెలిపారు. రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రజల్లో చేప ప్రసాదంపై ప్రగాఢ నమ్మకం ఉందని, అందుకు దేశ విదేశాల నుండి అధిక సంఖ్యలో చేప ప్రసాదం తీసుకోవడమే నిదర్శనమని తెలిపారు. మత్స్యశాఖ అభివృద్ధి చైర్మన్ మెట్టు సాయి కుమార్ మాట్లాడుతూ శ్వాసకోశ వ్యాధులకు మృగశిర కార్తె రోజున వంశపారంపర్యంగా చేప ప్రసాదం ఉచితంగా పంపిణీ చేస్తున్న బత్తిని కుటుంబ సభ్యుల సేవలను అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా అనేక ఏళ్లుగా ప్రజలకు సేవ చేస్తున్నామని, అందుకు గుర్తింపుగా పద్మశ్రీ అవార్డును ఇప్పించాలని కుటుంబ సభ్యులు కోరడంతో ఇందుకు తన వంతు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ కమిషనర్ ప్రియాంక, స్థానిక కౌన్సిలర్ రాజేష్ జైశ్వాల్, సికింద్రాబాద్ ఆర్‌డిఓ సాయిరాం, బత్తిని కుటుంబ సభ్యులు కర్ణాటక రాష్ట్ర ఎంఎల్‌సి మంజుల బండారి, అధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**ప్రసాదం పంపిణీలో అపశ్రుతి..**

ప్రసాదం తీసుకునేందుకు క్యూలైన్‌లో నిలబడిన మెదక్ జిల్లాకి చెందిన సత్యనారాయణ (75) వృద్ధుడికి గుండెపోటు రావడంతో స్పృహ తప్పి పడిపోయాడు. వైద్యులు పరీక్షించి, సీపీఆర్ చేసినప్పటికీ ప్రాణాలు దక్కలేదు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి దత్తాత్రేయ

### 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకావిష్కరణలో మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్



ప్రజాపక్షం/హైదరాబాద్ : సామాన్య జీవితం నుంచి అత్యున్నతమైన శిఖరాలకు చేరుకున్న సాధారణ జీవితాన్నే గడుపుతున్న బండారు దత్తాత్రేయ లాంటి మనిషిని మనం ఎక్కడ చూస్తామని, ఆయన ప్రజల మనిషి అని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. హైదరాబాద్‌లోని శిల్పకలావేదికలో ఆదివారం హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ జీవిత చరిత్ర ఆధారంగా రాసిన 'ప్రజల కథే నా ఆత్మకథ' పుస్తకాన్ని రామ్‌నాథ్ కోవింద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి అలయ్ బలయ్ ఫౌండేషన్ ఛైర్ పర్సన్ బండారు విజయలక్ష్మి అధ్యక్షత వహించగా సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఒరిస్సా గవర్నర్ కంభంపాటి హరిబాబు, ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్, త్రిపుర గవర్నర్ ఇంద్రసేనా రెడ్డి, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, భూపతిరాజు శ్రీనివాస్ వర్మ, రాష్ట్ర మంత్రులు కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, ఎపి మంత్రి సత్యకుమార్, సుప్రీంకోర్టు రిటైర్డ్ చీఫ్ జస్టిస్ ఎన్.వి. రమణ, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా రామ్‌నాథ్ కోవింద్ మాట్లాడుతూ ఆయన జీవిత చరిత్ర పుస్తకంలో ఒక శత్రువు కూడా ఉండరన్నారు. బండారు దత్తాత్రేయ బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు. ఎమర్జెన్సీలో జైలు జీవితం గడిపినప్పుడు తన సహచరులను నిరాశ నిస్పృహలకు గురికాకుండా ఎప్పటికప్పుడు ప్రోత్సహించేవారన్నారు. ఆయన జీవితంలో ఎంపిగా, కేంద్రమంత్రిగా, గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారన్నారు.

**రాజకీయాల్లో వాజ్‌పాయ్‌కి ఉన్నంత గౌరవం దత్తాత్రేయకు ఉంది : సిఎం రేవంత్ రెడ్డి**

తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ దత్తన్న ప్రజల మనిషి అని, రాజకీయాల్లో వాజ్‌పాయ్‌కి ఉన్నంత గౌరవం దత్తాత్రేయకు ఉందన్నారు. గౌలిగూడ నుంచి హర్యానా గవర్నర్‌గా ఎదిగారన్నారు. ఏ స్థాయిలో ఉన్నా దత్తన్న తన మూలాలు మర్చిపోలేద్నారు. దత్తన్న దగ్గర రాజకీయాల్లో స్కూల్ పాఠాలు నేర్చుకున్నానని, చంద్రబాబు దగ్గర రాజకీయాల్లో కాలేజ్ పాఠాలు నేర్చుకున్నానని, రాహుల్ గాంధీ దగ్గర రాజకీయ ఉద్యోగం చేస్తున్నా అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఎంత ఉన్నత పదవిలో ఉన్నా దత్తన్న సామాన్యుడిగానే ఉన్నారన్నారు. అలయ్ బలయ్ కార్యక్రమం తెలంగాణ ఉద్యమానికి ఒక స్ఫూర్తిగా పనిచేసిందన్నారు. ప్రజలతో అనుబంధాన్ని ఆత్మకథ పుస్తకంలో దత్తాత్రేయ పంచుకున్నారని తెలిపారు. ఏ రోజూ దత్తాత్రేయ ప్రజలతో సంబంధాలు కోల్పోలేదన్నారు. దత్తాత్రేయ, కిషన్ రెడ్డితో తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని వివరించారు. పుస్తకావిష్కరణకు అన్ని పార్టీల నేతలు వచ్చారని, దత్తాత్రేయ బిజెపి నేత అని, పార్టీ కార్యక్రమం అనే భావన ఎవరికీ లేదని తెలిపారు. ఒక మర్యాద కలిగిన రాజకీయ నాయకుడిగా చూస్తారని తెలిపారు. పిజెఆర్, దత్తాత్రేయ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. జంటనగరాల్లో పేదలకు కష్టం వచ్చినపుడు గుర్తొచ్చేది వీరు ఇద్దరే అని కొనియాడారు. తాము తీసుకునే నిర్ణయాల్లో పిజెఆర్, దత్తాత్రేయ స్ఫూర్తి ఖచ్చితంగా ఉంటుందన్నారు. నూతనంగా రాజకీయాల్లోకి వచ్చే వారు దత్తాత్రేయ ఆటో బయోగ్రఫీ పుస్తకం చదవాల్సిన అవసరం ఉందని సూచించారు. నేటితరం నేతలకు ఆదర్శమని రేవంత్ రెడ్డి అన్నారు. ఇటీవల ప్రధాని మోదీతో నీతి ఆయోగ్‌లో పాల్గొన్న విషయాన్ని గుర్తుకు చేశారు. మధ్యాహ్నం భోజనం చేసే సమయంలో ప్రధానితో ఈ విషయం మాట్లాడినట్లు చెప్పుకొచ్చారు.

**దత్తాత్రేయ జెంటిల్‌మ్యాన్‌కు ప్రతి రూపం : సిఎం చంద్రబాబు**

బండారు దత్తాత్రేయ జెంటిల్ మ్యాన్‌కు ప్రతిరూపమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రశంసించారు. సాధారణ కార్యకర్త నుంచి జాతీయ నేతగా ఎదిగారని కొనియాడారు. ఎన్నో పోరాటాలు, ఉద్యమాలు, సంఘర్షణలు ఎదుర్కొన్నారన్నారు. నలభై ఏళ్ల క్రితం పాత రోజులు ఇప్పుడు గుర్తుకు వస్తున్నాయని చెప్పారు. దత్తాత్రేయది పేరుకు హిందుత్వం, మతం భారతీయమని వ్యాఖ్యానించారు. అలయ్ బలయ్ అంటే జ్ఞాపకం వచ్చేది దత్తాత్రేయ అన్నారు. దత్తాత్రేయ కోరుకున్నది జనహితం, ఆయనది లౌకికవాదమని కొనియాడారు. లేఖలు రాయడంలో దత్తాత్రేయ అంబాసిడర్‌గా నిలిచారన్నారు. దత్తాత్రేయ నిబద్ధత, నిరాడంబరత, ప్రజా సంక్షేమం పట్ల ఆయనకున్న అంకితభావాన్ని ప్రశంసించారు. ఈ పుస్తకం భావి తరాల నాయకులకు మార్గదర్శకంగా నిలుస్తుందని, ఆయన జీవితంలోని ఒడిదొడుకులు, విజయాలు ఎంతో స్ఫూర్తినిస్తాయన్నారు. సీనియర్ ప్రజా సేవకుల జీవితానుభవాలను గ్రంథస్థం చేయడం సమాజానికి ఎంతో అవసరమని, వారి కథనాలు మార్గదీపికలుగా ఉపయోగపడతాయని చంద్రబాబు అన్నారు.

**డైపర్లు మార్చినట్లు పార్టీలు మారుస్తున్నారు : వెంకయ్యానాయుడు**

దత్తాత్రేయ జీవిత చరిత్ర ప్రజలకు అవసరం లేదని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. ఆయన జీవితమంతా తెరిచిన పుస్తకం లాంటిదన్నారు. మచ్చలేని నాయకుడిగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. పదవులు ఉన్నా, లేకున్నా, దత్తాత్రేయ ఒకే పార్టీలో కొనసాగారన్నారు. కొంతమంది పిల్లలకు డైపర్లు మార్చినట్లు పార్టీలు మారుస్తున్నారని విమర్శించారు. విలువలతో కూడిన విమర్శలు చేయాలని, అవి కూడా పదునుగా ఉండాలని సూచించారు. విమర్శలు ఎప్పుడూ కూడా దిగజారి చేయకూడదన్నారు. బూతులు మాట్లాడే వారిని ప్రజలు కూడా సహించరని, ఓట్ల ద్వారా బుద్ధి చెప్పుతారన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అలాంటి వారు ఒక్కరు గెలవలేదన్నారు. లక్ష్యం, అంకితభావంతో పనిచేసే వారి సంఖ్య రాను రాను తగ్గిపోతోందన్నారు. నేటి తరం రాజకీయ నాయకులు దత్తాత్రేయను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విలువలతో కూడిన రాజకీయం చేయాలని సూచించారు.

## ఆరోగ్యంగా ఉండటం అత్యంత అవసరం



### రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్

ప్రజాపక్షం/హైదరాబాద్: ఆరోగ్యంగా ఉండటం ప్రస్తుత కాలంలో అత్యంత అవసరమని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ పేర్కొన్నారు. సికింద్రాబాద్ రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగిన "ఫిట్ ఇండియా సైక్లోథాన్" కార్యక్రమాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సైకిల్ యాత్రలో ఇతర రైల్వే అధికారులు, క్రీడాకారులతో కలిసి అరుణ్‌కుమార్ జైన్ స్వయంగా సైక్లింగ్‌లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎస్‌సిఆర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖేలో ఇండియా స్కీమ్ ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ.. యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వశాఖ పర్యవేక్షణలో, ఆరోగ్యాన్ని మన దైనందిన జీవితంలో భాగంగా మార్చే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టబడిందన్నారు. రైల్వే ఉద్యోగులకు ఆరోగ్యపరమైన జీవనశైలిని ప్రోత్సహించడమే దీని ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. దక్షిణ మధ్య రైల్వేలో ఫిట్‌నెస్‌ను ప్రోత్సహించే క్రమంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టిన రైల్వే క్రీడా సంఘాన్ని ఆయన అభినందించారు. ఫిట్ ఇండియా ఉద్యమం దేశవ్యాప్తంగా ఆరోగ్యంపై ప్రజల్లో చైతన్యం కలిగించిందనీ పేర్కొన్నారు. సైక్లింగ్ మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. విదేశాల్లో ఇప్పుడు మళ్లీ చాలా మంది ఫిట్‌నెస్ కోసం సైక్లింగ్‌కు మళ్లుతున్నారనీ తెలిపారు. దీనివల్ల పర్యావరణ హితమైనదే కాకుండా శారీరక ఆరోగ్యానికి చాలా మంచిదని ఆయన పేర్కొన్నారు. ప్రతి రైల్వే ఉద్యోగి ఈ ఉద్యమంలో చురుకుగా భాగస్వామి కావాలని జీఎం పిలుపునిచ్చారు. దక్షిణ మధ్య రైల్వే అదనపు ప్రధాన నిర్వహణాధికారి నీరజ్ అగర్వాల్, డిఆర్ఎం భర్తేష్ కు మార్ జైన్ (సికింద్రాబాద్ డివిజన్), ఇతర సీనియర్ రైల్వే అధికారులు, దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు, రైల్వే క్రీడాకారులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలపై బాధితుడే ఫిర్యాదు చేయాలని లేదు

### ఎవరైనా ఫిర్యాదు చేయొచ్చు : హైకోర్టు ఉత్తర్వులు



ప్రజాపక్షం/హైదరాబాద్: అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేయాల్సిన వ్యక్తి ఆ నిర్మాణం వల్ల బాధితుడై ఉండనక్కర్లేదని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. బాధితుడే ఫిర్యాదు చేయాలని లేదని, ఎవరైనా అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు చేయవచ్చునని తెలిపింది. ఇలాంటి ఫిర్యాదులపై ఆఫీసర్లు చర్యలు తీసుకోకపోతే కోర్టుకు రావచ్చునని చెప్పింది. నగరంలోని బేగంపేట బీఎస్ మక్తాలో 400 చదరపు గజాల్లో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ సీహెచ్ అనిత దాఖలు చేసిన వ్యాజ్యాన్ని డిస్మిస్ చేస్తూ న్యాయమూర్తి జస్టిస్ టి.వినోద్ కుమార్‌పై తీర్పు చెప్పారు. పిటిషనర్‌కు ఆమె కుమారుడికి పక్కపక్కనే 200 గజాలు చొప్పున స్థలాలుంటే వాటిలో నిర్మాణాలకు వేర్వేరుగా జీహెచ్ఎంసీని పర్మిషన్లు తీసుకున్నారు. తర్వాత రెండు అంతస్తులను మొత్తం 400 గజాల జాగాలో నాలుగు అంతస్తులుగా నిర్మాణ అనుమతులు సవరించారు. ఆ తర్వాత ఐదు అంతస్తులు నిర్మాణం చేశారు. అక్రమ నిర్మాణాల క్రమబద్ధీకరణకు అప్లికేషన్ కూడా పెట్టుకున్నారు. దీనిపై నరేందర్ అనే వ్యక్తి ఫిర్యాదు చేస్తే అధికారులు పట్టించుకోలేదని హైకోర్టును ఆశ్రయించారు. అక్రమ నిర్మాణాలను కూల్చేయాలని హైకోర్టు గతంలో ఇచ్చిన ఉత్తర్వుల కేసులో తాము ప్రతివాది కూడా కాదని, బాధితుడు కాని నరేందర్ అనే వ్యక్తి వేసిన కేసులో చర్యలు తీసుకోవాలన్న ఆదేశాలను రద్దు చేయాలని అనిత వేసిన తాజా పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. అక్రమ నిర్మాణాలపై నేరుగా బాధితుడే ఫిర్యాదు చేయాలనేమీ లేదని, ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చునని తీర్పు చెప్పింది. రెగ్యులరైజేషన్ అప్లికేషన్‌పై ప్రవీణ్‌కుమార్ కేసులో ఇదే హైకోర్టు ఇచ్చిన గైడ్‌లైన్స్ మేరకు చేయాలని జీహెచ్ఎంసీని ఆదేశించింది.

## ప్రజాసేవలో సిఆర్ ఫౌండేషన్ ముందుంటుంది

### సిఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ కె. నారాయణ



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: ప్రజలకి సేవలు అందించడంలో సిఆర్ ఫౌండేషన్ ఎప్పుడూ ముందు ఉంటుందని సిఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ అన్నారు. హైదరాబాద్ కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్‌లో రోటరీ వారి సౌజన్యంతో నూతనంగా ఏర్పాటు చేసిన సిఆర్ పాలిక్లినిక్ సిటీ స్కాన్ మిషన్‌ను ముఖ్యఅతిథిగా హాజరైన సత్య బొల్లి ప్రొఫిలిక్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ సిటీ రిపోర్టింగ్ రూమ్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ సిటీ స్కాన్ 3296 స్లైడ్స్‌తో 5 ఎంఎం లోపలి వరకు సిటిలు తీయవచ్చునని చెప్పారు. కొండాపూర్ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకి తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండేలా ప్రజలు అందరూ ఉపయోగించుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ డెక్కన్ ప్రెసిడెంట్ జస్విందర్ బార్గి, ప్రోగ్రాం కోఆర్డినేటర్ మిస్టర్ నితీష్ స్వాగతం పలికి ప్రెసిడెంట్ జస్వింధర్ బైర్గి, సిఆర్ఎఫ్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కే నారాయణ,డిస్టిక్ గవర్నర్ శరత్ చౌదరి, శ్రీ సత్య బొల్లి, డాక్టర్ జయం చుక్క, ప్రొఫసర్ డి ప్రసాద్ రావు పద్మశ్రీ అవార్డు గ్రహీతని వేదికపైకి ఆహ్వానించారు. ప్రెసిడెంట్ బైర్గి అధ్యక్షత వహించి సిఆర్ఎఫ్ రోటరీ కోపరేషన్ గురించి మాట్లాడారు. రోటరీ వారు చొరవ తీసుకొని తీసుకుని సిటీ స్కాన్ మిషన్ ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు చెప్పారు. మునుముందు ప్రజలకి సేవలు అందించడంలో సిఆర్ ఫౌండేషన్ ఎప్పుడూ ముందు ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో డిస్టిక్ గవర్నర్ శరత్ చౌదరి, ప్రొఫసర్ ప్రసాద్ రావు డాక్టర్ రజిని వందన సమర్పణ చేయగా ప్రొఫసర్ బి.రంగారెడ్డి, సిఆర్ఎఫ్ కోశాధికారి వి చెన్నకేశవరావు, డాక్టర్ అరుణ, డాక్టర్ కేజియా, డాక్టర్ భరత్, డాక్టర్ ఉమా, అలానే రోటరీ వారు శైలేష్, డాక్టర్ జయంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి సహకరించిన సిఆర్ పాలీ క్లినిక్ స్టాఫ్‌కి, ఓల్డ్ ఏజ్ హోమ్ స్టాఫ్‌కి ధన్యవాదాలు తెలిపారు.

## కార్యకర్తలకు కాంగ్రెస్ సముచిత గౌరవం

### మీడియాతో మంత్రులు : లక్ష్మణ్, వివేక్, శ్రీహరి

ప్రజాపక్షం/హైదరాబాద్ : సామాన్య కార్యకర్తగా పార్టీలోకి వచ్చిన తనకు పార్టీ సముచితంగా గౌరవం కల్పించిందని, ఏ శాఖ ఇచ్చిన బాధ్యతతో పని చేస్తానని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అన్నారు. ప్రమాణ స్వీకారం అనంతరం రాజ్ భవన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ మంత్రిగా తనకు అవకాశం కల్పించిన ఎఐసిసి అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సిఎం ఎ.రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. బాధ్యతతో పనిచేస్తా, గత 10 ఏళ్ల కేబినెట్‌లో సామాజిక కూర్పు లేదని, అదే కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగ బిడ్డకు న్యాయం చేసిందని హర్షం వ్యక్తం చేశారు.

**15 రాజకీయ జీవితం తర్వాత మంత్రి పదవి : మంత్రి వివేక్**

తన 15 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇప్పుడు మంత్రి పదవి రావడం ఆనందంగా ఉందని మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. కాకా స్ఫూర్తితోనే రాజకీయాల్లోకి వచ్చానని, ఆయన అడుగు జాడల్లోనే పేద ప్రజలకు సేవ చేస్తున్నానని తెలిపారు. దక్కిందని. తెలంగాణ ఉద్యమంలో ఎన్నో నిర్బంధాలు అనుభవించానని, ఉద్యమ సమయంలో నా వ్యాపారాలను దెబ్బకొట్టాలని చూశారని, అయినా తెలంగాణ సాధనలో ఎంతో కీలక పాత్ర పోషించానని తెలిపారు. ఆ తర్వాత బిఆర్ఎస్ నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేశానని, అధికారంలో ఉన్నా, లేకపోయినా ప్రజాసేవ కొనసాగించానన్నారు. తనకు మంత్రి పదవి వచ్చిందని సిఎం రేవంత్ రెడ్డి తనకు ఫోన్ చేసి చెప్పారన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో అన్ని వర్గాలకు చోటు దక్కిందని చెప్పారు. ఆయన పేర్కొన్నారు.

**సామాజిక న్యాయానికి కేరాఫ్ కాంగ్రెస్ : మంత్రి వాకిటి శ్రీహరి**

సామాజిక న్యాయానికి కేరాఫ్ కాంగ్రెస్ అని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. కాంగ్రెస్ పార్టీలో సామాన్య కార్యకర్తగా 30 ఏళ్ల కష్టాన్ని గుర్తించి మంత్రి పదవి ఇచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా వాకిటి శ్రీహరి ఎఐసిసి అగ్రనాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జునఖర్గే, వేణుగోపాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు.'అసెంబ్లీ పార్లమెంట్ గడప దొక్కని కులాలు చాలా ఉన్నాయని, 30 ఏళ్ల రాజకీయ జీవితంలో సర్పంచ్ స్థాయి ఈ స్థాయికి చేరుకున్నన్నారు. నా మీద ఉంచిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించడం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి, నియోజకవర్గ అభివృద్ధి కి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కేబినెట్‌లో ముదిరాజ్ లకు అవకాశం ఇవ్వడం సంతోషంగా ఉంది. గతంలో ఎలా ఉన్నానో ఆదే విశ్వాసంతో జీవితాంతం ఉంటానని, తొలిసారి గెలిచిన నాకు ఇచ్చిన గొప్పవరంగా భావిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

## బడి బస్సు భద్రమేనా?

### రోడ్లపై కాలం చెల్లిన బస్సులు.. ఫిట్‌గా లేకున్నా ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ జారీ.. ఆర్టీఏ కార్యాలయం రాకున్న అనుమతులు.. మామూళ్ల మత్తులో అధికారులు..




ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : పాఠశాలలు 12వ తేది నుంచి పునః ప్రారంభం కానున్నాయి. నెల రోజులుగా షెడ్‌లో ఉన్న ప్రైవేటు పాఠశాలలు బస్సులు రోడ్డెక్కేందుకు సిద్ధమతున్నాయి. నిర్మల్ జిల్లాలో ప్రైవేటు పాఠశాలలకు చెందిన 200పైగా బస్సులు ఉన్నాయి. వీటి ఫిట్‌నెస్ గడువు ఈ నెల 15తో ముగిసిందని తెలుస్తుంది. ఈ వార్షిక సంవత్సరం రోడ్డెక్కాలంటే ఆర్టీఏ కార్యాలయంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ 2025 మే 15 వరకు ఉంటుంది. ప్రతి బస్సు ఆర్టీఏ కార్యాలయానికి తీసుకు రావాల్సి ఉంటుంది. ఆర్టీఏ అధికారులు బస్సుల ఫిట్‌నెస్ పరిశీలించి సర్టిఫికెట్స్ జారీ చేయడం నిబంధన, మరో పదిహేను రోజుల్లో రోడ్డెక్కనున్న ప్రతి బస్సుకు ఫిట్‌నెస్ జారీ చేసి ఉంటుంది. బస్సులు ఎంత ఫిట్‌గా ఉన్నాయో తెలియదు కాని సర్టిఫికెట్స్ జారీ పేరిట అధికారులు భారీగానే ముడుపులు దండుకుంటున్నారనే ఆరోపఉన్నాయి. అధికారులు ధన దాహంతో కాలం చెల్లిన బస్సులు రోడ్డెక్కుతూ ప్రమాదాలకు గురవుతున్నాయనే విమర్శలున్నాయి.

**నిబంధనలు పాటించాలి..!**

బస్సు నడిపే డ్రైవర్ 50 యేళ్ల వయస్సు దాటరాదు. ప్రమాదాలు జరిగినప్పుడు ఫిట్‌నెస్ కోసం వచ్చిన బస్సు తప్పించుకునేందుకు ఎమర్జెన్సీ డోర్ ఉండాలి. బస్సులో ప్రయాణించే పిల్లలకు ఏదైనా ప్రమాదం జరిగితే ప్రథమ చికిత్స అందించేందుకు మెడికల్ కిట్ ఉండాలి. ఫైర్ సెఫ్టీ కిట్, హ్యాండ్ బ్రేక్, డ్రైవర్ డీటెయిల్స్ తప్పనిసగా బస్సులో ఉండాలి. బస్సు 15 యేళ్ల సర్వీసు కలిగి ఉండాలి. 15 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వాహనానికి మరొక సంవత్సరం రోడ్లపైన తిరిగే అవకాశం కల్పిస్తారు. అదనంగా ఇచ్చే ఒక సంవత్సరం సైతం ఆర్టీఏ అధికారులు ధ్రువీకరిస్తేనే రోడ్డెక్కాల్సి ఉంటుంది. 16 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వాహనాలు రోడ్డెక్కే అవకాశం ఉండదు. ఆ వాహనాన్ని స్క్రాబ్‌కు విక్రయించాల్సి ఉంటుంది. ప్రతి స్కూల్ బస్సు 30కిలో మీటర్ల పరిధిలో మాత్రమే తిరగాల్సి ఉంటుంది. దీనికి ప్రతి ఐదేళ్లకోసారి 3400 రూపాయలు చెల్లించి పర్మిట్ తీసుకోవాల్సి ఉంది. ఈ నిబంధనలు పాటించే స్కూల్ బస్సులు మాత్రమే రోడ్లపై తిరగాలి.

**ఫిట్ లేకున్నా సర్టిఫికెట్..**

ఫిట్ గా లేకున్నా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇస్తున్నారనే అపవాదు ఆర్టీఏ అధికారులపై ఉంది. నగరంలో పలు కార్పొరేట్ పాఠశాలలకు పదుల సంఖ్యలో బస్సులు ఉన్నాయి. డ్రైవర్స్‌ను పెట్టుకుని నడిపిస్తుంటారు. కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలలో పలుకుబడి ఉన్న వాళ్లే ఎక్కువగా ఉన్నారు. కార్పొరేట్ పాఠశాలల బస్సులు ఆర్టీఏ కార్యాలయం రాకుండానే ఫిట్నెస్ సర్టిఫికెట్ ఇస్తున్నారని ఆర్టీవో అధికారులపై ఆరోపణ లేకపోలేదు.



## చారిత్రక కాచిగూడ రైల్వేస్టేషన్‌కు 'ఫసాడ్ లైటింగ్'

### నేడు ప్రారంభించనున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్: ఫసాడ్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసి వాటి వెలుగులతో చారిత్రక కట్టడాలకు నూతన శోభను తీసుకువచ్చి ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం ద్వారా ఆయా కట్టడాల ప్రాముఖ్యతను గురించి తెలుసుకునేలా ప్రజలను ప్రేరేపించే చర్యలు ఇటీవలి కాలంలో చూస్తూ ఉన్నాం. అందులో భాగంగానే ఎంతో చారిత్రక నేపథ్యం కలిగి ఉన్న కాచిగూడ రైల్వే స్టేషన్‌కు రూ.2.23 కోట్ల వ్యయంతో కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన ఫసాడ్ లైటింగ్ వ్యవస్థను ఈ నెల 9 న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించనున్నారు. నిజాంల ఏలుబడిలో 1916లో గోతిక్ శైలిలో కాచిగూడ రైల్వే స్టేషన్ నిర్మాణం జరుపుకుంది. కాచిగూడ రైల్వే స్టేషన్‌కు ఉన్న ఈ చారిత్రక నేపథ్యాన్ని, అద్భుతమైన నిర్మాణ శైలిని మరింత ఆకర్షణీయంగా చూపించడానికి మొత్తం 785 ఇల్యూమినేషన్ లైట్లను ఏర్పాటు చేశారు. ఇకపై ఈ ఇల్యూమినేషన్ లైట్ల వెలుగులో కాచిగూడ రైల్వే స్టేషన్ బిల్డింగ్ ఎంతో చూడముచ్చటగా కనిపించనుంది. నగరం మధ్యలో ప్రజలకు అందుబాటులో ఉన్న ఈ రైల్వే స్టేషన్ నుంచి ప్రతిరోజూ వేల సంఖ్యలో ప్రయాణికులు ప్రయాణిస్తూ ఉంటారు. ఫసాడ్ లైటింగ్ వ్యవస్థ ద్వారా వీరందరికీ కాచిగూడ రైల్వే స్టేషన్ చారిత్రక ప్రాముఖ్యత తెలియయనుంది. కాచిగూడ రైల్వే స్టేషన్ చారిత్రక నేపథ్యం కలిగి ఉండటమే కాకుండా గ్రీన్ ఎనర్జీని ఉపయోగించుకుంటూ పర్యావరణ పరిరక్షణలో కూడా తనవంతు పాత్రను పోషిస్తోంది. గ్రీన్ రైల్వే స్టేషన్లకు రేటింగ్ ఇచ్చే ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్ ద్వారా కాచిగూడ రైల్వే స్టేషన్‌కు ప్లాటినం రేటింగ్ ఇవ్వబడింది. అంతేకాకుండా, భారతీయ రైల్వేలలో ఎనర్జీ ఎఫిషియంట్ స్టేషన్‌గా కాచిగూడ రైల్వే స్టేషన్ నిలిచింది. భారతీయ రైల్వేలలో మొట్టమొదటి డిజిటల్ పేమెంట్ సేవలను కాచిగూడ రైల్వే స్టేషన్ లోనే ప్రారంభించారు. ఇలా ఎన్నో రకాలుగా ప్రాముఖ్యతను సంతరించుకున్న కాచిగూడ రైల్వే స్టేషన్‌ను రూ.421.66 కోట్లతో అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకం కింద పునరాభివృద్ధి చేయనున్నారు.

## నేడు కీలక విచారణలు

### ఒకపక్క ఫోన్ ట్యాపింగ్ కేసు.. మరోపక్క జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ముందుకు హరీష్‌రావు..బిఆర్ఎస్ నేతల్లో ఉత్కంఠ



ప్రజాపక్షం/హైదరాబాద్: ఒకపక్క ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ, మరో పక్క కాళేశ్వరంపై జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ విచారణ సోమవారం హాట్ టాపిక్‌గా మారబోతుంది. అందరి చూపు ఈ రెండు విచారణలపైనే ఉంది. ఏడాదికిపైగా విచారణ నత్తనడక సాగుతున్న ఫోన్ ట్యాపింగ్ కేసు, కాళేశ్వరం కుంభకోణంపై విచారణ జరపుతున్న జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ తమ విచారణలను వేగవంతం చేసింది. ఏడాది కాలంలో పరారీలో ఉన్న ఎస్ఐబి మాజీ చీఫ్ ఐజి టి.ప్రభాకరరావును హైదరాబాద్‌కు రప్పించడంలో పోలీసులు విజయం సాధించారు. సోమవారం ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ చేస్తున్న సిట్ అధికారుల ముందుకు ప్రభాకర్‌రావు హాజరవుతుండగా, మరోపక్క కాళేశ్వరం కుంభకోణంపై విచారణకు బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్‌రావు కూడా ఇదే రోజు విచారణకు హాజరవుతున్నారు. ఒకపక్క ఫోన్ ట్యాపింగ్ కేసు, మరోపక్క కాళేశ్వరం కేసు విచారణ జరుగుతుండడంతో అందరి చూపు ఈ రెండు కేసులపైనే ఉంది. ప్రభాకర్‌రావు ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎవరిపేర్లు వెల్లడిస్తారోనని బిఆర్ఎస్ పెద్దలు తలలు పట్టుకుంటుండగా మరోపక్క హరీష్‌రావు కాళేశ్వరంపై జస్టిస్ పిసిఘోష్ కమిషన్ ముందు ఎలాంటి వివరాలు వెల్లడిస్తారోననే ఉత్కంఠ నెలకొంది.

# సాహితీ విహారి

## విశేష ప్రతిభావంతుడు... 'విశ్వంభరుడు' సినారె

పద్యం, గేయం, వచనం, పాట, గజల్, బుర్రకథ వంటి అన్ని రకాల సాహిత్య ప్రక్రియల్లోనూ తనదైన ముద్ర వేసి, ఆధునిక తెలుగు సాహిత్యానికి వన్నెలద్దిన గొప్ప రచయిత, సినారెగా మనందరికీ సుపరిచితుడు డాక్టర్ సి. నారాయణ రెడ్డి. ఈ పేరు వినగానే, ఆయనకు జ్ఞానపీఠ్ అవార్డును అందించిన 'విశ్వంభర' గుర్తుకొస్తుంది. సినారె భూమిని మట్టిముద్దమాదిరి కాకుండా, అందులో నుంచి ఉద్భవించిన మానవుడిగా చూశారు. స్పందించారు. అందుకే, 'విశ్వంభరుడు' అయ్యారు. తెలుగు సాహిత్యానికేకాదు... తెలుగు సినిమా పాటలకు కొత్తసొబగులు అద్దిన మాటల మాంత్రికుడు ఆయన. పూర్తి పేరు సింగిరెడ్డి నారాయణ రెడ్డి కాబట్టి, ఆయన పేరు ఎస్. నారాయణ రెడ్డి అని ఉండాలి. కానీ, పాఠశాలలో సింగిరెడ్డి స్పెల్లింగ్‌లో 'ఎస్'కు బదులు 'సి' రాశారని, ఆ తర్వాత తాను మార్చుకోలేదని ఒక ఇంటర్వ్యూలో ఆయనే స్వయంగా చెప్పుకున్నాడు. 1931 జులై 29న కరీంనగర్ జిల్లా హనుమాజీపేటలో జన్మించిన ఆయన, 2017 జూన్ 12న తుదిశ్వాస విడిచేవరకూ సాహితీరంగానికే జీవితాన్ని అంకితం చేశారు. నాటి నిజాం పాలనలో ఉర్దూ మీడియం మాత్రమే అందుబాటులో ఉండడంతో, సినారె చదువంతా ఉర్దూ మాధ్యమంలో సాగింది. అయినప్పటికీ ఆయన తెలుగు సాహిత్యంపట్ల మక్కువ పెంచుకున్నారు. పల్లెపదాలు, వినోదాలు, కథాగానంపై ఇష్టం పెంచుకోవడంతో పాటు చిన్నతనంలోనే కవితా ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1953లోనే 'నవ్వని పువ్వు' పేరుతో తొలి కవితా సంపుటిని వెలువరించారు. ప్రారంభంలో చిన్న కవితలు రాస్తూ ప్రారంభించి, ప్రేమ, ప్రకృతి, మానవతా భావనలు, సమకాలీన సమాజ సమస్యలపై రచనలు చేయడం ద్వారా తెలుగు సాహిత్యంలో తనదైన ముద్ర వేశారు. ఆయన రచనలు కేవలం భావుకతతో కాక, భావ గంభీరత, శిల్ప పరిపక్వతతో కూడినవిగా నిలిచాయి. విశ్వగీతి, నాగార్జునసాగరం, స్వప్నభంగం, కర్పూర వసంత రాయలు వంటి కవితా సంపుటాలు ఆయన కలం నుంచి జాలువారాయి. 'నా పేరు కవి, ఇంటి పేరు చైతన్యం, ఊరు సహజీవనం, తీరు సమభావనం....నా వచనం బహువచనం, నా వాదం సామ్యవాదం, కవిత్వం నా మాతృభాష, ఇతివృత్తం మానవత్వం...' అంటూ తన నైజాన్ని చాటుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి తెలుగు భాషలో పిహెచ్‌డి పూర్తి చేసిన ఆయన, అదే వర్సిటీలో ప్రొఫెసర్‌గా, డీన్‌గా సేవలు అందించారు. సినారె కవిత్వం భావప్రబలతకు అద్దం పడుతుంది. ముఖ్యంగా ప్రేమ, దైవత్వం, దేశభక్తి, మానవ సంబంధాలు, సమాజ



### పురస్కారాలు, గౌరవాలు

- జ్ఞానపీఠ అవార్డు – 1988, విశ్వంభర కావ్యం కోసం
- సాహిత్య అకాడమీ పురస్కారం – 1973
- పద్మశ్రీ – 1977
- పద్మభూషణ – 1992
- అనేక విశ్వవిద్యాలయాల గౌరవ డాక్టరేట్లు
- రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరించడం ద్వారా ప్రజాసేవ


పట్ల బాధ్యత వంటి అంశాలు ఆయన రచనల్లో విశేషంగా ప్రతిబింబిస్తాయి. పదాల ఎంపికలో సంగీతాత్మకత, పదాల మధ్య హార్మోని, శబ్దాల సరస్వతీ వాయుధ్వని కనిపిస్తుంది. అనేకానేక ప్రతీకలతో, చిత్తశుద్ధితో, కవిత్వ రూపకాలతో సాహిత్యాన్ని మోసుకెళ్లిన మహాకవి సినారె. భావ ప్రకటనలకు, భావోద్వేగాలకు ఆయన కొత్త బాష్యం చెప్పారు. భావ గంభీరత, సంగీతానుభూతి, వాక్య నిర్మాణం, బింబాల సౌందర్యం దాదాపుగా ఆయన అన్ని రచనల్లోనూ అంతర్లీనంగా ఉంటుంది. 1962లో కళాశాల అధ్యాపకుడిగా ఉన్న సమయంలో నటసార్వభౌమ ఎన్‌టి రామారావు కోరిక మేరకు 'గులేబకావళి కథ' సినిమా కోసం తొలిసారి పాట రాశారు. 'నన్ను దోచుకుందువటే వన్నెల దొరసాని..' అంటూ సినారె రాసిన తొలి పాటనే ఆయనకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆ తర్వాత ఆయనకు సినీ రంగంలో తిరుగులేని స్థానం లభించింది. మూడు వేలకు పైగా పాటలు రాసిన ఆయన తెలుగు చిత్రసీమలో చెరగని ముద్ర వేశారు. సినిమా పాటల్లోనేకాదు... వివిధ సాహితీ ప్రక్రియల్లోనూ ఆయన భావ సౌందర్యాన్ని, భాషా పరిమళనాన్ని పంచారు. సినారె గజల్స్ రచనలో ఆయన వాడిన భాషా శైలి ఆకర్షణీయంగా ఉండటానికి ముఖ్య కారణాలుగా సులభమైన, హృద్యమైన పదబంధాలను పేర్కోవచ్చు. ఆయన గజల్స్‌లో పాఠకులకు తేలికగా అర్థమయ్యే పదాలు, చక్కని పదబంధాలు కనిపిస్తాయి. ఉపమ, రూపకం, శ్లేష వంటి అలంకారాలను వినూత్నంగా వాడతారు. భావానికి అందం, లోతు కలిగిస్తారు. ఉర్దూ గజల్ శైలిని తెలుగు మాధుర్యంతో మేళవించడం ఆయన గజల్స్‌కు ప్రత్యేక గుర్తింపునిచ్చింది. ఉర్దూ గజల్‌కి విశిష్టమైన లయ, అనుప్రాసలను తెలుగు భాషలో అందంగా అనుసరిస్తారు. అందరూ సాధారణంగా మాట్లాడే భాషలో, స్వచ్ఛమైన తెలుగు పదాలతో రచించడంవల్ల పాఠకులకు దగ్గరగా అనిపిస్తుంది. ఒక్కో పదానికి రెండు లేదా అంతకంటే ఎక్కువ అర్థాలు వచ్చేలా వాడటం వల్ల గజల్‌కు కొత్త భావ ప్రపంచం వస్తుంది. ఈ లక్షణాల వల్ల సినారె గజల్స్ భాషా శైలి ప్రత్యేకంగా, ఆకర్షణీయంగా వెలుగుతునే ఉంటుంది. తాను రాసిన పాటల్లో తనకు బాగా ఇష్టమైనవి కొన్ని ఉన్నాయని, వాటిలో 'ఈ నల్లని రాలలో.. ఏ కన్నులు దాగెనో', 'అనుబంధం ఆత్మీయత అంతా ఓ బూటకం.. ఆత్మతృప్తికై మనుషులు ఆడుకునే నాటకం', 'ఏ అసురుడు సృష్టించిన పంచమ తంత్రం... నరజాతిని వంచించిన దారుణ కులమంత్రం' వంటివి తన మనసుకు దగ్గరగా ఉండేవని పలు ఇంటర్వ్యూల్లో చెప్పారు సినారె. 'నన్ను దోచుకొందువటే... వన్నెల దొరసానీ' అంటూ ప్రేమను పండించడమేకాదు.. 'దేనా మన సంప్రదాయమిదేనా? వరకట్నపు పిశాచాల దురంతాల కోరలలో అణ్యం పుణ్యం ఎరుగని ఆడబ్రతుకు బలియేనా' అని నిలదీశారు కూడా. 'శారద నను చేరగా.. ఏమిటమ్మా సిగ్గా.. ఎరుపెక్కె లేత బుగ్గ' అని చిలిపితనాన్ని చిలికించడమేకాదు.. 'గాలికి కులమేది? గాలికి కులమేది? ఏదీ... నేలకు కులమేది గాలికి కులమేది?' అంటూ భావ గంభీరతను ప్రదర్శించడం కూడా సినారెకే సాధ్యం. అందుకే ఆయన పాటలు అజరామరణాలు. ఆయన సాహితీ ప్రస్థానం అనితర సాధ్యం. సినారె ఒక వ్యక్తికాదు... తెలుగు సాహితీ నిఘంటువు. పాట లేదా కవిత... గజల్ లేదా పద్యం... ప్రక్రియ ఏదైనా, దానికి న్యాయం చేయగల సమర్థుడు సినారే. ఉర్దూ భాషపై పట్టు.. తెలుగు పదాలపై మక్కువ ఆయన రచనలకు ప్రత్యేకతను సంపాదించిపెట్టాయి. ఏ రకంగా చూసినా... సినారె సాహితీ మేరునగ ధీరుడు.. విశ్వంభరుడు.

– సత్యశ్రీ

## చదవాల్సిన పుస్తకం

### ప్రకృతిని మనిషికి అన్వయించిన రచన..

'విశ్వంభర' అనే పదానికి అర్థం 'విశ్వాన్ని మోయువాడు' లేదా 'భూమిని ధరిస్తున్నవాడు'. ఈ పదానికే తగినట్లుగా, ఈ మహాకావ్యంలో భూమి–మనిషి–ప్రపంచం అనే త్రయాన్ని అన్వయిస్తూ మానవుడి ప్రయాణాన్ని విశ్వస్థాయిలో చిత్రీకరించారు డాక్టర్ సి. నారాయణ రెడ్డి. 1980లో ఈ కావ్యం వెలువడి, 1988లో జ్ఞానపీఠ అవార్డు అందుకుంది. తెలుగు సాహిత్యంలో అంత గౌరవప్రదమైన అవార్డు అందుకున్న రెండో కవి ఆయన. ఈ కావ్యం ఎనిమిది ఖండాలుగా నిర్మితమైంది. ప్రతి ఖండం ఒక దశ, ఒక జీవిత విభాగాన్ని లేదా మానవ చరిత్రలో ఒక సంధికాలాన్ని ప్రతినిధిస్తుంది. ప్రధాన అంశాలైన భూమి (మాతృత్వ స్వరూపం), మానవుడు (ప్రగతికారక జీవి), ప్రకృతి (స్పందించే జీవసత్యం), ప్రేమ(బంధన కాదు, విముక్తి) చరిత్ర (విద్యనందించే మాధ్యమం), భవిష్యత్తు (ఆశావాదపు విస్తృతి)ను రచయిత కొత్త కోణంలో మనకు వివరిస్తారు. 'విశ్వంభర' కావ్యంలో మానవ పరిణామ క్రమం, మనిషి ప్రయాణమే ప్రధాన ఇతివృత్తం. ఈ ప్రయాణం .. భావ ప్రపంచం నుంచి.. చరిత్రలోంచి.. భౌతిక విజ్ఞానంలోంచి తాత్వికత వైపు సాగుతుంది. ఇది కేవలం ఒక వ్యక్తిగత అన్వేషణ కాదు, ఒక విశ్వమానవుడి ఆత్మాన్వేషణ. ఇందులో మానవుని ఉదయాన్నించి సమసమాజ ఏర్పాటుతో పాటు భవిష్యపు హేతుబద్ధ ప్రపంచం వరకు ప్రయాణం ఉంటుంది. కవితా శైలిని పరిశీలిస్తే, ఇందులో వాడిన భాష, నేటి ఆధునిక తెలుగుపదసంధానంగా, అద్భుతంశబ్ద–ఛంద–అర్థాల అన్వయంగా కనిపిస్తుంది. భూమిని మాతగా, ప్రేమను కీర్తిగా, జ్ఞానాన్ని తేజంగా చూపిస్తూ ఎన్నో మానవీయ బింబాలు మనకు కనిపిస్తాయి. 'భూమి నా శరీరం... భాష నా శ్వాస...' వంటి వాక్యాలు ప్రబల తాత్విక భావాన్ని కలిగిస్తాయి. గేయాత్మకతను పోగొట్టకుండా భావాన్ని నిరుపించటంనాదంతో నెమ్మదిగా ప్రవహించే నది వలె కావ్యశైలి కొనసాగుతుంది. ఆదిఖండం మానవుడి ఆరంభాన్ని చిత్రిస్తుంది. అతని జననం, భావోద్వేగాలు, ప్రకృతితో అనుబంధం తదితరాలు ఇందులో ముఖ్యాంశాలు. 'విచారమే మొదలు, వికారమే మౌనం' అనే కవిపదాలు శక్తివంతమైన అవధానాన్ని సూచిస్తాయి.చరిత్రఖండంలో, మానవ చరిత్ర లో గల యుద్ధాలు, ప్రేమ కథ లు, శోక గాధలు, విజ్ఞాన అభివృద్ధిని సమగ్రంగా అన్వయిస్తుంది. చరిత్రను కేవలం కాల రేఖగా కాకుండా, మనిషి భావరేఖగా చూడటం దీని ప్రత్యేకత. విజ్ఞాన ఖండం విషయానికి వస్తే, శాస్త్ర విజ్ఞాన, సాంకేతికత, కృత్రిమ మేధస్సు వంటి అంశాలను సమన్వయించి మానవుని ఆధునిక రూపాన్ని చూపిస్తారు రచయిత. 'యంత్రాల కన్నీళ్లకూ సంగీతముంటుందా?' అనే ప్రశ్న ద్వారా భావతాత్వికతను ప్రదర్శించేదు. తాత్విక ఖండం పూర్తిగా తాత్విక,ఆధ్యాత్మిక స్థాయిలో సాగుతుంది. జీవితం, మరణం, ఆత్మ, కర్మ, మోక్షం వంటి అంశాలపై కవిపరిశీలన కనిపిస్తుంది. నైతికతకు ఆధునికతను ముడిపెట్టి చూపిన ఔన్నత్యం అద్భుతం. కేవలం వ్యక్తిగత ప్రేమ కాదు, విశ్వ ప్రేమప్రతి జీవిని ప్రేమించాల్సిన బాధ్యతను నెరవేర్చే దారిగా ప్రేమను చూపిస్తారు రచయిత సినారె. మానవతా భావన: మత, జాతి, రంగు, దేశ బేధాలకంటే మానవతా సూత్రాల ప్రాధాన్యంమానవుడు తనలో మానవతను పోషించుకొని పునఃప్రవేశించాలనే సం దేశం ప్రధానంగా ఉంటుంది. 'విశ్వంభర', ఒక శకాంతర కవిత్వానికి ప్రతీకకాలాన్ని అధిగమించే విశ్వదృష్టితో కూడిన రచన. ఆధునిక తెలుగు కావ్యానికి త్రివేణిసంగమం లాంటిది. 'విశ్వంభర' అనేక భారతీయ భాషల్లోకి అనువదించారు. విశ్వమానవతా భావం ఉన్నందుకే ఇది కేవలం తెలుగుకు మాత్ర మే పరిమితం కాలేదు. తాత్వికతను జనబోధగల భాషలో సమర్పణ, భావబింబాల గొప్ప విన్యాసం, కాలచక్రాన్ని కవిత్వంలో మిళితం చేయగల నైపు ణ్యం సర్వత్రా ప్రశంసలు అందుకున్నాయి. వేదాంతం, బౌద్ధం, ఆధునిక విజ్ఞానం, గాంధీ సిద్ధాంతాలు, మార్క్సిజం వంటి అనేక కోణాలను సంకలనం చేసిన కవిత్వ విహంగమిది . అందుకే, 'విశ్వంభర' కేవలం ఒక కావ్యం కా దు, ఒక మానవతా శాసనం. ఇది మనిషి గురించి, అతని లోపాల గురించి, అతని లోతైన ఆత్మ గురించి గొప్ప విశ్లేషణను అందిస్తుంది. ఇది భావప్రపంచానికి ద్వారం తెరచిన రచన. 'భూమి మీద మనిషి, మానవతతోనే మెలగాలి.. మిగలాలి' అనే సంకల్పానికి కవిత్వ రూపమిది. దీని మీద ఎంఫిల్, పిహెచ్‌డి పట్టాల కోసం పరిశోధనలు జరిగాయి. దీనిని హిందీలోకి ఆచార్య భీమసేన్ నిర్మల్, ఇంగ్లీషులోకి డాక్టర్ అమరేంద్ర అనువదించారు.




'భూమ్యాకాశాల పుట్టుక నుంచి మొదలైన ఈ విశ్వంభర కాలం స్వరూపాన్ని, మనిషి వికాసాన్ని, చైతన్యాన్ని, ఆ చైతన్యం ప్రదర్శించిన విశ్వరూపాన్ని అనేక విధాలుగా ఆవిష్కరిస్తుంది. మానవ ప్రస్థానంలో మజిలీలు, ఆ మజిలీల పునాదుల మీద భవిష్యత్తరాలు సాధించిన విజయాలు, ఆ విజయాల సోపానాల మీద పయనించిన మానవుడు పొందిన అనుభవాలు... అన్నీ విశ్వంభరలో పాఠకుల కళ్లముందు సాక్షాత్కరిస్తాయి. మనశ్శక్తి వ్యక్తిగా సాగితే జీవిత చరిత్రగా, సమష్టిగా సాగితే సమాజ చరిత్రగా ఎలా కనిపిస్తుందో సినారె కలం దాన్ని ఒడిసి పట్టుకుని మనముందు నిలుపుతుంది. విశ్వంభర ఆధునిక ఐతిహాసిక వచన కవితా కావ్యం. కాల గమనానికి దర్పణం. తేదీలు, దస్తావేజులు, గణాంకాలు లేక మానవ చరిత్రను కీర్తిస్తున్న గానం. ఇందులో కవిత్వాన్ని ఆస్వాదించే వారికి అడుగడుగునా కవిత్వమే లభిస్తుంది.. కళాత్మకంగా, వైజ్ఞానికంగా, ఆధ్యాత్మికంగా, సామాజికంగా అన్ని అంశాలను స్పృశిస్తోన్న విశ్వంభర మరో మాటలో చెప్పాలంటే మనసు కావ్యం. విశ్వంభరలోని మానవుడు, కథానాయకుడు ఒక్క భారతీయుడే అనుకోవడానికి వీల్లేదు. ఎందుకంటే ఇందులో సంపూర్ణ మానవ వికాసమే కావ్యాత్మగా ఉంది. సినారె ప్రతి పంక్తినీ చమత్కారంగా, రసాత్మకంగా తీర్చిదిద్దారు. భావాల్లో కొన్నిచోట్ల నూతనత్వం కొరవడినా సినారె నాజూకు నగిషీ పనితనం నూతనత్వం కలిగిస్తుంది. ఆధునిక కవిత్వంలోని గందరగోళం ఏమాత్రం లేకుండా ప్రతి దృశ్యం పాఠకుల ముందు కదలాడుతూ కాలయంత్రంలా సాగిపోతుంది. ఆ అనుభవాలతో తడిసి పోతుంది' అంటారు చీకోలు సుందరయ్య. ఆయన మాటలు అక్షర సత్యాలు. 'విశ్వంభర' చదివితే, ఇది నిజమేనని అర్థమవుతుంది.

**పుస్తకం పేరు**

**'విశ్వంభర'**

ప్రతులకు
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్)
జిఎస్ఐ (పోస్ట్), హైదరాబాద్: 500068.
(నవచేతన బుక్ హౌస్ అబిడ్స్, సుల్తాన్ బజార్, బండ్లగూడ (నాగోల్) హైదరాబాద్, హన్మకొండ, కరీంనగర్, నల్లగొండ, ఖమ్మం శాఖల్లోనూ లభిస్తుంది).

## ఆరు పదాలతో నవల!

ఒక నవల ఎక్కడైనా పుస్తక రూపంలో ఉంటుంది. కానీ, ప్రపంచంలో అతి చిన్న నవలగా గుర్తింపు పొందిన రచనలో కేవలం ఆరు పదాలు మాత్రమే ఉన్నాయి. పేరు 'ఫర్ సేల్: బేబీ షూస్, నెవర్ వార్న్' (For sale: baby shoes, never worn'. దీనిని ఒక ఆరు పదాల కథగా పరిగణిస్తారు. ఇది కేవలం ఒక వాక్యం మాత్రమే అయినా, దానిలో మానవ జీవితంలోని బాధ, విషాదం, అనుకోని సంఘటనలు వంటి భావోద్వేగాలు బలంగా వ్యక్తమవుతాయి. ఈ వాక్యాన్ని ఎక్కువగా అర్నెస్ట్ హేమింగ్ వే (Ernest Hemingway) రాశారని ప్రచారంలో ఉంది. కానీ దీనికి తథ్య ఆధారాలు లేవు. కథ విషయానికి వస్తే, రచయిత ఒకసారి తన మిత్రులతో ఒడంబడిక కుదుర్చుకుంటాడు. ఆరు పదాలలో హృదయాన్ని తాకే కథ రాస్తానని వారితో కుదిరిన ఒప్పంద సారాంశం. అప్పుడు హేమింగ్‌వే రాసిందీ వాక్యం 'ఫర్ సేల్: బేబీ షూస్, నెవర్ వార్న్'. ఈ చిన్న కథలో అంతర్లీన భావాలు ఉన్నాయి. ఏదైనా విక్రయానికి పెట్టడం అంటే అది వాడకపోవచ్చు.. లేదా అవసరం లేక పోవచ్చు. బేబీ షూస్ అంటే, ఒక శిశువు కోసం కొన్న బూట్లు.




నెవర్ వార్న్ (ఎప్పుడూ వేసుకోలేదు) అంటే ఆ శిశువు తలపెట్టినట్టు బతకలేదనే అనుమానం కలుగుతుంది. బూట్లు కొన్నప్పటికీ, వాటిని ధరించే అవకాశం లేకపోవడం ఆ చిన్నారి ఎదుర్కొంటున్న ఎన్నో సంక్లిష్టమైన పరిస్థితులకు అద్దం పడుతుంది. పిల్లల బూట్లు అమ్మకానికి ఉన్నప్పటికీ, వాటిని ధరించే అవకాశం మాత్రం వారికి లభించకపోవడం అప్పటి ఆర్థిక, సామాజిక పరిస్థితులను ప్రతిబింబిస్తుంది. మొత్తం మీద ఈ ఆరు పదాల్లోనే ఒక నవలంత భావాన్ని అందించడం వల్ల ఇది ప్రపంచంలో అతి చిన్న నవలగా గుర్తింపు పొందింది. అతితక్కువ పదాలతో గాఢమైన భావన ఈ కథ ప్రత్యేకత. పాఠకుడి ఊహాశక్తిని ఉత్తేజితం చేయడం. విషాదభరితమైన, సున్నితమైన, హృదయ విదారక ముఖచిత్రం మన కళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది. ఇది సాహిత్యంలో ఫ్లాష్ ఫిక్షన్ లేదా మైక్రో ఫిక్షన్ అనే ప్రక్రియకు ప్రేరణ ఇచ్చిన రచనగా పరిగణించబడుతుంది. అత్యల్ప పదాలతో అత్యధిక భావాన్ని తెలిపే ప్రయత్నంలో ఇది ఒక మైలురాయి.

## సామాజిక సమస్యలపై డికెన్స్ పోరాటం

విక్టోరియన్ యుగంలో అత్యంత ప్రసిద్ధి చెందిన ఆంగ్ల నవలా రచయిత చార్లెస్ డికెన్స్ (17 ఫిబ్రవరి 1812– 9 జూన్ 1870) అక్షరమే ఆయుధంగా సామాజిక సమస్యలపై పోరాటం కొనసాగించాడు. సామాన్య ప్రజల జీవితం, పేదరికం, అన్యాయ వ్యవస్థలు, పిల్లల బాధలు వంటి అంశాలు డికెన్స్ రచనల్లో ప్రధానంగా కనిపిస్తాయి. అందుకే, ఆయన రచనలు ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందుతునే ఉన్నాయి. డికెన్స్ చిన్న వయసులోనే కుటుంబ ఆర్థిక సమస్యల కారణంగా చదువు మానేసి బూట్ల కర్మాగారంలో పనిచేశాడు. అతని తండ్రి అప్పుల కారణంగా జైలుకు వెళ్లడం, కుటుంబం ఎదుర్కొన్న కష్టాలు డికెన్స్ రచనలకు ప్రేరణగా నిలిచాయి. ఈ అనుభవాలు అతని రచనల్లోని పేదరికం, పిల్లల దుస్థితి, సామాజిక అసమానతల చిత్రణకు బలమైన ఆధారంగా మారాయి. డికెన్స్ 15 నవలలు, 5 నవలికలు, వందలాది కథలు, వ్యాసాలు రచించాడు. అతని ప్రసిద్ధ రచనల్లో 'ది పిక్విక్ పేపర్స్' (1837) ప్రత్యేక స్థానాన్ని సంపాదించింది. హాస్యంతో కూడిన ఈ నవల ద్వారా డికెన్స్ రచయితగా పేరు తెచ్చుకున్నాడు. ఆతర్వాత 'ఆలివర్ ట్విస్ట్' (1838) పేరుతో పిల్లల దుస్థితి, అనాథాశ్రమాల దురవస్థను చిత్రించాడు. 'డేవిడ్ కాపర్‌ఫీల్డ్' (1850) నవల డికెన్స్ జీవిత అనుభవాలకు దగ్గరగా ఉండే ఆత్మకథాత్మక నవల. 'బ్లీక్ హౌస్' (1853) నవలలో న్యాయ వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపాడు. 'ఎ ఎ ఆఫ్ టూ సిటీస్' (1859) నవలలో లండన్, పారిస్ నగరాల నేపథ్యంలో ఫ్రెంచ్ విప్లవాన్ని ఆధారంగా తీసుకున్న చారిత్రా త్మక నవల. 'గ్రేట్ ఎక్స్‌పెక్టేషన్స్' (1861)లో ధనం, ప్రేమ, మానవ స్వభావం వంటి అంశాలను ప్రస్తావించాడు. డికెన్స్ రచనల్లో పేద ప్రజల జీవనం, వర్గ విభేదాలు ప్రధానంగా కనిపిస్తాయి. ఆయన రచనలు సామాజిక న్యాయాన్ని కోరుతూ, వ్యవస్థల లోపాలను ఎత్తిచూపుతాయి. పిల్లల శ్రమ, అనాథాశ్రమాల దురవస్థ, బాల్య దశలో ఎదురయ్యే కష్టాలు ముఖ్యంగా ప్రతిఫలించాయి. న్యాయ వ్యవస్థ, కార్మిక పరిస్థితులు, విద్యా సంస్థల లోపాలను డికెన్స్ తన రచనల్లో తీవ్రంగా విమర్శించాడు. కుటుంబ బంధాలు, స్నేహం, ప్రేమ వంటి భావోద్వేగాలు ఆయన నవలల్లో ప్రధానంగా ఉంటాయి. డికెన్స్ రచనల్లో లండన్ నగరం, పేదవారి వాస్తవిక జీవితం, వాతావరణం చిత్రణ అత్యంత విశదంగా ఉంటుంది. అతని పాత్రలు విశేషంగా గుర్తుండిపోయేలా, కొంతవరకు అతిశయోక్తితో, ప్రత్యేక లక్షణాలతో ఉంటాయి. హాస్యంతో పాటు, వ్యవస్థలపై వ్యంగ్యంగా వ్యాఖ్యానించడం డికెన్స్ రచనల్లో కని




పించే ప్రత్యేకత. నవలలను వారపు లేదా నెలవారీ సీరియల్‌గా ప్రచురించడం ద్వారా, అత్యంత ఉత్కంఠభరితమైన స్థితిలో నిలిపివేసి, కొనసాగింపుపై పాఠకుల ఆసక్తిని పెంచాడు. వాక్యాలు, పదబంధాలను పునరావృతం చేయడం ద్వారా భావోద్వేగాన్ని పెంచేవాడు. డికెన్స్ రచనలు సామాజిక చైతన్యం పెంచడంలో, న్యాయవ్యవస్థ, కార్మిక హక్కులు, బాలల హక్కులపై చర్చను ప్రోత్సహించడంలో కీలక పాత్ర పోషించాయి. 'డికెన్సియన్' అనే పదం కూడా సామాజిక అసమానతలు, పేదరికాన్ని సూచించడానికి ఉపయోగపడుతున్నదంటే, అతని రచనల ప్రభావం ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవచ్చు. సూక్ష్మంగా చెప్పాలంటే, డికెన్స్ రచనలు ఆంగ్ల సాహిత్యంలో మారుపుముఖంగా నిలిచాయి. ఆయన నవలలు కేవలం కథలు మాత్రమే కాకుండా, సమాజాన్ని ప్రతిబింబించే అద్దాలుగా, సామాజిక మార్పుకు ప్రేరణగా నిలిచాయి. పేదరికం, అన్యాయం, మానవతా విలువలు, కుటుంబ బంధాలు వంటి అంశాలను విశేషంగా ప్రతిబింబించిన డికెన్స్ రచనలు, నేటికీ సమకాలీనతను కోల్పోకుండా పాఠకులను ఆకట్టుకుంటున్నాయి.

### హాస్యం.. వ్యంగ్యం..

డికెన్స్ రచనల్లో హాస్యం ప్రధానంగా వ్యంగ్యానికి ఉపకరణంగా ఉంటుం ది. 'ఆలివర్ ట్విస్ట్', డేవిడ్ కాపర్‌ఫీల్డ్' వంటి నవలల్లో సమాజంలోని దుర్వ్యవస్థలను హాస్యంతో కూడిన వ్యంగ్యంగా చిత్రిస్తారు. 'ఆలివర్ ట్విస్ట్'లోని మిస్టర్ బంబుల్ లాంటి పాత్రల ద్వారా వ్యవస్థల పక్షపాతాన్ని, దుర్నీతి, మానవత్వహీనతను హాస్యంతో కూడిన వ్యంగ్యంతో ఎత్తిచూపుతాడు. డికెన్స్ తన రచనల్లో పదజాలం, వాక్య నిర్మాణం, పాత్రల సం భాషణల ద్వారా పదేపదే వ్యంగ్యాన్ని, హాస్యాన్ని ప్రదర్శిస్తాడు. ఇది పాఠకులను ఆకట్టుకోవడమే కాక, సామాజిక విమర్శను మరింత బలంగా చేస్తుంది. ఆయన హాస్యం కొన్నిసార్లు సున్నితంగా, కొన్నిసార్లు తీవ్రమైన వ్యంగ్యంగా ఉంటుంది. పిల్లల పాత్రల్లో అమాయకత్వాన్ని, పెద్దల పాత్రల్లో ధ్వంధ్వ ప్రవర్తనను హాస్యంగా చూపిస్తారు. పా త్రల విశ్లేషణడికెన్స్ పాత్రలు ప్రత్యేకమైన భౌతిక లక్షణాలు, పేర్లు, ప్రవర్తనలతో గుర్తుండిపోయేలా ఉంటాయి. ఉదాహరణకు, 'డేవిడ్ కాపర్‌ఫీల్డ్'లో మిస్టర్ మర్డ్‌స్టో న్ అనే పేరు నుంచే అతని కఠినత్వం, హింసాత్మక స్వభావం స్పష్టమవుతుంది. పాత్రల పేరు, భౌతిక లక్షణాలు, ప్రవర్తన వంటి కీలక అంశాలపై నిశిత దృష్టిని కేంద్రీకరించడం ద్వారా వాటి స్వభావాన్ని, సామాజిక స్థితిని ప్రతిబింబిస్తాడు. డికెన్స్ పాత్రలు తరచుగా అతిశయోక్తితో, కొంత వరకు కార్టూన్‌లా ఉంటాయి. ఉదాహరణకు, 'ఆలివర్ ట్విస్ట్'లో ఉపయోగించి, వర్గ విభేదా న్ని, నగర జీవనాన్ని హాస్యంగా చూపిస్తా డు. ఆయన పాత్రలు సామాజిక స్థితిగతులను, మానవ స్వభావంలోనిలో పాలను ప్రస్తావిస్తాయి. మంచితనాన్ని ప్రతిబింబిస్తాయి. కొన్ని పాత్రలు పూర్తిగా మంచితనానికి, మరికొన్ని పూర్తిగా దుర్మార్గానికి ప్రతీకలుగా ఉంటాయి. విచిత్రం ఏమిటంటే, దశాబ్దాలు గడిచిపోయినా, ఇప్పటికీ డికెన్స్ నవలల్లో చూపిన పేదరికం, వర్గ విభేదాలు, అన్యాయ వ్యవస్థలు వంటి అంశాలు సమకాలీన సమాజంలో కనిపిస్తూనే ఉన్నాయి. ఇవి నేటి సామాజిక, ఆర్థిక అసమానతలను అర్థం చేసుకోవడానికి మార్గదర్శకంగా ఉంటాయి. ఆయన రచనల్లోని మానవతా విలువలు, నైతికత, దయ, సహానుభూతి వంటి అంశాలు ఆధునిక సమాజంలో కూడా అవసరమైనవి. ఇవి వ్యక్తిగత, సామాజిక స్థాయిలో మానవ సంబంధాలను మెరుగుపరచడంలో ఉపయోగపడతాయి. డికెన్స్ రచనలను ఆధునిక దృక్కోణంలో చదవడం ద్వారా, నేటి యువత సామాజిక బాధ్యతను, నైతిక విలువలను, మార్పు అవసరాన్ని గుర్తించవచ్చు. ఇది వ్యక్తిత్వ వికాసానికి, సమాజ అభివృద్ధికి దోహదపడుతుంది. ఆధునిక సాహిత్య విమర్శలోనూ, సామాజిక ఉద్యమాల్లోనూ డికెన్స్ రచనల శైలిని, వ్యంగ్యాన్ని, పాత్రల నిర్మాణాన్ని ఉపయోగించి సమకాలీన సమస్యలను విశ్లేషించవచ్చు. డికెన్స్ రచనలు నేటి సమాజానికి మార్గనిర్దేశకంగా, ప్రేరణాత్మకంగా నిలుస్తాయి.

**ఈ వారం కవితలు**

### చిరునవ్వు చిందిస్తా..

చిరునవ్వు చిందిస్తా
ద్రవిస్తున్న నా కళ్ళను చూసి
ఎందుకు అనుకుంటున్నవా? అవి...
మ తం,మతమంటూ
జాతికి నువు చేసిన, చేస్తోన్న
గాయాలకి ప్రతీక.
నిన్నావహించిన మతమౌఢ్యంతో,
జాతిని రచ్చకీడ్చావే!

మతాల మతలబులెరుగని
అమాయకపు మనసులను
అగ్నికి ఆహుతిచేసావే!
నీ మతపైత్యపుటుసురు
ఊరికినే పోదుగా.

నీ దాడికి తెగిపడిన
మతమెరుగని జనుల గొంతుకలు,
నాలో ఆవేశాగ్నిని రగిలించాయి.

నేను విసిరే అక్షరతూటాలకు,
నీ గన్ను ఏం సమాధానమిస్తుందో చూస్తా!
అనంతవాయువుల్లో కలసిన ప్రాణాలను
తిరిగి ఎలా తెస్తుందో అడుగుతా!

నీ దొంగచాటు ఆగడాల
రాజకీయ కుట్రకు,
మతం చెరగని పచ్చబొట్టయింది.
నీకిదే కదా అలుసు...

నా తరం కాకపోతేయేం
మరోతరం అయినా,
మతఛాందసాన్ని
వదులుతుందిలే. అప్పుడు...
నింగినుండి దరహాసం చిందిస్తా...

వేమూరి శ్రీనివాస్
9912128967

### హరిత వర్ణం హరించుకు పోయిందా....?

హరిత వర్ణం హరించుకు పోయిందా....?
లేచిగుళ్ళు , లేత గరికలు
గంతులెయ్యడం మానేసాయా ,
వర్షాలకి బదులు రక్తాలతో
నేలతల్లి తడిచిపోతుంటే !

పిట్టలూ పాటలూ
పంటలూ
పడావు పడ్డాయా
మేఘాకాశాలకి
బదులు
ఆయుధ పొగలు ఆకా
శాన్ని కమ్మేస్తుంటే !
గొడవలు మేలిమి గుణాల
కోసం పడాలి
మలిన రణాల కోసం కాకుండా !

మనుషుల అసువుల



అసలు సంగతి మతించాలి
గండ పుండు మోక్ష గతి మార్గానికి
విముక్తి దారిలో మసులుకోవాలి !
యుద్ధాలతో యోగులు కారు
యాగ బలాలతో యోగులవుతారు !

మట్టి మనసు
సుగంధ పరిమళాలు వెదజల్లుతుంది
ముష్టి యుద్ధాల
రుధిర దుర్వాసనలని భరించదు!

తెల్లారితే కళ్ళు విప్పే పూలు
మన కళ్ళు అవ్వాలి !
పూల తేనెలు గా
మన కన్నీళ్లు మారాలి !
సతతం హరితాన్ని జీర్ణం చేసుకోవాలి !

ఒబ్బిని, 9849558842

### వాడిపోయిన కిసాన్



రైతు ఆకలికి ముద్ద తినిపిస్తందుకు పొద్దు పొడవక
ముందే కూరగాయలు
నాలుగు కూడళ్ళలో
మేలుకుంటాయి

పసిబిడ్డలు పాలకూర , తోటకూర
రైతు కడుపు నింపి ఋణం తీర్చు
కుంటందుకు నీళ్లు చల్లించుకొని
నిగనిగలాడుతుంటాయి

బేరం చేస్తుంటే తల తల మెరుస్తూ
ముఖం చూస్తుంటాయి
అమ్ముడు పోగా మిగిలిన కూరగాయలు

రైతు రుణం తీర్చుకోలేకపోయామని
ముఖం మాడ్చు కొని వాడిపోతాయి
అమ్మగా వచ్చిన పైకంతో

అప్పులు, పిల్లల తిప్పలు, తీర్చుకొని
కిసాన్ సగం వాడి పోయిన
జీవితాన్ని మోస్తుంటాడు

గుండెల్లి ఇస్తారి
9849983874



# జాతీయం
NATIONAL & GENERAL NEWS



## హిందీని బలవంతంగా రుద్దితే మాతృభాష ఏమవ్వాలి: కమల్ హాసన్

**చెన్నై:** పాఠశాలల్లో ఒక నిర్దిష్టమైన భాషను విద్యార్థులపై బలవంతంగా రుద్ద దం వల్ల అభ్యాస ప్రక్రియకు ఆటంకం కలుగుతుందని మక్కల్ నీది మ య్యం (ఎంఎన్ఎం) పార్టీ అధినేత, ప్రముఖ నటుడు కమల్ హాసన్ అన్నారు. ఈ విషయంలో తాను కేవలం తమిళనాడుకు మాత్రమే కాకుండా పంజాబ్, క ర్నాటక, ఆంధ్రప్రదేశ్‌కు అండగా నిలుస్తానని తెలిపారు. కేంద్రం రాష్ట్రాలపై ఒత్తిడి తీసుకురావడాన్ని తాను వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. మాపై హిందీని బలవంతంగా రుద్దితే మరి మా మాతృ భాష ఏమవ్వాలి... దేశంలో ఉన్న 22 అధికారిక భాషల్లో తమిళం ఒకటి కాదా' అని కమల్ ప్రశ్నించారు. జాతీయ విద్యా విధానం(ఎన్ఈపీ)లో భాగమైన త్రిభాషా సూత్రంలో భాగం గా దేశవ్యాప్తంగా విద్యార్థులు హిందీ, ఇంగ్లీషు, ఒక స్థానిక భాషను నేర్చుకోవాలని కేంద్రం పేర్కొంది. కాగా, భాషా వివాదంలో చిక్కుకున్న కమల్ తాజాగా త్రిభాషా సూత్రం అమలుపై మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు.



## ఢిల్లీలో శాంతిభద్రతలు నాశనం చేసిన బిజెపి

### దేశ రాజధానిలో కుమార్తెలకు భద్రత లేదు ఆప్: అధ్యక్షుడు కేజ్రీవాల్

**న్యూఢిల్లీ :** దేశ రాజధానిలో తొమ్మిదేళ్ల బాలిక మరణం, లైంగిక వేధింపుల ఆరోపణలపై అధికార బీజేపీ, దాని 'నాలుగు ఇంజిన్ల' ప్రభుత్వాన్ని ఆప్ విమర్శించింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షాను జవాబుదారీగా ఉంచాలని ఆప్ అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం అన్నారు. ఈశాన్య ఢిల్లీలోని నెహ్రూ విహార్‌లో శనివారం మైనర్ బాలిక మతదేహం సూట్‌కేస్‌లో నింపి ఉండటం కనిపించింది. ప్రాథమిక వైద్య పరిశీలనల ఆధారంగా బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే ఈ ఘటనపై బీజేపీ ఇంకా స్పందించలేదు. ఇదిలా ఉండగా, 'ఎక్స్' లో చేసిన ఒక పోస్ట్‌లో మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్... ఢిల్లీలో శాంతిభద్రతల పరిస్థితిని బీజేపీ నాశనం చేసిందని విమర్శించారు. 'ఢిల్లీలో 9 ఏళ్ల అమాయక బాలికపై అత్యాచారం, హత్య అందరినీ తీవ్రంగా కదిలించింది' అని పేర్కొన్నారు. 'బీజేపీ నాలుగు ఇంజిన్ల ప్రభుత్వం అని పిలవబడుతున్నప్పటికీ, మన కుమార్తెలు సురక్షితంగా లేరు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఆయన నాలుగు ఇంజిన్ల ప్రభుత్వం జవాబుదారీగా ఉండాలి. ఢిల్లీ కుమార్తెలు సమాధానాలు, న్యాయం రెండింటినీ కోరుతున్నారు' అని ఆప్ అధినేత హిందీలో పోస్ట్ చేశారు. ఢిల్లీ అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకురాలు ఆతిశి కూడా ఇలాంటి అభిప్రాయాన్నే వ్యక్తం చేస్తూ 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. ఢిల్లీలో 9 ఏళ్ల బాలికపై అత్యాచారం, హత్యకు ఎవరు బాధ్యత వహిస్తారు? శాంతిభద్రతల పరిస్థితి దిగజారడానికి ఎవరు బాధ్యత వహిస్తారు?' అని ప్రశ్నించారు. నాలుగు ఇంజిన్ల బీజేపీ ప్రభుత్వం ఉన్నప్పటికీ 'మా కుమార్తెలు సురక్షితంగా లేరు' అని మాజీ ముఖ్యమంత్రి అన్నారు. 'ముఖ్యమంత్రి రేఖ గుప్తా ఎక్కడ? కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎక్కడ?' అని ఆమె హిందీలో పోస్ట్ చేశారు.

## ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తే పదోన్నతులు

### పాక్ చర్యలపై శశిథరూర్ ధ్వజం



**వాషింగ్టన్:** ప్రపంచంలోనే కరుడుగట్టిన ఉగ్రవాది, అల్‌ఖైదా అగ్రనేత ఒసామా బిన్‌లాడెన్‌ను పట్టించడంలో సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ (సీఐఏ)కి సాయం చేసిన డాక్టర్ షకీల్ అఫ్రీదీపై పాకిస్థాన్ కఠిన చర్యలు తీసుకోవడాన్ని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ తీవ్రంగా తప్పుబట్టారు. అఫ్రీదీని విడుదల చేయాలంటూ అమెరికా చట్టసభ సభ్యుడు బ్రాడ్ షెర్మన్ చేసిన డిమాండ్ సరియైనదేనన్నారు. ఈ మేరకు పాకిస్థాన్ నాయకత్వానికి విజ్ఞప్తి చేశారు. ఒకవేళ అదే జరిగితే... 9/11 నాటి ముంబై ఉగ్రదాడుల బాధితులకు న్యాయం జరగడంలో కీలక ముందడుగు పడినట్లవుతుందన్నారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు చేశారు. పహల్గాం ఉగ్రదాడి, అనంతరం భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' గురించి వివరించేందుకు శశిథరూర్ నేతత్వంలోని అఖిలపక్ష కమిటీ... అమెరికాలో పర్యటిస్తున్న సందర్భంగా ఓ సమావేశంలో బ్రాడ్ షెర్మన్... పాకిస్థాన్ వైద్యుడి ప్రస్తావన తీసుకొచ్చారు. దీనిపై తాజాగా శశిథరూర్ ఎక్స్ వేదికగా స్పందిస్తూ... 'బ్రాడ్ షెర్మన్ డిమాండ్‌ను స్వాగతిస్తున్నాం. బిన్ లాడెన్‌కు పాకిస్థాన్ ఆశ్రయం కల్పించింది. ఆయన ఎక్కడ ఉన్నాడన్న సమాచారాన్ని లీక్ చేశాడన్న కారణంతో ఓ వైద్యుడిని అక్రమంగా అరెస్టు చేసి, చిత్ర హింసలు పెడుతోంది. ఒక వేళ ఆ వ్యక్తే ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తే అవార్డులు, రివార్డులు వచ్చేవి' అంటూ పాక్ సైన్యాధ్యక్షుడిగా ఉన్న జనరల్ ఆసిం మునీర్‌కు... దేశంలో అత్యున్నత సైనిక హోదా కలిగిన 'ఫీల్డ్ మార్షల్'గా పాక్ ప్రభుత్వం పదోన్నతి కల్పించిన విషయాన్ని పరోక్షంగా దుయ్యబట్టారు. అఫ్రీదీ పాకిస్థాన్‌కు చెందిన వైద్యుడు. లాడెన్ కుటుంబసభ్యులకు సంబంధించిన డీఎన్ఏ నమూనాలను సేకరించేందుకు సీఐఏ పోలియో టీకా కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఆయన సాయం చేశారు. ఈ క్రమంలో 2011లో అబోట్టాబాద్ మిలిటరీ కంటోన్మెంట్ శివారులోని ఓ సురక్షిత ప్రాంతంలో ఉన్న లాడెన్‌పై అమెరికా దాడి చేసి హతమార్చింది. ఇదంతా అఫ్రీదీ వల్లనేనని భావించిన పాక్ అధికారులు వెంటనే అఫ్రీదిని అరెస్టు చేశారు. 2012లో అక్కడి కోర్టు ఆయనకు 33 ఏళ్లు జైలు శిక్ష విధించింది. అప్పటి నుంచి అతడు జైల్లోనే ఉంటున్నారు.

## మహిళా సాధికారతే లక్ష్యం:ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ:** మహిళల అభివద్ధి కోసం ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన పథకాలు, కార్యక్రమాలను ప్ర ధాని మోదీ మరోసారి గుర్తు చేశారు. మహిళల నేతత్వంలో సాధించిన విజయాలను ప్రస్తావించా రు. కేంద్రంలో వరుసగా మూడోసారి మోదీ నేతత్వంలోని ప్రభుత్వం ఏర్పాటై రేపటికి ఏడాది పూర్తి కావొస్తోంది. ఈ నేపథ్యంలోనే 11 ఏళ్లలో ఎన్డీఏ సర్కార్ సాధించిన విజయాలను ఆయన 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. 'విద్య, క్రీడలు, స్టార్టప్, సైన్స్ ఇలా అన్ని రంగాల్లో మహిళలు తమదైన ముద్ర వేస్తున్నారు. అంతర్జాతీయ వేదికలపైనా మన దేశ కీర్తిని పెంచుతున్నారు. అనేక మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ఎన్డీఏ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టింది. స్వచ్ఛ భారత్ ద్వారా వారి గౌరవా న్ని కాపాడడం నుంచి జన్‌ధన్ ఖాతాలతో వారిని ఆర్థికంగా బలోపేతం చేసేంత వరకు ఎన్నో పథకా లు అమలు చేశాం. పేద మహిళల ఆరో గ్యం దష్ట్యా 'ఉజ్వల్ యోజన' పథకం కింద గ్యాస్ సిలిండర్లు అందించాం. 'ప్రధాన మంత్రి ఆవాస్ యోజన'తో పేదలకు ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇ చ్చాం. ప్రతి ఆడబిడ్డను రక్షించేందుకు, వారు ఉన్నతం గా ఎదిగేందుకు 'బేటీ బచావో, బేటీ పడావో' ను అమలు చేశాం. పేదలు, రైతులు, యువత కో సం ఎన్డీఏ ప్రభుత్వం చేసిన అభివద్ధిని మీరంతా చూ శారు. మహిళా సాధికారతే లక్ష్యంగా 11 ఏళ్లు గా కషి చేస్తున్నాం' అని ప్రధాని మోదీ పేర్కొన్నా రు.

## నరేంద్రమోదీ ప్రభుత్వంలో... రాజ్యాంగసంస్థలు హైజాక్ అవుతున్నయ్

### ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్ ఆరోపణాస్త్రాలు



**పాట్నా :** నరేంద్రమోదీ ప్రభుత్వం రాజ్యాంగ సంస్థలను హైజాక్ చేస్తోందని రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) ముఖ్యనేత తేజస్వి యాదవ్ ఆరోపించారు. ఎన్నికల తేదీలు ప్రకటించకముందే అధికార బిజెపి ఎన్నికల షెడ్యూళ్లను ముందే తెలుసుకుంటోందని మండిపడ్డారు. 2020లో జరిగిన గత అసెంబ్లీ ఎన్నికలు సరైన పద్ధతిలో జరుగలేదని మాజీ ఉపముఖ్యమంత్రి కూడా అయిన తేజస్వి యాదవ్ ఆరోపించారు. మహారాష్ట్ర ఎన్నికల కూటమి భాగస్వామి కాంగ్రెస్‌పై రాహుల్ గాంధీ సందేహాలను ఆయన సమర్థించారు. తేజస్వి యాదవ్ ఆదివారం నాడు ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ '2014లో కేంద్రంలో ఎన్‌డిఏ నేతృత్వంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి రాజ్యాంగసంస్థలను హైజాక్ చేస్తున్నారు. ఆశ్చర్యం కలిగించే విషయమేమిటంటే భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడానికి ముందే బిజెపి ఐటి సెల్ ఎన్నికల తేదీల గురించి తెలుసుకుంటోంది. మేం ఈ పరిణామాలపై దృష్టి సారించాం' అని ఆయన విలేకరుల ప్రశ్నలకు సమాధానంగా చెప్పారు. రాజ్యాంగ సంస్థలు స్వతంత్రంగా పనిచేయాల్సిన అవసరం ఉందని, వారు ప్రభావితం అయితే ప్రజలు న్యాయం ఎలా ఆశిస్తారో అని ఆలోచిస్తున్నానని తేజస్వి యాదవ్ చెప్పారు. 2020 అసెంబ్లీ ఎన్నికల్లో ఏం జరిగిందో ప్రజలకు తెలుసని, తామే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి ఉందని, సాయంత్రం లెక్కింపు ఎందుకు ఆగిపోయిందో సమర్థించుకోవడానికి భారత ఎన్నికల సంఘం మూడు సమావేశాలు నిర్వహించిందని, కానీ, రాత్రిపూట ఎందుకు లెక్కింపు పున: ప్రారంభం అయింది? అని మహాఘట్‌బంధన్‌కు సంబంధించినవారిని ఎవరినైతే తొలుత విజేతలుగా ప్రకటించారో, ఆ తర్వాత వారిని ఓటమిచెందిన వారుగా ప్రకటించారని ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ చెప్పారు. బిజెపి నేతృత్వంలోని కూటమి మహారాష్ట్ర ఎన్నికలలో రిగ్గింగ్ చేసి గెలిచారని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఇటీవల ఆరోపించిన విషయం తెలిసిందే.

## ఇసికి అధికారికంగా లేఖ రాయండి

### రిగ్గింగ్ ఆరోపణలపై రాహుల్‌కు ఎన్నికల సంఘం సమాధానం



**న్యూఢిల్లీ :** మహారాష్ట్ర ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ తన వ్యాసంపై ఎన్నికల కమిషన్ ప్రతిస్పందన కోరిన ఒక రోజు తర్వాత, ప్రతిపక్ష నాయకుడు నేరుగా ఈసీకి లేఖ రాస్తేనే రాజ్యాంగ సంస్థ స్పందిస్తుందని ఎన్నికల సంఘం వర్గాలు ఆదివారం తెలిపాయి. ఈసీ తన ప్రచారంలో భాగంగా ఆరు జాతీయ పార్టీలను వేర్వేరు సంభాషణలకు ఆహ్వానించిందని కూడా ఈ సందర్భంగా ప్రస్తావించింది. అయితే మిగిలిన ఐదు పార్టీలు ఈసీ అధికారులను కలిసినప్పటికీ, కాంగ్రెస్ మే 15 సమావేశాన్ని రద్దు చేసింది. 2024 మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో రిగ్గింగ్ ఆరోపణలను ఎన్నికల సంఘం వర్గాలు తిరస్కరించిన తర్వాత, ఎగవేత దాని విశ్వసనీయతను కాపాడదని, కానీ నిజం చెప్పడం వల్ల ఇది సాధ్యమవుతుందని గాంధీ శనివారం ఎన్నికల కమిషన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అయిన రాహుల్ గాంధీ ఒక వ్యాసంలో మహారాష్ట్ర ఎన్నికల్లో 'మ్యాచ్ ఫిక్సింగ్' జరిగిందని ఆరోపిస్తూ, తదుపరి బీహార్ ఎన్నికల్లో జరుగుతుందని, 'బీజేపీ ఎక్కడైనా ఓడిపోతుంది' అని పేర్కొన్నారు. సాయంత్రం వేళల్లో మహారాష్ట్రలోని పోలింగ్ కేంద్రాల సీసీటీవీ ఫుటేజ్ కోసం రాహుల్ గాంధీ డిమాండ్ చేయడంపై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ, ఈసీ సూచనల ప్రకారం, ఎన్నికల పిటిషన్ దాఖలు చేసినప్పుడు, పోలింగ్ కేంద్రాల సీసీటీవీ ఫుటేజ్‌లను సమర్థ హైకోర్టు ఎల్లప్పుడూ పరిశీలించవచ్చని ఆ వర్గాలు తెలిపాయి. 'ఎన్నికల సమగ్రతను కాపాడటానికి, ఓటర్ల గోప్యతను కాపాడటానికి ఈసీ ఇలా చేస్తుంది. ఎన్నికల చట్టాల ప్రకారం ఈసీ రక్షించాల్సిన ఓటర్ల గోప్యతపై రాహుల్ గాంధీ ఎందుకు దాడి చేయాలనుకుంటున్నారు?' అని ఒక అధికారి స్పందించారు. ఏదైనా వ్యత్యాసాన్ని పరిష్కరించేందుకు హైకోర్టులను గాంధీ విశ్వసించాలని ఆయన అన్నారు. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని ఆరోపించడం ద్వారా రాహుల్ గాంధీ వాస్తవానికి తన సొంత పార్టీ నియమించిన బూత్ లెవల్ ఏజెంట్లను, మహారాష్ట్రలో తన సొంత పార్టీ అభ్యర్థులు నియమించిన పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్లను ప్రశ్నించారని కూడా ఈసీ వర్గాలు తెలిపాయి.

## మంత్రి ఆదేశం... చీఫ్ మెడికల్ ఆఫీసర్ సస్పెన్షన్



**పనాజి:** బిజెపి పాలిత గోవాలో సహనం కోల్పోయిన ఆరోగ్యశాఖ మంత్రి... చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీఎంవో)పై అందరి ముందు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతటితో ఆగక ఆ సీనియర్ డాక్టర్‌ను సస్పెండ్ చేయాలని ఆదేశించారు. మంత్రి తీరుపై విమర్శలు వచ్చినప్పటికీ తన చర్యను ఆయన సమర్థించుకున్నారు. ఆరోగ్యశాఖ మంత్రి విశ్వజిత్ రాణే ఆకస్మికంగా బాంబోలిమ్‌లోని గోవా మెడికల్ కాలేజ్ అండ్ ఆసుపత్రిని సందర్శించారు. క్యాజువాలిటీ వార్డులో తన అత్తపై డాక్టర్ అహంకారంగా ప్రవర్తించారన్న సీనియర్ జర్నలిస్ట్ ఆరోపణను మంత్రి ప్రస్తావించారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్ (సీఎంవో) డాక్టర్ రుద్రేశ్ కుర్తికర్‌పై అందరి ముందు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే ఆ సీనియర్ డాక్టర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని అక్కడికక్కడే ఆదేశించారు. కాగా, డ్యూటీలో ఉన్న సీఎంవోను తొలగించడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఆరోగ్య మంత్రి విశ్వజిత్ రాణే తీరును ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తప్పుపట్టింది. అయితే తన చర్యను ఆ మంత్రి సమర్థించుకున్నారు. రోగి పట్ల ఆ వైద్యుడు అహంకారపూరితంగా ప్రవర్తించారని ఆయన ఆరోపించారు. అందుకే ఆ డాక్టర్‌తో తన ప్రవర్తనపై క్షమాపణ చెప్పబోనని మీడియాతో అన్నారు.

## ముగిసిన కర్రెగుట్టల కథ

### ఇక ఇంద్రావతి నేషనల్ పార్క్ హిడ్మానే టార్గెట్



**ప్రజాపక్షం/ఖమ్మం :** మోస్ట్ వాంటెడ్ మావోయిస్ట్ హిడ్మాపైనే భద్రతా దళాలు దృష్టిసారించాయి. హిడ్మాను బంధించడమో లేదా అంతమొందించడమో జరిగితే ఇక మావోయిస్టు ఉద్యమ నిర్మూలనలో అంతిమ విజయం కూడా సాధించినట్లేనన్న భావన భద్రతా దళాల్లో వ్యక్తమవుతుంది. కర్రెగుట్టల్లో వందల సంఖ్యలో మావోయిస్టులు దాగి ఉన్నారన్న సమాచారం ఉందని వేల సంఖ్యలో భద్రతా దళాలు కర్రెగుట్టలను చుట్టు ముట్టాయి. దాదాపుగా కర్రెగుట్టలను పోలీస్ భద్రతా దళాలు కైవసం చేసుకున్నాయి. ఐదు కిలో మీటర్లకు ఒక అవుట్ పోస్ట్ చొప్పున ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఇప్పుడు ఇక భద్రతా దళాల దృష్టి ఇంద్రవతి నేషనల్ పార్కు వైపు మళ్లింది. మావోయిస్టులు ఈ ప్రాంతంలో దాగి ఉన్నారన్న సమాచారంతో భద్రతా దళాలు నేషనల్ పార్కును చుట్టుముడుతున్నాయి. ఇప్పటికే కొందరు మావోయిస్టులు ముఖ్యంగా కీలక స్థానాల్లో ఉన్నవారు భద్రతా దళాలకు చిక్కినట్లు పౌర హక్కుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. వారిని ప్రాణాలతో ఉంచాలని, అరెస్టులను చూపించాలని పౌర హక్కుల సంఘాలు కోరుతున్నాయి. ఇప్పటికే తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు భాస్కర్, కేంద్ర కమిటీ సభ్యుడు గౌతమ్ అలియాస్ సుధాకర్ సహా ఏడుగురు మృతతేహాలను కనుగొన్నట్లు ఛత్తీస్‌ఘఢ్ పోలీసులు ప్రకటించారు. కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు మృతి తర్వాత మావోయిస్టు పక్షాన హింసాత్మక దాడుల్లో సిద్ధ హస్తుడిగా పేరొందిన హిడ్మా కోసం పోలీసులు నేషనల్ పార్కును జల్లెడ పడుతున్నారు. నేషనల్ పార్కు అడవుల్లోనే హిడ్మా ఉన్నట్లు భావిస్తున్నారు. దాదాపు మూడు దశాబ్దాల అజ్ఞాతంలో ఒక్కసారి కూడా హిడ్మా భద్రతా దళాల కంట పడలేదు. ఇటీవలే హిడ్మాకు సంబంధించిన ప్రస్తుత ఫోటో ఒకటి విడుదల చేశారు. హింసాత్మక చర్యలకు పాల్పడడమే గాక స్వయంగా పాల్గొనే హిడ్మా పలుమార్లు తృటిలో తప్పించుకున్నాడు. లక్ష్యం తప్పకుండా హింసాత్మక చర్యలకు పాల్పడే హిడ్మాను హతమారిస్తే దాదాపు మావోయిస్టు ఉద్యమం కథ ముగిసినట్లేనని పోలీసులు భావిస్తున్న నేపథ్యంలో ఇంద్రావతి నేషనల్ పార్కులో ఏమి జరగబోతుందన్నది ఇప్పుడు చర్చనీయాంశమైంది.

## సోనియాకు రొటీన్ చెకప్



**సిమ్లా :** కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ ఆరోగ్యం నిలకడగా ఉంది. ఆమెకు రొటీన్ చెకప్ నిర్వహించారు. కుమార్తె ప్రియాంక గాంధీతో కలిసి వ్యక్తిగత పర్యటన కోసం హిమాచల్ ప్రదేశ్‌కు వెళ్లిన సోనియా, తీవ్రమైన రక్తపోటుకు గురయ్యారు. దీనితో ఆమెను సిమ్లాలోని ఇందిరా గాంధీ ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిచారు. 78 ఏళ్ల సోనియా వైద్య పరీక్షలు చేయించుకున్నారని, రక్తపోటు సాధారణ స్థితికి చేరుకున్న తర్వాత తిరిగి వెళ్లిపోయారని ఆసుపత్రి వర్గాలు పేర్కొన్నాయి. సీనియర్ డాక్టర్ల బృందం పర్యవేక్షణలో ఆమెకు అన్ని రకాల పరీక్షలు చేసినట్టు చ వర్గాలు తెలిపాయి. ఇది సాధారణ చెకప్ మాత్రమేనని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వివరించాయి. ఇలావుంటే, ఈ ఏడాది ఫిబ్రవరిలో కూడా సోనియా స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఆమెకు ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆసుపత్రిలో చికిత్స జరిపారు. అప్పట్లో ఆమె ఉదర సంబంధమైన సమస్యతో బాధపడినట్టు సమాచారం.

## బిజెపిని వీడిన యూట్యూబర్ మనీశ్ కశ్యప్

**న్యూఢిల్లీ:** బిజెపి నేత, యూట్యూబర్ మనీష్ కశ్యప్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. బిజెపి నుంచి వైదొలగుతున్నట్టు ఫేస్‌బుక్ లైవ్ సెషన్‌లో ఆయన ప్రకటించారు. బిజెపిలో ఉంటూ ప్రజలకు సమర్థవంతంగా సేవలు అందించలేకపోతున్నాననే భావనతోనే తాను పార్టీ నుంచి తప్పుకుంటున్నట్టు తెలిపారు. బీహార్, బిహారీల తరపున పోరాడాలని తాను కోరుకుంటున్నట్టు చెప్పారు. కశ్యప్ 2024 ఏప్రిల్ 25న బిజెపిలో చేరారు. 'బీహార్, బీహార్ ప్రజల కోసం పోరాడాలని అనుకుంటున్నాను. పార్టీలో ఉంటూ ప్రజావాణిని సమర్థవంతంగా వినిపించలేకపోతున్నాను. ఆ కారణంగానే పార్టీ నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాను' అని కశ్యప్ తెలిపారు. త్వరలో జరుగనున్న బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కడి నుంచి పోటీ చేయాలో సూచించాలని తన అభిమానులను లైవ్ సెషన్‌లో కోరారు. ఇటీవల జరిగిన పట్నా పీఎంసీహెచ్ ఆసుపత్రి ఘటన కశ్యప్ తాజా నిర్ణయానికి కారణంగా తెలుస్తోంది. ఆ ఘటనలో కశ్యప్‌పై వైద్యులు దాడి చేసినట్టు చెబుతున్నారు. బిజెపి తనకు మద్దతుగా నిలవకపోవడంపై ఆయన అసంతప్తితో ఉన్నారు. గత కొన్ని రోజులుగా ఆయన తన అసంతప్తిని బహిరంగంగానే వ్యక్తం చేస్తున్నారు. బీహార్‌లోని రాజకీయ పరిస్థితులు, ముఖ్యంగా 2025 చివర్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కశ్యప్ నిర్ణయం ఆసక్తికరంగా మారింది. ఆయన స్వతంత్ర అభ్యర్థిగా బీహార్ ఎన్నికల బరిలో దిగుతారా?, ఏదైనా పార్టీలో చేరతారా? అనేది తేలాల్సి ఉంది.

## ఒడిశాలో ఇద్దరు బాలికలపై సామూహిక అత్యాచారం

**భువనేశ్వర్ :** ఒడిశాలో పెళ్లి వేడుక నుంచి ఇద్దరు బాలికలను అపహరించి సామూహిక అత్యాచారానికి ఒడిగట్టిన అమానుష ఘటన జరిగింది. పెళ్లి వేడుకలో ఇద్దరు బాలికలను ఇద్దరు వ్యక్తులు అపహరించారు. వారిని జనం లేని ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడకు మరో ఇద్దరు వ్యక్తులు వచ్చారు. నలుగురు వ్యక్తులు కలిసి ఇద్దరు బాలికలపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఒడిశాలోని గంజాం జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జూన్ 3న జరిగిన పెళ్లి వేడుకలో 14, 15 ఏళ్ల వయస్సున్న ఇద్దరు బాలికలు పాల్గొన్నారు. ఒక బాలికకు తెలిసిన వ్యక్తితో పాటు మరో వ్యక్తి వారిని మభ్యపెట్టి నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లారు. అక్కడకు మరో ఇద్దరు వ్యక్తులు చేరుకున్నారు. నలుగురు కలిసి ఇద్దరు బాలికలపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయారు. కాగా, బాలికల కోసం వెతికిన కుటుంబ సభ్యులు జనం లేని ప్రాంతంలో వారిని గుర్తించారు. వారిపై లైంగిక దాడి జరిగినట్లు తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అనేక సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసు అధికారి తెలిపారు. బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. అదే గ్రామానికి చెందిన నలుగురు నిందితులు విశాఖపట్నం పారిపోతుండగా అరెస్టు చేసినట్లు వెల్లడించారు.

## అభిమానుల్ని నియంత్రించడం కష్టం

### ముందే హెచ్చరించిన డిసిపి
### తొక్కిసలాట ఘటనపై కొనసాగుతున్న దర్యాప్తు

**బెంగళూరు:** ఆర్సీబీ విజయోత్సవాల సందర్భంగా చిన్నస్వామి స్టేడియం వద్ద తొక్కిసలాట ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈ క్రమంలోనే కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ఓ సీనియర్ పోలీసు అధికారి ముందే హెచ్చరిస్తూ కొందరు ప్రభుత్వాధికారులకు లేఖలు రాసినట్లు సమాచారం.ఆర్సీబీ కార్యక్రమానికి ముందే సిబ్బంది, పరిపాలన సంస్కరణల కార్యదర్శి జి.సత్యవతితో సహా కొంతమంది ఉన్నతాధికారులకు అసెంబ్లీ భద్రతను చూసే డీసీపీ ఎంఎన్ కరిబసవన గౌడ ఓ లేఖను రాశారు. అందులో 'ఆ క్రికెట్ జట్టుకు దేశవ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. విధానసౌధలో కార్యక్రమం నిర్వహిస్తే.. లక్షలాది మంది అభిమానులు వచ్చే అవకాశం ఉంది. సిబ్బంది కొరత కారణంగా వారిని నియంత్రించడం కష్టం' అని ఆ లేఖలో పేర్కొన్నారు. స్టేడియంలోకి వచ్చేందుకు జారీ చేస్తున్న ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లలో ఎంట్రీ పాస్‌లను కూడా నిలిపివేయాలని ఆయన కోరారు.
సెక్రటేరియట్ సిబ్బంది కుటుంబసభ్యులను కార్యక్రమానికి తీసుకురాకుండా ఆదేశించాలని కోరారు. దీంతోపాటు వేదికకు దగ్గరగా ఉన్న సచివాలయానికి మధ్యాహ్నం సెలవు ప్రకటించాలన్నారు. విధాన సౌధ ఒక చరిత్రాత్మక కట్టడమని, అందులో సరైన నిఘా వ్యవస్థ లేదని డీసీపీ వివరించారు. కార్యక్రమానికి ముందు భద్రతాపరమైన తనిఖీలు నిర్వహించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. అదనపు బలగాలను మోహరించాల్సిన అవసరం ఉందని సూచించారు. బెంగళూరులో తొక్కిసలాట ఘటనలో 11 మంది మతిచెందగా.. 50 మందికి పైగా గాయపడిన సంగతి విదితమే. పోలీసుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన జరిగిందని ఆరోపిస్తూ.. నగర పోలీస్ కమిషనర్ దయానంద్, ఇంటెలిజెన్స్ చీఫ్ హేమంత్ నింబాల్కర్ సహా పలువురు కీలక పోలీసు అధికారులపై చర్యలు తీసుకోగా... కర్నాటక సీఎం సిద్ధరామయ్య రాజకీయ కార్యదర్శి కె.గోవిందరాజన్‌పై కూడా సస్పెన్షన్ వేటు వేశారు. ఆర్సీబీ మార్కెటింగ్ ప్రధానాధికారి నిఖిల్ సోసలె, ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ డీఎన్ఏ సిబ్బంది సునీల్ మాథ్యూ, కిరణ్, సుమంత్‌ను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే.

**బిజెపి ఎమ్మెల్యేల నిరసన**

చిన్నస్వామి స్టేడియం వద్ద జూన్ 4న జరిగిన తొక్కిసలాటలో 11 మంది మతిచెందిన ఘటనపై కర్నాటక బిజెపి ఎమ్మెల్యేలు, పార్లమెంటు సభ్యులు విధాన సౌధలోని మహాత్మాగాంధీ విగ్రహం ఎదుట ఆదివారం నిరసనలు తెలిపారు. సీఎం, డిప్యూటీ సీఎం రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేశారు. ఇదే సమయంలో, ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై గవర్నర్ గిరీశ్ కుమార్‌కు బెంగళూరు నివాసి ఒకరు ఫిర్యాదు చేశారు. సీఎం నిర్లక్ష్యంతోనే తొక్కిసలాట చోటుచేసుకుని 11 మంది మతికి దారితీసిందని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. ఆర్సీబీ విజయోత్సవంలో పాల్గొనాలంటూ ముఖ్యమంత్రి ప్రజలను వ్యక్తిగతంగా ఆహ్వానించారని, తగినంత భద్రతా చర్యలు తీసుకోకుండానే ఆయన ప్రజలను ఆహ్వానించారని ఫిర్యాదుదారు ఆరోపించారు.

## కస్టమ్స్ ఆఫీసర్ పేరుతో రూ.49 లక్షలు కుచ్చుటోపీ

**థానే :** కస్టమర్ ఆఫీసర్ అని చెప్పుకున్న ఓ వ్యక్తి సహా పలువురు మోసగాళ్లు తనను రూ.49.59 లక్షలకు మోసగించారిరని 46 ఏళ్ల ఒక మహిళ పోలీసులను ఆశ్రయించింది. విదేశం నుంచి 'ఒక బహుమతిని' పంపిస్తానని తనను నమ్మించి మోసగించాడని ఆ మహిళ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ విషయాన్ని ఆదివారం పోలీసులు వెల్లడించారు. ఈ మోసం జూన్‌ఆగష్టు మాసం మధ్య చోటుచేసుకోగా, నవీ ముంబయిలోని ఎయిరోలీ నివాసియైన బాధితురాలు శుక్రవారం రాబేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన వెలుగుచూసిందని ఒక అధికారి చెప్పారు. యునైటెడ్ కింగ్‌డమ్ (యుకె) నుంచి తాను వచ్చినట్లు చెప్పుకున్న ఒక వ్యక్తి బాధితురాలికి ఇన్‌స్టాగ్రామ్ సోషల్ మీడియా యాప్ ద్వారా అప్రోచ్ అయ్యాడు. స్నేహం బాగా పెరిగిన తర్వాత తాను చాలా ఖరీదైన బహుమతి పార్శిల్‌ను పంపిస్తానని ఆమెను నమ్మించాడని పోలీసులు చెప్పారు. ఆ తర్వాత ఒక మహిళ ఈ బాధిత మహిళను సంప్రదించారని,తాను ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌కు చెందిన కస్టమ్స్ ఆఫీసర్‌ను అని చెప్పారని, మీకు ఒక పార్శిల్ వచ్చిందని, అయితే వాటిని వివిధ రకాల చార్జీలు చెల్లించిన తర్వాతే మీరు ఆ పార్శిల్‌ను పొందగలుగుతారని చెప్పిందని అధికారి తెలియజేశారు. కాగా బాధితురాలు కస్టమ్స్ డ్యూటీలు, ఫారిన్ ఎక్స్ఛేంజ్ ఫీజు, పార్శిల్ హ్యాండ్లింగ్ చార్జిల పేరుతో డబ్బు చెల్లించాంటూ వివిధ బ్యాంక్ అకౌంట్లలో కొన్ని వారాలపాటు తనతో పలు దఫాలు డబ్బు వేయించుకున్నదని, బాధితురాలు పోలీసుల ఫిర్యాదులో తెలిపారు. అయితే ఆమె అడిగిన డబ్బును అనేక సార్లు చెల్లించినప్పటికీ వాగ్దానం చేసిన తన బహుమతి పార్శిల్‌ను ఎప్పటికీ పంపించకపోవడంతో తాను మోసపోయానన్న వాస్తవాన్ని బాధితురాలు గ్రహించిందని పోలీసులకు తెలియజేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు భారతీయ న్యాయ సంహితలో సెక్షన్ 318(4) (చీటింగ్)కింద సెక్షన్ 3(5) (కామన్ ఇంటెన్షన్) కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారి చెప్పారు.

## నకిలీ సర్టిఫికెట్‌తో 50కిపైగా గుండె ఆపరేషన్లు

**చండీగఢ్:** హర్యానాలోని ఫరీదాబాద్‌లో వైద్యరంగంలోనే అత్యంత దారుణమైన మోసం ఒకటి వెలుగులోకి వచ్చింది. కేవలం ఎంబీబీఎస్ డిగ్రీ మాత్రమే ఉన్న ఒక వైద్యుడు ఏకంగా కార్డియాలజిస్ట్‌గా నటిస్తూ ప్రభుత్వ ఆసుపత్రిలో 50కి పైగా గుండె సంబంధిత శస్త్రచికిత్సలు చేసిన ఘటన తీవ్ర కలకలం రేపుతోంది. ఫరీదాబాద్‌లోని బాద్‌షా ఖాన్ సివిల్ ఆసుపత్రిలో డాక్టర్ పంకజ్ మోహన్ శర్మ అనే వ్యక్తి ఈ దారుణానికి పాల్పడ్డాడు. సుమారు ఎనిమిది నెలలకు పైగా కార్డియాలజిస్ట్‌గా చలామణి అవుతూ గుండె జబ్బులతో బాధపడుతున్న రోగులకు శస్త్ర చికిత్సలు నిర్వహించాడు. వాస్తవానికి అతడికి ఎంబీబీఎస్ పట్టా మాత్రమే ఉంది. గుండె వంటి కీలకమైన అవయవాలకు సంబంధించిన సంక్లిష్టమైన శస్త్రచికిత్సలు చేయడానికి అతడికి ఎలాంటి అధికారిక అర్హత లేదని పోలీసులు స్పష్టం చేశారు. ఈ నకిలీ వైద్యుడు, ప్రస్తుతం ప్రాక్టీస్‌లో ఉన్న మరో నిజమైన కార్డియాలజిస్ట్ రిజిస్ట్రేషన్ నంబర్‌ను ఉపయోగించి ఈ మోసానికి పాల్పడినట్లు విచారణలో తేలింది. అతడితో సర్జరీ చేయించుకున్న అనేక మంది రోగులు తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఎదుర్కొన్నారని, వారిలో కొందరు మరణించినట్లు సమాచారం.

**మోసం బయటపడిందిలా...**

డాక్టర్ శర్మ ద్వారా చికిత్స పొందిన ఒక రోగి, అనుమానంతో అసలు రిజిస్ట్రేషన్ నంబర్ కలిగిన కార్డియాలజిస్ట్‌ను సంప్రదించడంతో విషయం బయటపడింది. దీనితో ఆసుపత్రి యాజమాన్యం అంతర్గత విచారణ చేపట్టింది. విచారణలో డాక్టర్ పంకజ్ మోహన్ శర్మ సమర్పించిన పత్రాలు నకిలీవని తేలింది. నకిలీ పత్రాలతో మోసం చేసినట్లు నిర్ధారణ కావడంతో ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ పంకజ్ మోహన్ శర్మను తక్షణమే విధుల నుంచి తొలగించింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## హైదరాబాద్ చేరుకున్న ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎ1 నిందితుడుగా ఉన్నటువంటి ఎస్ఐబి మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు ఎట్టకేలకు అమెరికా నుంచి హైదరాబాద్‌కు ఆదివారం సాయంత్రం చేరుకున్నారు. ఆయన సోమవారం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) విచారణకు హాజరయ్యే అవకాశం ఉందని సమాచారం. ప్రభాకర్‌రావుపై 2024 మార్చి 10న ఫోన్‌ట్యాపింగ్ కేసు నమోదు అయిన విషయం విదితమే.అయితే ఆయన ఆ మరుసటి రోజే (మార్చి 11న) మూడు నెలల కాలపరిమితిపై వీసాపై అమెరికా వెళ్లారు. అప్పటినుంచి ఆయన హైదరాబాద్‌కు తిరిగిరాలేదు. ఆయనను హైదరాబాద్‌కు రప్పించేందుకు పోలీసులు పలుసార్లు నోటీసులు జారీచేసినా ఆ ప్రయత్నాలు సఫలం కాలేదు. ఆయన కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఎస్ఐబి చీఫ్ ప్రభాకర్‌రావు అమెరికా నుంచి భారతదేశానికి వచ్చేందుకు తాజాగా ఎమర్జెన్సీ ట్రావెల్ డాక్యుమెంట్ జారీ అయ్యింది. దీంతో ఆయన సిట్ విచారణకు హాజరయ్యేందుకు అమెరికా నుంచి హైదరాబాద్‌కు ఆదివారం చేరుకున్నారు.

## పురిటి నొప్పుల తిప్పలు..



కొత్తగూడెం గ్రామానికి రహదారి లేక సకాలంలో చేరుకోని అంబులెన్స్.. మంచంపై మోసుకెళ్లిన గ్రామస్థులు..

**ప్రజాపక్షం/పినపాక:** మారుమూల ఏజెన్సీ గ్రామాల వాసులకు తిప్పలు తప్పడం లేదు. స్వాతంత్రం వచ్చి ఇన్ని సంవత్సరాలు అవుతున్నా రవాణా సౌకర్యం లేక ఆదివాసీలు అవస్థ పడుతూనే ఉన్నారు. ముఖ్యంగా గర్భిణులు తీవ్ర కష్టాలు ఎదుర్కోవడం పరిపాటిగా మారింది. ఆదివాసీ మహిళలు, ముఖ్యంగా గర్భిణులు, రహదారి సౌకర్యం లేకపోవటం వల్ల పురిటి నొప్పుల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి అంబులెన్స్ వెళ్లడానికి వీల్లేక, రోడ్డు మార్గం లేకపోవటం వల్ల వారు ఆసుపత్రికి చేరడానికి చాలా కష్టపడవలసి వస్తుంది, దీనివల్ల గర్భిణీలు వారి శిశువుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం టీ కొత్తగూడెం గ్రామపంచాయతీ ఉమేష్ చంద్ర నగర్ గ్రామంలో ఇలాంటి హృదయ విదారక ఘటన ఆదివారం చోటు చేసుకుంది మొడియం జానకి అనే గిరిజన మహిళకు పురిటి రావడంతో రహదారి సౌకర్యం లేక మంచానికి కట్టి మోసుకుపోయే పరిస్థితి ఏర్పడింది. కనీసం రహదారి సౌకర్యం లేక ఆ పురిటి నొప్పులతోనే మహిళా పడ్డ వేదన వర్ణనాతీతం. రహదారి లేకపోవటం వల్ల అంబులెన్స్ ఆ ప్రాంతాలకు చేరుకోలేవు, దీనివల్ల గర్భిణీలు ఆసుపత్రికి వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. రహదారి లేకపోవడంతో అక్కడే 108 వాహనం రాలేక ఆగిపోయింది. దీంతో గ్రామస్థులు మంచానికి కర్రలు కట్టి గర్భిణిని అందులో పడుకోబెట్టి మోసుకెళ్లారు. అక్కడి నుంచి ఆమెను అంబులెన్స్‌లో జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. రోడ్డు మరమ్మత్తు పనులు వెంటనే చేపట్టి త్వరలో శాశ్వత రోడ్డు నిర్మాణానికి కృషి చేయాలని రవాణా సౌకర్యం కల్పించాలని గ్రామ వాసులు కోరుతున్నారు.

## జ్వరం సిరప్ వికటించి చిన్నారి మృతి

మరో నలుగురు చిన్నారులకు అస్వస్థత



**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** జ్వరం సిరప్ వికటించి ఐదేళ్ల చిన్నారి మృతిచెందగా, నలుగురు చిన్నారులు అస్వస్థత గురైన సంఘటన అల్లాదుర్గంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికుల బంధువుల కథనం ప్రకారం, అల్లాదుర్గం గ్రామానికి చెందిన సిద్ధప్ప, భార్య సాయమ్మ లకు ఐదుగురు సంతానం, ఇద్దరు కుమారులు, ముగ్గురు ఆడపిల్లలు, ఈ చిన్నారులకు జ్వరం రావదంతో శుక్రవారం రోజు ఇంట్లో ఉన్న జ్వరం సిరప్, పిల్లలకు వేయమని భార్యకు చెప్పి భర్త బయటకు వెళ్లినట్లు బంధువులు తెలిపారు. భార్య సాయమ్మ ఐదుగురు పిల్లలకు జ్వరం మందు వేయడంతో చిన్నారులు అస్వస్థతకు గురికాగా, ఐదు సంవత్సరాల చిన్నారి ప్రియ మృతిచెందగా, మిగతా నలుగురికి చికిత్స నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిన్నారుల తండ్రి ఏదైనా విషపూరిత రసాయనం కలిపి ఉండవచ్చని బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై స్థానిక పోలీసులు విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు.

## కరీంనగర్‌లో స్పాట్ ఎడ్యుకేషన్ ఫెయిర్ సక్సెస్



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** తెలంగాణ విద్యాసమితి, టెక్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ సంస్థ ఆధ్వర్యంలో కరీంనగర్ పట్టణంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోగల అస్త్ర కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం 'స్పాట్ ఎడ్యుకేషన్ ఫెయిర్'ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కాంటెస్టెడ్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ డాక్టర్ ప్రసన్న హరికృష్ణ హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం వివిధ రాష్ట్రాలతో పాటు తెలంగాణ రాష్ట్రం నుంచి విచ్చేసిన యూనివర్సిటీ/కాలేజీలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. వివిధ కోర్సులలో అడ్మిషన్ తీసుకుంటున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అమూల్యమైన సలహాలు, సూచనలు చేశారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ కరీంనగర్‌లో మొదటిసారిగా స్పాట్ ఎడ్యుకేషన్ ఫెయిర్ నిర్వహించడం సంతోషంగా ఉందని తెలిపారు. తెలంగాణ విద్యాసమితి నిర్వాహకులను అభినందించారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి కరీంనగర్ జిల్లా విధ్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం తెలంగాణ విద్యాసమితి ఆధ్వర్యంలో వారిని ఘనంగా సత్కరించారు. స్పాట్ అడ్మిషన్ ఫెయిర్ 2025–26లో 30 పైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. దేశంలోని ప్రముఖ కాలేజీలు, యూనివర్సిటీలు పాల్గొన్నాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యాసమితి రాష్ట్ర అధ్యక్షుడు పెండెం తారక్ గౌడ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, ఆరెల్లి, టీం సభ్యులు పాల్గొన్నారు.

## కార్మికులకు సంక్షేమ పథకాల ఆర్థిక సహాయం రెట్టింపునకు డిమాండ్

**ప్రజాపక్షం/జనగామ టౌన్:** భవన నిర్మాణ కార్మికులకు ఇస్తున్న సంక్షేమ పథకాల ఆర్థిక సహాయం రెట్టింపు చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. గబ్బెట గోపాల్‌రెడ్డి భవనంలో జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం ఏర్పాటుచేయడం జరిగింది. ఈ సమావేశానికి సుద్దాల యాదగిరి అధ్యక్షత వహించగా శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ కార్మికుల ప్రమాదంలో మృతిచెందితే రూ.10లక్షలు, సహజ మరణానికి రూ.5లక్షలు ఇవ్వాలని, పూర్తి అంగవైకల్యం పొందితే రూ.10లక్షలు ఇవ్వాలన్నారు. 50సంవత్సరాలునిండిన కార్మికులకు రూ.5 వేలు పెన్షన్ ఇవ్వాలని రాష్ట్ర, జిల్లా కార్యాలయంలో మెమోరాండం ఇవ్వ డం జరిగిందన్నారు. నాయకులు అచ్యుత్, మల్లేశం, రాములు, నాగరాజు, యాకూబ్, నాగేష్, సిద్దులు,రాములు, ప్రభాకర్, సంపత్, పాల్గొన్నారు.

# పంటల బీమా రైతులకు అందేనా?

ఇందిరమ్మ ప్రభుత్వంపై ఆశలు
ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతింటున్న పంటలు
నష్టపోతున్న రైతులు
నిలిపివేసిన ఫసల్ బీమా పథకం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రకృతి వైపరీత్యాలతో పంటలకు నష్టం జరిగితే ఆదుకునే పంట బీమా పథకం అమలు కావడం లేదు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్రంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిలిపివేసింది. ఆరేళ్లుగా ఈ పథకం ఆగిపోయింది. జిల్లాలో గత రెం డేళ్ల నుంచి అధిక వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. పథకం అమలులో లేకపోవడంతో రైతులకు పరిహారం అందడం లేదు. దీంతో ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారు.

**ఫసల్ బీమా యోజన ద్వారా:** విపత్కర పరిస్థితుల్లో రైతుల పంటలు నష్టపోతే వారికి బీమా కల్పించి పరిహారం అందించేలా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకాన్ని రాష్ట్రంలో గతంలో అమలు చేసి నిలిపివేశారు. గతంలో అన్నదాతలు పంట నష్టపోతే పంటల బీమా ద్వారా కొంతమేరకు లబ్దిపొందారు.

**ఇందిరమ్మ ప్రభుత్వంపై ఆశలు:** గత బీఆర్ఎస్ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం నుంచి వైదొలగడంతో కొత్త పంటల భీమా పథకాన్ని అమలు చేయ లేదు. గత ఆరేళ్లుగా పంటల బీమా పథకం అమలు చేయలేక వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులు నష్టపోయారు. తాము అధికారంలోకి వస్తే పంటలు నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందేలా పంటల భీమా తీసుకొస్తామని అసెంబ్లీ ఎన్నికల మందు కా ంగ్రెస్ కమిటీ రూపొందించిన అభయహస్తం మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. ప్రభుత్వంపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్రంలో ఫసల్ భీమా యోజన పథకంలో చేరుతుందా.. ? లేక కొత్తగా పంటల భీమా పథకం తీసుకువస్తుందా అనే ప్రశ్నగా మిగిలింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటల బీమాపై నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**పంటల బీమా పథకాన్ని అమలు చేయాలి**



రాష్ట్రంలో పంటల బీమా ప్రవేశపెట్టాలి. అధిక వర్షాలకు పంట నష్టం జరిగితే, పరిహారం అందే అవకాశం లేకుండా పోయింది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకానికి గత బీఆర్ఎస్ ఇన్సురెన్స్ కంపెనీలకు వాటా చెల్లించలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని అమలు చేయాలి. ఖరీఫ్ సీజన్లో రైతులు పండించిన పంటలకు నష్టం జరిగితే పరిహారం అందించాలి.

– మారిశెట్టి వేంకటేశ్వరరావు (సిపిఐ మండల సహాయ కార్యదర్శి)

**భీమా ఉంటే పంట నష్టపోయిన రైతులకు మేలు**



పంటల భీమా ఉంటే పంట నష్టపోయిన రైతులకు మేలు చేకూరుతుంది. పంట పరిహారం అందుతుంది. గత రెండేళ్లుగా అధిక వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయి. పంటల భీమా ఉంటే ఇన్సురెన్స్ కంపెనీల ద్వారా పరిహారం అందేది.

– పాల్తియ శ్రీనివాస్ రావు (రైతు సంఘం మండల కార్యదర్శి)

## మహిళా ఎస్ఐతో దురుసుగా ప్రవర్తించిన నిందితుల అరెస్ట్



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం:** విధి నిర్వహణలో ఉన్న కల్లూరుఎస్ఐ పై దురుసుగా ప్రవర్తించిన ఏడుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసు కమిషనర్ సునీల్ దత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తల్లాడ గ్రామానికి చెందిన రాయల రామారావు అలియాస్ రాముతో పాటు కొంత మంది యువకులు శుక్రవారం సాయంత్రం కల్లూరు పట్టణం ఎన్ఎస్‌పి క్రాస్‌రోడ్డులోని చౌదరి హోటల్ వద్దకు వచ్చి అహారపదార్థాలు ఆర్డర్ ఇచ్చారు. మద్యం మత్తులో ఉన్న రాము అతని అనుచరులు హోటల్ సిబ్బందితో వివాదానికి దిగారు. ఇది తారాస్థాయికి చేరడంతో హోటల్ యజమాని మాగంటి బోసుబాబు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తమపై పోలీసులకు ఫిర్యాదు చేస్తావా అంటూ హోటల్ యజమాని, అక్కడి సిబ్బందిని రాము అతని అనుచరులు తిరిగి ఘర్షణకు దిగారు. తమకు వ్యతిరేకంగా ఎవరైనా సాక్ష్యం చెపితే హోటల్ నడవకుండా అడ్డుకుంటామని బెదిరింపులకు పాల్పడటంతో అప్పటికే హోటల్ యజమాని ఇచ్చిన ఫిర్యాదుతో సిబ్బందితో అక్కడికి చేరుకున్న ఎస్ఐ హరిత వారిని వారించి అక్కడి నుంచి పంపించి వేసేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో మద్యం మత్తులో ఉన్న రాము,అతని అనుచరులు విధి నిర్వహణలో ఉన్న ఎస్ఐపై దురుసుగా ప్రవర్తించి దాడికి యత్నించడంతో కల్లూరు ఎస్ఐఫిర్యాదు మేరకు నిందితులపై 103/2025 యూ1ఎస్ 74, 189, 191 (2), 195, 132, 351(2),2/2 190 బిఎన్ఎస్, సి 7(1) సె క్షన్ల కింద మొత్తం పదిమందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారిలో ప్రధాన నిందితుడైన చేయగా రాయల రామారావు అలియాస్ రాముతో పాటు ఏడుగురిని రిమాండ్‌కు తరలించినట్లు సిపి పేర్కొన్నారు. ఇదిలా ఉండగా గతంలో రాయల రామారావుపై తల్లాడ పోలీసు స్టేషన్‌లో పలు కేసులు సైతం ఉన్నట్లు తెలిపారు.

## నిష్కళంక ప్రజా నాయకుడు మదన్ లాల్

నేతల ఘననివాళి



**ప్రజాపక్షం/ఖమ్మం :** సుదీర్ఘ కాలం రాజకీయాల్లో కొనసాగిన బానోత్ మదన్‌లాల్ నిష్కలంక ప్రజా నాయకుడని వైరా నియోజక వర్గ అభివృద్ధికి తుది శ్వాస వరకు కృషి చేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇటీవల మరణించిన బానోత్ మదన్ లా ల్ సంస్మరణ కార్యక్రమం ఆదివారం రఘునాథపాలెం మ ండల పరిధిలోని ఈర్లపుడిలో జరిగింది. ఈ సందర్భంగా పలు వురు మదన్ లాల్ సేవలను కొనియాడారు. విప్లవ రాజకీయాలతో ప్రారంభమైన మదన్‌లాల్ రాజకీయ జీవితం ఎన్ని మలుపులు తిరిగినా తాను నమ్మిన ప్రజల కోసమే పని చేశారన్నారు. సర్పంచ్‌గా, శాసన సభ్యునిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. జిల్లా నలు మూలల నుండి ఆ యన అభిమానులు ఈర్లపుడి చేరుకుని నివాళులర్పించారు. వివిధ రంగాల ప్రముఖులు మదన్‌లాల్‌కు నివాళులర్పించి ఆ యనతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. ఆయన మరణం ఖమ్మం జిల్లా రాజకీయాలకు తీరని లోటని ఆయన స్థానాన్ని ఎవరు భర్తీ చేయలేరన్నారు. శాసనసభలో ప్రజా సమస్యలపై సానుకూల చర్చ చేసే మదన్‌లాల్ మరణం బడుగు, బలహీన వర్గాలకు తీరని లోటన్నారు. మదన్‌లాల్ కుమారుడు ఐఎఎస్ అధికారి మృగేందర్‌లాల్, ఆయన సతీమణి మంజుల వారి కుటుంబ సభ్యులను పలువురు ఓదార్చారు. కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, బిఆర్ఎస్ నాయకులు, ఇల్లందు శాసన సభ్యులు, ప్రముఖ వైద్యులు, టిఎన్‌జిఓజెఎసి సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, ఉద్యోగ సంఘాల నాయకులు, కా ంగ్రెస్ నాయకులు, డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం తదితరులు మదన్‌లాల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## భగవాన్‌దాస్ స్ఫూర్తితో ముందుకు సాగుదాం

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి పిలుపు





**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** బిఆర్ భగవాన్‌దాస్ అందించిన స్ఫూర్తితో ముందుకు సాగుతామని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి త క్కళ్ల పల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ప్రముఖ కార్మిక నేత, సీనియర్ కమ్యూనిస్టు నాయకులు బిఆర్ భగవాన్‌దాస్ 95వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హన్మకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల జంక్షన్ లో గల భగవాన్ దాస్ విగ్రహానికి వరంగల్ పశ్చి మ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యతో కలిసి సిపిఐ రాష్ట్ర సహా య కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస రావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ భగవాన్ దాస్ రాజకీయ వారసులుగా తాము ఆయన చూపిన బాటలో ప్రజల హక్కుల సాధనకు పోరాటాలు నిర్మిస్తామన్నారు. భగవాన్ దాస్ దేశంలో సమసమాజం రావాలని కోరుకున్నారని, ఆయన ఆశించిన సమాజం కోసం కమ్యూనిస్టులు, అంబేద్కరిస్టులు ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ వరంగల్‌లో అసంఘటిత రంగంలో గల ఆటో, హమాలీ, బీడి, సినిమా వర్కర్స్ కార్మికుల హక్కుల కోసం సంఘాలను ఏ ర్పాటు చేసిన నిస్వార్థ నాయకులు భగవాన్ దాస్ అని అన్నారు. నాడు బిఆర్ తీర్చి దిద్దిన నాయక త్వం నేటికీ ఉందని, తానూ రాజకీయాల్లో భగవా న్ దాస్ స్ఫూర్తితో పని చేశానని, ఆయన స్ఫూర్తితోనే ప్రజల సమస్యల పరిష్కారం కోసం పని చే స్తున్నామని అన్నారు. వరంగల్ నగరంలో నేడు నిరంతరం తాగునీటి సరఫరా జరుగుతుంటే అందుకు భగవాన్ దాస్ నడిపిన పోరాటాలే కారణమని అన్నారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ నగరంలో అసంఘటిత రంగ కార్మికుల హక్కులతో పాటు పేదలకు ఇండ్ల స్థలాల కోసం భగవాన్ దాస్ పోరాడారని అన్నారు. నీతి, నిజాయితీ, నిబద్ధతకు నిలువెత్తు నిదర్శనం బిఆర్ అని కొనియాడారు. నగరంలో మరో వందేళ్ల అయినా భగవాన్‌దాస్ సేవలను ప్రజలు మరిచిపోరని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కర్ణాకర్, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, అశోక్ స్టాలిన్, కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమాన్, మాజీ కార్పొరేటర్ స్వామి చరణ్, డాక్టర్ బి.రాజ్ సిద్దార్థ, మేడిపల్లి శోభన్ బాబు, టీయూడబ్ల్యూజే జిల్లా కార్యదర్శి తోట సుధాకర్, సిపిఐ నాయకులు మద్దెల ఎల్లేష్, వేల్పుల సారంగపాణి, నేదునూరి రాజమౌళి, కొట్టెపాక రవి, పీసరి రాము, జితేందర్, సంజయ్, డాక్టర్ బి.మేఘన, డాక్టర్ బి. ఆలయ పాల్గొన్నారు.

# ప్రైవేటుపై నియంత్రణేది?

ఇష్టానుసారంగా ఫీజుల వసూళ్లు
తప్పని డొనేషన్ బాదుడు
బాధ్యత మరిచిన ప్రభుత్వం
కార్పొరేట్ చెప్పుచేతల్లో విద్యాశాఖ



**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రభుత్వ విద్యారంగం కూనరిల్లుతున్న సమయంలో ప్రైవేటు విద్యా సంస్థల జోరు పెరిగింది. అన్ని వసతులు ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 10 నుంచి 15 మంది విద్యార్థులుంటే పక్కనే అర్హత గల బోధనా సిబ్బంది, మౌలిక వసతులు లేని ప్రైవేటు విద్యాలయాల్లో వందల మంది విద్యార్థులుండటం గమనార్హం. ప్రైవేటుపై మోజు ప్రభుత్వ విద్యాలయాలపై అపనమ్మకం విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఏర్పడడంతో ప్రైవేటు విద్యా సంస్థల యజమానులు మా దగ్గరికి రాక తప్పదు కదా అనే రీతిలో ఫీజుల దోపిడీకి తెర లేపారు. తాము చెప్పిందే ఫీజు అడిగిందే డోనేషన్ అనే రీతిలో వ్యవహరిస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రైవేటు ఫీజు భారంగా మారింది. ఆస్తులు అమ్ముకుంటే తప్ప ప్రైవేటు విద్యాలయాల్లో విద్యార్థులను చదివించలేని పరిస్థితి. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు ప్రైవేటు విద్యాలయాల్లో చదివించేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ప్రైవేటు పాఠశాలల ఏర్పాటు, నిర్వహణ వెనుక మానవీయ కోణం దాగి ఉండేది. విద్యా సంస్థలు నెలకొల్పేటప్పుడే ఎక్కువ మందిని ఉన్నత విద్యావంతులుగా తయారు చేయాలనే లక్ష్యంతో పాటు పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన మెరిట్ విద్యార్థులకు ఉచితంగా విద్యను బోధించాలనే ఆలోచన ఉండేది. లాభాల కంటే ఇబ్బందులు లేకుండా పాఠశాలల నిర్వహణే వారి ఆలోచనగా ఉండేది. ఇప్పుడు విద్యా సంస్థలు నెలకొల్పుతున్న వారిలో అత్యధిక శాతం మందికి ధనార్జనే ధ్యేయ ంగా మారింది. కార్పొరేట్ సంస్థల సంగతి చెప్పాల్సిన అవసరమే లేదు. తన, మన, పర , పేద, సాద అనే బేధం లేకుండా వసూళ్లకు పాల్పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో సిబ్బంది లేకపోవడం ప్రత్యేకించి విద్యార్థుల సంఖ్య కనిష్ట స్థాయిలో ఉండడంతో అక్కడ చదివితే తమ పిల్లలకు భవిష్యత్తు ఉండదన్న భావన పెరిగిపోయింది. రెండవది ప్రైవేటు మోజు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చదివించే వారిని హీనంగా చూస్తున్న పరిస్థితి కూడా. అప్పో సప్పో చేసి ప్రైవేటు పాఠశాలల్లో చదివించే పరిస్థితికి తీసుకు వస్తుంది. ప్రజల ఆలోచనకు అనుగుణంగా ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలపై అజమాయిషితో పాటు ఫీజులను నియంత్రించాల్సి ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ఫీజులకు సంబంధించి ఒక జిఓను విడుదల చేసి దానిని సక్రమంగా అమలు చేయాల్సి ఉంది. ప్రభుత్వం యేటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా ఎందుకు ప్రభుత్వ పాఠశాలలు విశ్వసనీయతను కోల్పోతున్నాయో ఆలోచన చేయడం లేదు. పరోక్షంగా ప్రభుత్వ తీరు ప్రైవేటును ప్రోత్సహించినట్లవుతుంది. ప్రైవేటు పాఠశాలలు ఎక్కడ ప్రభుత్వ నిబంధనలను పాటించడం లేదు. ఒక విద్యా సంస్థ ఏర్పాటుకు కావాల్సిన నియమ నిబంధనలను గాలికి వదిలేస్తున్నాయి. అర్హత లేని బోధన సిబ్బందిని అరకొర వేతనాలతో నియమించుకుని ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయి. బోధనా సిబ్బందికి అర్హత లేకపోయినా పాఠశాలలకు ఉండాల్సినటువంటి వసతులు లేకపోయినా ఫీజుల వసూళ్లలో రాజీ లేదన్న రీతిలో యజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి. ఇక ఫీజుల సంగతి ఇలా ఉంటే యూనిఫాం, పుస్తకాలు, ఇతరత్రా వాటిపై యజమాన్యాలు లాభసాటి వ్యాపారం నిర్వహిస్తున్నాయి. తమ వద్దనే కొనాలి. తాము చెప్పిన ధరకే కొనాలి అంటూ షరతు విధిస్తున్నారు. పిల్లలు వాడే బూట్లు, టై, బ్యాడ్జీలు కూడా రెండింతల అధిక ధరకు విక్రయిస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. అడ్డదారిలో విద్యా వ్యాపారం అడ్డగోలుగా సాగుతున్న విద్యాశాఖ ప్రైవేటు పాఠశాలల వైపు కన్నెత్తి చూడటం లేదు. పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య ఎంత, అర్హత కలిగిన బోధనా సిబ్బంది ఎంత, పాఠశాలలకు ఆట స్థలముందా, నీటి వసతి ఉందా, బహుళ అంతస్తుల భవనాల్లో రక్షణ వ్యవస్థ ఉందా అని పరిశీలన చేయాల్సిన విద్యాశాఖాధికారులకు ఆ ఆలోచనే లేదు. ఎద్దు ఈనిందంటే గాటికి కట్టేయ్యమన్నట్లు కార్యాలయాల్లో కూర్చుని అడ్డగోలుగా అనుమతులు ఇస్తున్నారు. పాఠశాల ఒక చోట ఆట స్థలం మరో చోట. అయిన అభ్యంతరం తెలపడం లేదు. పరోక్షంగా ప్రభుత్వ విద్యను నీరుగార్చి ప్రైవేటును ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకు వచ్చి తూచ తప్పకుండా అమలు చేయాల్సి ఉంది. అదే సమయంలో ప్రభుత్వ రంగ విద్యా సంస్థలను మరింత బలోపేతం చేయాల్సి ఉంది. లేకుంటే విద్యా దోపిడీ మరింత పెరిగే అవకాశం ఉంది.

## ట్రాఫిక్ సమస్యలు నియంత్రించేందుకు ఫ్లైఓవర్ల నిర్మాణాలు

**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్యలను నియంత్రించేందుకే ఫ్లై ఓవర్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టడం అభినందనీయమని మాజీ జడ్పిటిసీ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం షాద్‌నగర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కొత్తూరు బైపాస్ నుండి బూర్గుల గేట్ వరకు వివిధ ప్రధాన ప్రాంతాల్లో ఫ్లై ఓవర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం అభినందనీయమన్నారు. ఇప్పటికే వాటి నిర్మాణానికి నిధులు కేటాయించడం, త్వరలోనే నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ఈ వంతెనల నిర్మాణాలు పూర్తి అయితే కొత్తూరు, కేశంపేట ప్రజలకు ఎంతో మేలు చేసినట్లు అవుతుందని గుర్తు చేశారు. బైపాస్ రహదారి దాటాలంటే ఎన్నో ఇబ్బందులు, రోడ్డు ప్రమాదాలను చవి చూడాల్సి ఉండేదని, ఈబ్రిడ్జి నిర్మాణాలతో వీటన్నింటికి చెక్ పెట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని వివరించారు. ఇందుకు కృషి చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు.

## కాలనీల అభివృద్ధికి కృషి : రాగుల

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** కాలనీల అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని వనస్థలిపురం డివిజన్ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని వెంకటరమణ కాలనీలో సిసి రోడ్డు, భూగర్భ డ్రైనేజీ పనులను కాలనీ వాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీల్లో జరిగే అభివృద్ధి పనులను కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధుల సహకారం ఉండాలన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సంబంధిత అధికారుల సూచించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు నవీన్ కుమార్, సభ్యులు యాదవ్ రెడ్డి, సీతారాం, భూపాల్‌రెడ్డి, కృష్ణ చారి, రాజేష్ బాబు పాల్గొన్నారు.



## గ్రామీణ ప్రాంతాల్లో ప్రీ ప్రైమరీ స్కూళ్లు



**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక విద్య బలోపేతానికి కృషి చేస్తున్నట్టు ఆల్ ఇండియా ప్రైవేట్ స్కూల్ అసోసియేషన్ (ఎఐపిఎస్ఎ) అధ్యక్షులు సింజు అగస్టిన్ తెలిపారు. ఇందులో భాగంగా గ్రామీణ విద్యా జ్యోతి భారత్ (జివిబి), ఎఐపిఎస్ఎ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ, ఎపిలో పైలెట్ ప్రాజెక్టుగా 50 పాఠశాలల చొప్పున ప్రారంభించనున్నట్టు చెప్పారు. ఆదివారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జివిబి ఎండి సోమశేఖర్, డైరెక్టర్లు శ్రీనివాస్, రామకృష్ణతో కలిసి ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో ఇంటర్ ఆపై చదువు పూర్తి చేసిన మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి , జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో ప్రీ ప్రైమరీ స్కూళ్లు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఇంటర్ ఆపైన చదివిన మహిళలకు టీచింగ్‌లో మూడు నెలలు శిక్షణ ఇచ్చి, ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దుతామని, తద్వారా వారికి ఉపాధి లభిస్తుందన్నారు. పాఠశాలలో చేరిన తర్వాత ఎంపికైన వారికి నెలవారీగా జీతం అందిస్తామన్నారు. ప్రాథమిక విద్య నిర్లక్ష్యానికి గురవుతున్న నేపథ్యంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు చెప్పారు. ఆసక్తి ఉన్న మహిళలు 7012403800ను సంప్రదించాలని సూచించారు.

## రేపు హిందీ ప్రచార సభ హైదరాబాద్ 90వ వార్షికోత్సవం




**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** హిందీ భాషాభివృద్ధికి విశేష కృషి చేసి అనేక వేలాది మందిని అధ్యాపకులుగా తీర్చిదిద్దిన హిందీ ప్రచార సభ హైదరాబాద్ సంస్థ 90వ వార్షికోత్సవాన్ని ఈ నె ల 10న జాతీయస్థాయిలో హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్టు సభ హైదరాబాద్ అధ్యక్షులు ప్రొఫెసర్ చంద్రదేవ్ కావడే, ప్రధానకార్యదర్శి ఎస్.గైబువల్లి తెలిపారు. నాంపల్లి స్టేషన్ రోడ్డులోని హిందీ ప్రచార సభ హైదరబాద్ ప్రదాన కార్యాలయంలో ఈవేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ వేడులకు ముఖ్యఅతిథులుగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, సెంట్రల్ హిందీ డైరెక్టర్ ప్రొఫెసర్ సునీల్ బాబు కులకర్ణి హాజరవుతారని తెలిపారు. హిందీ భాషాభివృద్ధికి విశేషంగా కృషి చేసిన వారికి హిందీ సేవా ప్రతిభా పురస్కారాలు, వివిధ పోటీల విజేతలకు ప్రశంసా పత్రం, బహుమతుల ప్రదానం చేస్తామని వివరించారు.


## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుంది

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని స్థానిక శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్ వివరించారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని 16వార్డు క్రిష్టియన్ కాలనీలో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒకేసారి కాకుండా దశల వారిగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇప్పటికే అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడంతోపాటు రేషన్ కార్డులు సైతం ఇస్తున్నామని గుర్తు చేశారు. ధరఖాస్తులు పెట్టుకున్న ప్రతి లబ్దిదారుడికి ప్రభుత్వ పథకాలు వర్తించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ నేతలు బస్వం, నడికూడ యాదగిరి యాదవ్, బచ్చలి నరేష్, శ్రీకాంత్‌రెడ్డి, ముబారక్ అలీ, చిన్న, మంగ అశోక్, దిలీప్, మాధవ్, లక్ష్మ ణ్, కిశోర్, వన్నాడ వెంకటేష్ గౌడ్, మానవపాటి ప్రదీప్‌కుమార్, కావలి శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

## వాకిటి శ్రీహరికి అభినందన



**ప్రజాపక్షం/కొత్తూరు:** సామాజిక వెనుకబడి వర్గానికి చెందిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవీ ఇచ్చి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట నిలబెట్టుకున్నారని కొత్తూరు మాజీ జడ్పిటిసి సభ్యుడు మామిడి శ్యాంసుందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మంత్రి వర్గ విస్తరణలో భాగంగా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవీ ఇచ్చిన నేపథ్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. .

## ది సిటిజన్ కౌన్సిల్‌కు చెడ్డపేరు తేవొద్దు



**ప్రజాపక్షం/గండిపేట:** ప్రజాల సమస్యల కోసం ది సిటిజన్ కౌన్సిల్ నిరంతరం పోరాడుతుందని ప్రధాన కార్యదర్శి ఉపేంద్ర నాథ్ రెడ్డి అన్నారు.తమ కౌన్సిల్ పేరును కొందరు ప్రజల్లో తప్పుగా సూచించే కుట్ర చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు.ఆ ఆరోపణలు అవాస్తవమని ద సిటిజన్ కౌన్సిల్ కార్యదర్శి ఉప్పేంద్రనాథ్ రెడ్డి, కోశాధికారి లక్ష్మణరావు అన్నారు.మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని డాలర్ హిల్స్ కాలనీ యందు ఉపేంద్ర నాథ్ రెడ్డి కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ది సిటిజన్ కౌన్సిల్ కార్యదర్శి ఉప్పేంద్రనాథ్ రెడ్డి, కోశాధికారి లక్ష్మణరావులు మాట్లాడుతూ... సిటిజన్ కౌన్సిల్ చేస్తున్న పనుల గురించి వివరిస్తూ మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేస్తున్నమన్నారు. సిటిజన్ కౌన్సిల్ నుంచి సొంత డబ్బులు కేటాయించి సోషల్ ఆక్టివిటీస్ చేస్తున్నామని ఎలాంటి దౌర్జన్యాలకు అక్రమాలకు పాల్పడడం లేదని వారు తెలియజేశారు.సిటిజన్ కౌన్సిల్ బద్నానం చేస్తే ఊరుకునేది లేదని చట్టపరంగా చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.

# దోపిడీ లేని సమాజం కోసం కమ్యూనిస్టుల పోరాటాలు

సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి




**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** దోపిడీ లేని సమాజం కోసం కమ్యూనిస్టుల పోరాటమని, కష్టజీవుల రాజ్యం ఎర్రజెండాతోనే సాధ్యం అని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. ఆదివారం సిపిఐ బాలాపూర్ మండల 6వ మహాసభ లెనిన్ నగర్‌లోని హోలీయ దాసరి సంక్షేమ సంఘం భవన్‌లో నిర్వహించారు. మహాసభకు సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారితో కలిసి సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మహాసభ ప్రారంభానికి ముందుగా సిపిఐ జెండాను ఎగరవేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలాపూర్ మండలంలో భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని గుర్తు చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం ఎజెండాగా సిపిఐ పనిచేస్తుందని తెలిపారు. పెట్టుబడిదారీ సమాజంలో తీవ్ర అసమానతలు పెరిగిపోతున్నాయని, అసమానతలు లేని సమాజం కష్టజీవులు, శ్రామికుల సమస్యల పరిస్కారం, సమసమాజ స్థాపన ఎర్రజెండాతోనే సాధ్యమని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమాయక ఆదివాసి గిరిజనులపై హత్యాకాండ కొనసాగిస్తుందని, మావోయిస్టులు చర్చలకు ఆహ్వానించిన నేపథ్యంలో వెంటనే ఆపరేషన్ కగార్ నిలిపివేసి, మావోయిస్టులతో చర్చలు జరపాలని వారు డిమాండ్ చేశారు. పాలక పార్టీలు ప్రజల సమస్యలు పరిష్కారం దిశగా పని చేయడం లేదని, బడా కార్పొరేట్ పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించాలని మహాసభలో నిర్ణయించారు.

**నూతన కమిటీ ఎన్నిక ...** అనంతరం సిపిఐ బాలాపూర్ మండల కౌన్సిల్‌ను 15 మంది సభ్యులతో మహాసభలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిపిఐ బాలాపూర్ మండల కార్యదర్శిగా చంద్రశేఖర్‌రెడ్డి, సహాయ కార్యదర్శిగా జాటోత్ రెడ్యానాయక్, కౌన్సిల్ సభ్యులుగా పిచ్చిరాజు, దేరంగుల శంకరయ్య, జాజాల అంజయ్య, శివ, రమావత్ చత్రు నాయక్, బండ యాదమ్మ యాదవ్, రమాపాండు నాయక్, వీరస్వామి, కౌసల్య, దేవయ్య, రమేష్, మిరియాల లక్ష్మమ్మ, పద్మ ఎన్నికయ్యారు. సమావేశంలో పలువురు సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

# జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో పోటీకి సమాయత్తం

సిపిఐ ఎల్‌బినగర్ నియోజకవర్గ కార్యదర్శి శేఖర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** వచ్చే జిహెచ్‌ఎంసి కార్పొరేటర్ ఎన్నికల్లో మన్సూరాబాద్ డివిజన్ నుంచి సిపిఐ పార్టీ పోటీలో ఉంటుందని సిపిఐ ఎల్‌బి నగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడి తెలిపారు. ఆదివారం హయత్ నగర్ మండల పరిధిలోని పవనగిరి కాలనీ సిపిఐ శాఖ మహాసభను శ్రీరామ్ నగర్ కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌బి నగర్ నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి సామిడి శేఖర్‌రెడి మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, బానిస సంకేళ్ల విముక్తి కోసం వీరోచితమైన పోరాటాలు చేసిన ఘనత కమ్యూనిస్టులకు ఉందన్నారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో సిపిఐది అగ్రస్థానమని ఆయన గుర్తు చేశారు. స్థానిక సమస్యలపై కూడా సిపిఐ పోరాటం చేస్తుందని ఆయన తెలిపారు. ఎల్‌బి నగర్ నియోజకవర్గం పరిధిలోని చెరువులు, కుంటలు, పార్కు స్థలాలు, ప్రభుత్వ భూములను స్థానిక బడా బాబులు, రియల్ ఎస్టేట్ మాఫియా కలిసి అన్యాక్రాంతం చేస్తున్నారని ఆరోపించారు. మన్సూరాబాద్ డివిజన్‌లోని శివంహిల్స్ కాలనీలో 150 గజాల స్థలాన్ని కబ్జా చేశారని ఆయన ఆరోపించారు. డివిజన్‌లోని కొన్ని కాలనీల్లో పార్కు స్థలాలుఆక్రమణలకు గురి అవుతున్నాయన్నారు. అక్రమణలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సిపిఐ అండగా ఉంటుందని తెలిపారు. జిహెచ్‌ఎంసి ఎన్నికల్లో సిపిఐ మన్సూరాబాద్, హయత్ నగర్ డివిజన్ నుంచి పోటీ చేస్తుందన్నారు. సమావేశంలో సిపిఐ శాఖ కార్యదర్శి కొండపురం అరుణ, మండల కార్యదర్శి శేషురాజుపల్లి శ్రీదేవి, సహాయ కార్యదర్శి మర్రి శోభన్, బొంగ అరుణ్ కుమార్‌గౌడ్, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి వంశీవర్ధన్‌రెడ్డి, మహిళా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు కర్నే సుజాత, కొప్పుల సరిత, ఏశమల్ల మమత, ఉపేందర్, రాములు గౌడ్, రేణుక, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలు అమలు చేయాలి

సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి

**ప్రజాపక్షం/షాబాద్ :** సిపిఐ 16వ మండల మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి కోరారు. ఆదివారం చేవెళ్ల మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ చేవెళ్ల సమావేశాన్ని మండల పార్టీ కార్యదర్శి సత్తిరెడ్డి అధ్యక్షతన ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పాల్గొని ప్రజల సమస్యలు, కార్యకర్తల సమస్యల పరిష్కరం పై సమీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేసేవిధంగా కార్యచరణ ఎర్పాటు చేసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎఐకెఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.ప్రభులింగం, జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ, జిల్లా నాయకులు ఎండి మక్బూల్ తదితరులు ఉన్నారు.




## దాతల సహకారంతో దేవాలయాల అభివృద్ధి : ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** దాతల సహకారంతో దేవాలయాన్ని అభివృద్ధి చేయడం అభినందనీయమని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్‌లోని భవాని మాత ఆలయ విగ్రహా పున ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండేలా అమ్మవారి చల్లని చూపు, అశీస్సులు సకల జనులపై ఉండాలని అమ్మవారికి వేడుకున్నట్లు తెలిపారు. అమ్మవారి అశీస్సులు ఉంటేనే ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండేందుకు అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ కొందూటి నరేందర్, కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, మాజీ కౌన్సిలర్ బచ్చలి నరసింహా, కానుగు అనంతయ్య, నేతలు యాదగిరి, యుగేందర్, దినేష్‌సాగర్, మంగ శ్రీశైలం, పిట్టల మల్లేష్, శివ, మధు, శివాచారి, సుధీర్, గుట్ట రాజు, అన్వారీ రాజులు పాల్గొన్నారు.

## మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తే సమాజం అభివృద్ధి

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** మహిళలు అన్నిరంగాల్లో రాణించినప్పుడే సమాజం అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని ఫరూఖ్‌నగర్ మండల బిసి సేన అధ్యక్షురాలు జక్కుల జలజ అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రంగంపల్లి గ్రామంలో బీసిసేన మహిళా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జక్కుల జలజ మాట్లాడుతూ వెనుకబడిన బిసిలు ముందంజలో ఉండాలని, అప్పుడే సమాజం అభివృద్ధిలో ముందుకు వెళ్తుందన్నారు. గ్రామకమిటీ అధ్యక్షరాలుగా పురుగుల అంజమ్మ, ఉపాధ్యక్షురాలిగా పురుగుల లావణ్య, ప్రధాన కార్యదర్శిగా పురుగుల స్వరూప, కార్యదర్శిగా జవ్వాజి అనిత, సహాయ కార్యదర్శిగా పురుగుల లలితను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసిసేన అధ్యక్షుడు సదర్ శ్రీనివాస్, అసెంబ్లీ బీసిసేన అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్, వివిధ మండలాల అధ్యక్షులు జయ శ్రీకాంత్, ఉపాధ్యక్షురాలు అనుప స్రవంతి రాజు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్‌కు పార్టీ శ్రేణుల నివాళి



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** జూబ్లీహిల్స్ శాసన సభ్యులు మాగంటి గోపినాథ్ మృతి చెందడంతో స్థానిక బిఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నివాళ్ళు అర్పించారు. ఆదివారం పట్టణంలోని ముఖ్యకూడలిలో స్వర్గీయ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. నియోజకవర్గ ప్రజల అభ్యున్నతి కోసం మాగంటి గోపినాథ్ ఎంతో కృషి చేశారని, ఎక్కడ సమస్యలు ఉన్నా తక్షణమే అక్కడికి చేరుకొని నివారించేందుకు కృషి చేసే వారని గుర్తు చేశారు. వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటి చైర్ పర్సన్ మన్నె కవిత నారాయణ, మాజీ మున్సిపల్ చైర్మెన్ కొందూటి నరేందర్, మాజీ వైస్ చైర్మెన్ ఎంఎస్ నటరాజన్, నేతలు లక్ష్మ ణ్ నాయక్, చంద్రశేఖర్, వీరేశం, శ్రీనివాస్‌రెడ్డి, చిన్న యాదగిరి, రాఘవేందర్, శరత్ కృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# 'అయ్యప్ప'లో జోరుగా అక్రమ నిర్మాణాలు

సహకరిస్తున్న కిందిస్థాయి సిబ్బంది, రూ.లక్షల్లో అక్రమార్జన







**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి:** చందానగర్ సర్కిల్ 21 పరిధిలో ఎక్కడ చూసిన అక్రమ నిర్మాణాలతో పాటు భారీ స్థాయిలో అక్రమ షేడ్లు దర్శనమిస్తున్నాయి. తూతూ మంత్రంగా అధికారులు తమ విధులను నిర్వహిస్తుండడంతో పాటు మామ్ముళ్ళ మత్తులో నిద్రవస్తలో ఉండడంతో అక్రమ నిర్మాణదారులు ఇష్టానుసారంగా నిర్మాణాలను చేపడుతున్నారు. అయ్యప్ప సొసైటీలో ఓ బిల్డర్ పర్మిషన్ లేకుండా 5 బిల్డింగ్‌లు 8 నుండి 9 అంతస్థుల నిర్మాణాలు చేపడుతుంటే కేవలం అక్రమ నిర్మాణాదారుల వద్ద ముడుపులు దండుకోవడమే ధ్యేయంగా అధికారులు, చైన్‌మెన్‌లు పని చేస్తున్నారని స్థానికులు అరోపిస్తున్నారు. కాసులకు కక్కుర్తి పడుతూ అధికారులు అక్రమ నిర్మాణాల జోలికి వేళ్ళడం లేదని శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌కు, చందానగర్ డిసికి, ఎసిపిలకు చందానగర్ ప్రజలు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసిన చర్యలు తీసుకోకపోవడం విడ్డురం అని వాపోతున్నారు. అక్రమ నిర్మణాలపై కొరడా జులిపిస్తామంటూ తెలంగాణ ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న జిహెచ్‌ఎంసి అధికారులలో మాత్రం చలనం రావడం లేదని, మామ్ముళ్ళ మత్తులో కోట్లాది రూపాయలు వెనుకేసుకుంటూ అక్రమ నిర్మాణాలకు పూర్తిగా సహకరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పేదవాడు ఏదైనా నిర్మాణం చెపట్టలంటే ఎన్నో కండిషన్లు పెట్టి నానా ఇబ్బందులు పెట్టే అధికారులు తమకు కాసులు అందించిన నిర్మాణదారులపై ఎన్ని ఫిర్యాదులు వచ్చిన చూసి చూడనట్లు వదిలేస్తున్నారని వారు తెలిపారు. చందానగర్ సర్కిల్ 21 పరిధీలోని మాదాపూర్ డివిజన్‌లోని అయ్యప్ప సొసైటీ, సర్వే ఆఫ్ ఇండియాలలోని స్థలం పూర్తిగా కోర్టు పరిధీలో ఉన్న రాజకీయ నాయకుల, అధికారుల అండతో అక్కడ ఎటువంటి పర్మిషన్ లేకుండా జి+5, జి+6, జి+7 ల స్థాయిలో భారీ ఎత్తున అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్న పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాల వెనుక కింది స్థాయి సిబ్బంది, చైన్‌మెన్‌లదే హవా అని, తతంగం అంతా వారే నడిపిస్తున్నారని, వారు ఎంత చెపితే అంత ఇచ్చుకొవాల్సిందేనని, లేదంటే కూల్చివేతలు తప్పవని, దీనితో అధికారులకు సైతం ముడుపులు అందిస్తున్నారని పుకార్లు జోరుగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ఏ సర్కిల్‌లో ఉన్న డిప్యూటీ కమిషనర్‌కు ఆ సర్కిల్ కూల్చివేతల భాధ్యతలు అందించినా, చందానగర్ సర్కిల్‌లో అక్రమ నిర్మాణాల జోరు తారస్థాయికి చేరుకున్నాయని అవేదన వ్యక్తం చేస్తున్నారు. చందానగర్ సర్కిల్ పరిధీలోని మాదాపూర్ గురుకుల్ ట్రస్ట్‌లోని అయ్యప్ప సొసైటీ, సర్వే ఆఫ్ ఇండియాలలో ఎటువంటి పర్మిషన్ లేకుండా వందల కొద్ది అక్రమ నిర్మాణాలు చేపడుతున్న అధికారులకు మాత్రం కంటికి కనిపించడం లేదా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాలనీవాసులు జిహెచ్‌ఎంసి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన మేము చూసుకుంటాం అంటూ కింది స్థాయి చైన్మెన్, సిబ్బంది అక్రమ నిర్మాణాదారులకు భరోసా అందిస్తు లక్షలలో ముడుపులు అందుకుంటున్నారని అరోపిస్తున్నారు. చందానగర్ సర్కిల్‌లోని అయ్యప్ప సొసైటీ, సర్వే ఆఫ్ ఇండియాలలో బడా బిల్డర్, రాజకీయ నాయకుల అండతో నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని చందానగర్ వాసులు డిమాండ్ చేస్తున్నారు. చందానగర్ సర్కిల్ పరిధిలోని గురుకుల్ ట్రస్ట్ పరిధిలోని అయ్యప్ప సొసైటీ, సర్వే ఆఫ్ ఇండియాలలో ఎన్నో సంవత్సరాలుగా కోర్టు పరిధిలో కేసులో ఉన్న ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడని నిబంధనలు ఉన్న అక్రమ నిర్మాణాల జోరు మాత్రం అగడం లేదని, వాటిపై అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదులు అందినా పట్టించుకోవడం లేదని ప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలను జిహెచ్‌ఎంసి అధికారుల సహకారంతోనే ఓ బిల్డర్ భారీస్థాయిలో జి+5, జి+6, జి+7 అక్రమ నిర్మాణాలను నిర్మిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. కింది స్థాయి టౌన్ ప్లానింగ్ సిబ్బంది, చైన్‌మెన్‌లు ప్రతి స్లాబుకు లక్షలలో వసూళ్ళు చేస్తు పై స్థాయి అధికారులకు సైతం వాటాలు అందిస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. గతంలో విధులు నిర్వహించిన చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సున్నం చెరువులో అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసి అక్రమ నిర్మాణదారులపై కొరడా జులిపించారని, కాని ఇప్పుడు పై స్థాయి అధికారులతో పాటు కింది స్థాయి సిబ్బంది మామూళ్ల మత్తులో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన అక్రమ నిర్మాణాలపై తగిన చర్యలు తీసుకోవాలని శేరిలింగంపల్లి జోనల్ కమీమిషనర్, సర్కిల్ అధికారులను వారు కోరుతున్నారు. లేకుంటే ప్రభుత్వంపై, అధికారులపై ప్రజలు విశ్వాసం కోల్పోతారన్నారు.

**చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌ను వివరణ కోరగా..** చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌ను వివరణ కోరగా చందానగర్ సర్కిల్ పరిధిలో నిర్మించే అక్రమ నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీ, సర్వే ఆఫ్ ఇండియాలలో నిర్మించే అక్రమ నిర్మాణాల కూల్చివేతలు చేపడతామని, ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టిన ఎంతటి వారైన అక్రమ నిర్మాణాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మేడ్చల్ జిల్లా ఆర్‌టిఎ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం తూంకుంట మున్సిపాలిటీ అంతాయిపల్లిలో ఇందిరమ్మ ఇండ్లకు భూమిపూజ చేసి ముగ్గు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇళ్లు లేని ప్రతి నిరుపేదలకు ఇళ్లు కట్టిస్తామని చెప్పారు. మేడ్చల్ నియోజకవర్గ పరిధిలో తూంకుంట మున్సిపల్‌లో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినందుకు ఇన్‌చార్జ్ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ధన్యవాదాలు తెలిపారు. పేదల కండ్లల్లో ఆనందం నింపడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యూత్ ప్రధాన కార్యదర్శి కత్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్‌లో పడకేసిన పారిశుద్ధ్యం



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని రైతుబజార్ , సిద్దార్థస్కూల్ .సెయింట్ జూడ్స్ హైస్కుల్ పరసర ప్రాంతలో పారిశుద్ధ్యం పూర్తిగా పడకేసింది. స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రు. దోమలతో డెంగ్యూ ,మలేరియా రోగాల భారిన పడుతున్నారన్నారు. రో జు చెత్త బండి వచ్చిన చెత్తను తొలగించడం లేదని కాలనీ ప్రజలు అవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడా చూసిన చెత్త పేరుకపోయి ,ప్లాస్టిక్ బాటిల్ కవర్లు వంటి చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయని తెలిపారు. పరిశుద్ధ్యంపై జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి సమస్యలను పరిష్కరిచాలని కోరుతున్నారు.

## ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవ శోభాయాత్ర



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఘనంగా హిందూ సామ్రాజ్య దినోత్సవ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్‌లో హిందూ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ శోభాయాత్రబిజెపి నాయకులు కంతేటి సుబ్బారావు పాల్గొని శివాజీ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం శోభాయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ హిందువులందరూ అరబ్, మొగల్ మతోన్మాద ఇస్లాం పాలకుల దారుణాలకు దిక్కుతోచని స్థితిలో ఉన్న సమయంలో ఆశా కిరణంగా జన్మించిన చత్రపతి శివాజీ మహరాజ్ హిందూ సామ్రాజ్య పట్టాభిషిక్తుడయ్యారని తెలిపారు. ఛత్రపతి శివాజీ దేశానికి చేసిన సేవలు, పోరాటాలను ఎన్నటికీ మరువరాదని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం సభ్యులు, బిజెపి నాయకులు ఎంఆర్‌ఎస్ రాజు, చక్రధర్, మధుజీ, లక్ష్మీ రామారావు, భిక్షపతి యాదవ్, శేషారావు, నరేంద్ర చౌదరి, శ్రీనివాస్ గుప్త, నాగరాజు, సుమన్ రావు, కిశోర్, వెంకటేశ్, కౌశిక్, లింగారెడ్డి, వినీత్, అశోక్, భారతి, శిల్ప పాల్గొన్నారు.

## మూడుచింతలపల్లి బిజెపి నూతన కార్యవర్గం ఎన్నిక



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మున్సిపల్ బిజెపి నూతన కార్యవర్గాన్ని మున్సిపల్ అధ్యక్షుడు తప్పెట్ల నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు, మున్సిపల్ ఇన్‌చార్జ్ గౌరారం జగన్‌గౌడ్ విచ్చేసి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 11 సంవత్సరాల సుపరిపాలన సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలను వివరించారు. అలాగే బిజెపి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా సింగం విజయలక్ష్మి, దొండ మహేష్, చింతల లక్ష్మి నారాయణ, రాంపల్లి పరమేష్, ప్రధాన కార్యదర్శి వంగ శ్రీకాంత్‌రెడ్డి, ఇలాసాగరం శ్రీశైలం, కార్యదర్శి సుంకు ఇందిర, బొలిశెట్టి హన్మంతు, పొట్టిగారి జగన్‌మోహన్‌రెడ్డి, లక్ష్మాపూర్ జహంగీర్, కోశాధికారిగా మరుమాముల కల్యాణిలను ఏకగ్రావంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు నరేందర్‌రెడ్డి, ఒబిసి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజుచారి, జిల్లా ఎస్‌టిమోర్చ అధ్యక్షులు సుధాకర్ నాయక్, యువమోర్చ నాయకులు సాయిబాబు, తదితరులు పాల్గొన్నారు.

## హిందూ స్మశాన వాటికలో అక్రమ డంపింగును ఎత్తివేయాలి




**ప్రజాపక్షం/అల్వాల్ :** మచ్చ బొల్లారం డివిజన్‌లోని హిందూ స్మశానవాటికలో అక్రమ డంపింగ్ యార్డ్ ఎత్తివేయాలని జరుగుతున్న ఉద్యమానికి మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్, మల్కాజిగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, కార్పొరేటర్ రాజ్ జితేందర్ నాథ్ లు మద్దతు తెలిపినప్పటికీ 50 కాలనీ వాసులు సుమారు 200 మంది నిరసన వ్యక్తం చేశారు. అధికారులు డంపింగ్ యార్డ్ ఎత్తివేయకపోగా దానిలో అక్రమంగా కట్టడాలు శరవేగంగా జరుగుతున్నాయని ఆదివారం డంపింగ్ యార్డ్ వద్ద ఆందోళన చేపట్టారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి తహసిల్దార్ రిపోర్ట్ ఇచ్చిన ప్రకారం హిందూ స్మశాన వాటిక స్మశాన వాటికలో అక్రమ డంపింగ్ అక్రమ నిర్మాణాలను అధికారులు ఆపాలని డిమాండ్ చేశారు. కాలనీలో ర్యాలీ, మానవహారం నిర్వహించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉదయ్ ప్రకాష్, సుధాకర్, పుష్ప, కర్ణ శ్రీ, అనురాధ, రమేష్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.


## పెద్దేముల్ నూతన ఎస్ఐగా ప్రశాంత్ వర్ధన్




**ప్రజాపక్షం/పెద్దేముల్ :** పెద్దేముల్ మండల నూతన ఎస్ఐగా ప్రశాంత్ వర్దన్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేసినా శ్రీదర్‌రెడ్డి బదిలిపై వెళ్ళడంతో గత కొంతకాలంగా ఇంచార్జీ ఎస్ఐలే కొనసాగించిన విషయం తెలిసిందే. అయితే జిల్లా లో టాస్క్ ఫోర్స్ విభాగంలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ప్రశాంత్ వర్ధన్‌ను పెద్దేముల్ ఎస్ఐగా నియమిస్తూ మేరకు జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి ఉత్తర్వులు జారి చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు నూతన ఎస్ఐగా ప్రశాంత్ వర్దన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు.

## ఎంఆర్‌పిఎస్ అవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా ఎమ్మర్పీఎస్ జిల్లా కర్యవర్గ సమావేశం అదివారం, వికారాబాద్ జిల్లా కేంద్రంలో ని అంబ్కేదర్ భవంలో నిర్వహించారు. తెలంగాణ రాష్ట కార్యాదర్శి గట్టగల్ల ప్రశాంత్ , జిల్లా అద్యక్షులు అనంద్ కలిసి పాల్గోన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎఆర్పీఎస్ పోరటంతోనే వికాలంగులకు , వృద్దులకు ,వితంవుల కోసం పోరడి పెన్షన్లు సాదించడం జరిగింది అని తెలిపారు. ఆరు కిలోల బియ్యం పెంపు మొదలగు సాధించడం జరిగింది అన్నారు. 31సంవత్సరలు పూర్తి చేసుకున్నా సందర్భంగా అవిర్భవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వామిదాస్ , కృష్ణ, ప్రకాశ్, సుభాష్ , మహేందర్ , రవికుమార్ , అన్నపూర్ణ , తదితరులు పాల్గోన్నారు.









ఆదివారం మృగశిర కార్తె సందర్భంగా చేపల కొనుగోళ్లతో కిటకిటలాడిన హైదరాబాద్‌లోని రాంనగర్ చేపల మార్కెట్

## బడుగు, బలహీన వర్గాలకు మంత్రి పదవులు ఇవ్వడం హర్షణీయం

### బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో సమగ్ర కులగనణ తర్వాత జనాభా దామాషా ప్రకారం ఎవరి వాటా వారికి దక్కాలని కాంగ్రెస్ అగ్రనాయకులు రాహుల్ గాంధీ సంకల్పం చాలా గొప్పదని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. అందులో భాగంగానే పార్టీ ప్రభుత్వం పదవుల్లో సామాజిక న్యాయం అమలు చేయడంలో భాగంగానే బడుగు, బలహీనవర్గాలకు మంత్రి పదవులు కేటాయించడం తాము స్వాగతిస్తున్నామని ఆయన ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల ఎమ్మెల్సీలుగా మొత్తం పదవులను బిసి, ఎస్‌సి, ఎస్‌టి,మహిళకు కేటాయించారని, అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ అత్యున్నత పదవుల్లో 66 మందికి గాను, అందులో 40 మంది బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు పదవులు కేటాయించారని, ఇప్పుడు 3 మంత్రి పదవులను కూడ ఈ వర్గాలకే కేటాయించడం హర్షనీయమని మన్నారు. కాంగ్రెస్ పార్టీలో సామాజిక న్యాయం అమలు కోసం కృషి చేస్తున్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ, జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, సిఎం ఎ. రేవంత్ రెడ్డి, పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా సామాజిక న్యాయం సంపూర్ణంగా అమలు చేయాలంటే ప్రభుత్వం నామినేటెడ్ పోస్టులలో, వివిధ పదవుల భర్తీలో, అన్ని నియమాకాలలో జనాభా దామాషా ప్రకారం కేటాయింపులు చేయాలని విజ్ఞప్తి చేశారు.



అక్కినేని నాగార్జున రెండో కొడుకు అక్కినేని అఖిల్ -జైనాబ్ పెళ్ళి రిసెప్షన్‌కు హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



## ఈ నెల 30వ తేదీ వరకు సన్న బియ్యం పంపిణీ

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** రేషన్ దుకాణాల్లో ఏక కాలంలో ఇస్తున్న మూడు నెలల సన్న బియ్యం కోటా ఈ నెల 30వ తేదీ వరకు పంపిణీ జరుగుతుందని మేడ్చల్ జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం సమయాల్లో జిల్లాలోని అన్ని రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేస్తూనే ఉంటారని, అన్ని దుకాణాల్లో సరిపడే విధంగా బియ్యం స్టాక్ ఉంటుందని, లబ్దిదారులు తమకు అనుకూలమైన సమయాల్లో తమకు సమీపంలో ఉన్న రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి తీసుకోవచ్చన్నారు. వర్షాకాలం నేపథ్యంలో ఈ నెల మొదటి తేదీ నుండి ఇస్తున్న సన్న బియ్యం రేషన్ కార్డులున్న వారికి మూడు నెలల పంపిణీ ప్రారంభించిన నేపథ్యంలో జిల్లాలోని రేషన్ దుకాణాల వద్ద తీవ్రమైన రద్దీ, వేలి ముద్రలు తీసుకోవటం, తూకం తదితర విషయాల కారణంగా లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్న విషయం విదితమే.

# బొబ్బఖాన్ చెరువు కబ్జాలకు శ్రీకారం





### ఇటీవలే హైడ్రా కమిషనర్ ఎవి. రంగనాథ్ స్వయంగా పరిశీలించినా చర్యలు తీసుకోని ఇరిగేషన్ అధికారులు

**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ గండి మైసమ్మ మండల పరిధిలో చెరువులు, కుంటలు, కట్టు కాలువలు, బఫర్, ఎఫ్‌టిఎల్ సైతం కబ్జాలకు గురిచేసి భారీషెడ్లు నిర్మిస్తున్న అధికారుల ధనదాహానికి అడ్డు అదుపు లేకుండా పోతుంది ఇరిగేషన్ అధికారుల పరివేక్షణ లోపంతో విలువైన భూములు పూర్తిగా కనుమరుగుతున్నాయి. బొబ్బఖాన్ బఫర్ ప్రాంతంలో భారీ షెడ్లు నిర్మిస్తున్న నిర్మాణదారుల వద్ద నుండి అందిన కాడికి దండుకొని నిర్మాణాలను వదిలేస్తున్నారని ఆరోపణలు మిన్నంటుతున్నాయి. బహదూర్ పల్లి బొబ్బఖాన్ లేక్ ఐడి 2856 విస్తీరణ 38.009 ఎకరాల కుంట ఎఫ్‌టిఎల్ బఫర్‌లలో దర్జాగా నిర్మాణాలు జరుగుతున్న పట్టించుకోవడం లేదనీ స్థానికులు, గ్రామస్తులు విమర్శిస్తున్నారు. చెరువులలో మట్టి పోస్తేనే చర్యలు చేపట్టి కేసులు బనాయిస్తామని ఏకంగా హైడ్రా కమిషనర్ ఏవి రంగనాథ్ ఇటీవలే తెలిపిన ఇరిగేషన్ అధికారులు ఆయన మాటలను పేడ చెవిన పెట్టి గాలికి వదిలేస్తున్నారు. భారీ షెడ్లు నిర్మిస్తున్న నిర్మాణదారుడుపై నేటికి శాఖా పరమైన చర్యలు తీసుకోలేదు చెరువు ప్రాంతాలలో నిర్మాణాలు చేపట్టకూడదని సుప్రీంకోర్టు మార్గదర్శకాలు జారీ చేసిన ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు క్రమక్రమంగా చెరువులను పూడుస్తూ అక్రమ దందాను కొనసాగిస్తున్నారు. ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్లలో పనులు జరుగుతున్న రెవెన్యూ ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు ఇటీవలే హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్రస్థాయిలో బొబ్బఖాన్ చెరువును పరిశీలించి ఎఫ్.టి.ఎల్ బఫర్ జోన్లలో నిర్మాణాలను పూర్తిగా తొలగించాలని తెలిపిన నేటికీ ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా నిర్మాణాలు జరగకుండా కబ్జాదారులపై చర్య లు తీసుకొని కుంటను రక్షించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

## ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ పట్టణంలో శ్రీ వివేకవాణి విద్యాలయంలో అధివారం పూర్వ విద్యార్థుల అత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. 1999–2000 సంవత్సరం బ్యాచ్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థులు చదవుకుని 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నా సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది అని అన్నారు. ఈ సందర్భంగా మ్యాథ్ ప్రిన్సిపల్ నాగయ్య మాట్లాడుతూ విద్యార్థులు తాము చెప్పిన పాతలు విధగా విని నేడు ఉన్నత స్థాయిలో స్థిరపడటం సంతోషంగా ఉంది అని అన్నారు. సమాజహితం కోసం అందరూ పాటుపడాలన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖారలను చేరుకోవాలని అన్నారు. అనంతరం పలువురు పూర్వవిద్యార్థులు మాట్లాడుతూ నాడు మా ఉపాధ్యాయులు చెప్పె పాఠాలు క్రమశిక్షణతోనే నేడు అన్నివిధాలా రాణిస్తున్నామన్నారు. పాఠశాల అభివృద్ధికి తామంతా పాటుపడుతున్నామన్నారు. అనంతరం పాఠశాలలో భోధించిన ఉపాధ్యాయులను పూలమాలలు శాలువలు కప్పి జ్ఞాపకలు అందించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల స్థాయి విషయలను గుర్తు చేసుకోని అనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు , వెంకటేశం సల్మాన్‌రాజ్ , నర్సమ్మ, మాణెమ్మ ,అనుసూయ, పూర్వ విద్యార్థులు సమావేశనికి ఏర్పాటు చేసిన విద్యార్థులు తదితరులు పాల్గోన్నారు

## నేడు దళిత ప్రజా సంఘాల ఆధ్వరంలో ధర్నా


**ప్రజాపక్షం/తాండూరు :** దళిత యువకుడి పెండ్లి బరాత్‌ని అడ్డుకొని కులం పేరుతో దూషించిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యాన సోమవారం తాండూరు డిఎస్‌పి కార్యాలయం ముందు ధర్నా చేపడుతున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పెండ్లి బరాత్‌లో దళితులపై దాడి చేసిన వారని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేసిన స్పందన లేక పోవడంతో దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యన తాండూరు డిఎస్‌పి కార్యాలయం ముందు ధర్నాకు పిలుపు నిచ్చారు. ఈ నెల 9న ఉదయం 10గంటలకు తాండూరు బస్టాండ్ సమీపంలో అంబేద్కర్ విగ్రహం నుండి దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యాన ర్యాలీగా వెళ్ళి తాండూరు డిఎస్‌పి కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఘటన జరిగి పదిహేను రోజులు జరుగుతున్న నేటికి గ్రామాన్ని సబ్‌కలెక్టర్ సందర్శించక పోవడం, అధికారుల తీరుపై పలు అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లా ఎస్‌పి, జిల్లా కలెక్టర్ గ్రామాన్ని వెంటనే సందర్శించి జరిగిన ఘటనపై విచారణ చేపట్టాలని, బాధితులను పరామర్శించక పోవడం విడ్డురమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.శ్రీనివాస్, ఎస్‌సి, ఎం ఆర్‌పిఎస్, ఎస్‌టి మైనార్టీ హక్కుల పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు కొత్తూర్ చంద్రయ్య, కేవిపిఎస్ జిల్లా నాయకులు సురేష్, ప్రజా సంఘాల నాయకులు నవీన్, అశోక్, ప్రవీణ్, నవీన్‌కుమార్ మధు, బిచ్చప్ప మహేష్ తదితరులు ఉన్నారు.



# ఎరువుల కొరత... అందోళనలో రైతులు

### ఫర్టిలైజర్ దుకాణాల చుట్టు రైతుల ప్రదక్షిణలు
### ప్రభుత్వానికి నివేదించాం
### వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సాగుకు అవసరమైన ఎరువులు కొరత ఉండటంతో రైతులు ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. జిల్లాలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం 5,61719 ఎకరాలు , అవసరమైన ఎరువులు 1.13851 మెట్రిక్ టన్నుల కవాల్సి ఉన్న ప్రస్తుతం అందుబాటులో ఉన్నది 14.429మెట్రిక్ టన్నుల అవసరమైన విత్తనాలు 41,2297 క్వీటాళ్లు ,ప్రస్తుతం సాగు విస్తర్ణం మొత్తం 5.61లక్షల ఎకరాల విస్తీర్ణంలో అయా పంటలు సాగు చేయవచ్చుని వ్యవసాయ అధికారులు అంచనవేశారు. గతేడాది 2.57లక్షల పత్తిసాగు చేయగా ఈ సారి 2.58లక్షల ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉందిన తెలుస్తుంది. వరి 1,31,075 ఎకరాల్లో కందులు 1.10లక్షల ఎకరాల్లో ,మొక్కజోన్న 26.908 ఎకరాల్లో సాగు చేయవచ్చని తెలుస్తుంది. పెసలు 14.568 ఎకరాలు ,మినుములు 5,716 ఎకరాల్లో , జోన్నలు 2,575 ఎకరాల్లో సోయబిన్ 2.043 ఎకరాల్లో ఇతర పంటలు 7275 ఎకరాల్లో సాగువుతాయని అంచనా వేశారు. ప్రస్తుతం వరి , మొక్కజోన్న ,జిలుగ , జనుము, సోయబీన్ , కంది, విత్తనాలు అందుబాటులో ఉంచరు. పత్తి విత్తనలు అవసరం మెరకే అందుబాటులో ఉంచాలని అధికారులు ఫర్టీలైజ్ దుకణలకు సూచించమని అధికారులు తెలిపారు. అవసరం మేరకు ప త్తి విత్తనాలు 5,16,426 విత్తన ప్యాకెట్లు అవసరమని అంచనా వేశారు. పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయని అధికారుల తెలిపారు. ఈ సారి వర్షలు ముందుగానే పడుతున్న నేపథ్యం లో రైతులు కూడా విత్తుకు సిద్దమవుతున్నారు. ఇప్పటికు ఎరువులు ,విత్తనాల కొనుగోలుపై దృష్టి సారించారు. ప్రస్తుత సీజన్‌కు అవరమైన ఎరువు ల్లో 15శాతం కూడా అందుబాటులో లేని పరిస్థితి ఉంది . ప్రస్తుతం దుక్కి ఎరవుగా వాడాల్సిన డీఎపి కొరత తీవ్రంగా ఉంది దీంతో అన్నదతలు అందోళన చెందుతున్నారు. వికారాబాద్ జిల్లాలో ఎరవుల అవసరం కొండంత ఉంటే ఉన్నది మాత్రం గోరంత సాగుకు సరిపడా విత్తనాలు ఉండటం ,రైతులకు కొంత మేర ఉపశమనం కలిగిస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో 5,61,719 ఎకరాల్లో వివిధ రకా ల పంటలు సాగుఅంచనవేశారు. అధికారులు ప్రభుత్వనికి 1,13,851 మెట్రిక్ టన్నుల ఎరవులు అవసరమైన తెలిపారు. ప్రస్తుతం సీజన్‌కు 39,898మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా కేవలం 8,088 మెట్రిక్ టన్నుల మాత్ర మే అందుబాటులో ఉంది డిఎపి 27,516 మెట్రీక్ టన్నులు అవసరం కాగా ,2,408 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది. ఎంఓపీ 8,585 మెట్రిక్ టన్నులు అవసరం కాగా 179 మెట్రిక్ టన్నులే ఉంది. కాంప్లెక్స్ ఎరువులు 36,305 మెట్రిక్ టన్నులు అవసరం ఉండాగా 3,547 మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా ఎస్ఎస్‌పి ఎరవులు అవపరం ఉండగా 290 మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులో ఉంది . ప్రస్తుత సీజన్‌కు ఏ మేరకు విత్తనాలు ,ఎరవులు అవసరమైన అంచనాలు తయారు చేసి ప్రభుత్వనికి పంపాంసాగుకు సరిపాడ విత్తనాలను అందుబాటులో ఉంచాం డిఏపి కొంత మేర కొరత ఉంది ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం త్వరలో వచ్చే అవకాశం ఉంది నకిలీ విత్తానాల విషయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలి అని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రెడ్డి తెలిపారు.



ఫోకస్

ఆరోగ్యం

# ప్రభావవంతమైన కొవిడ్ వ్యాక్సిన్

అంతర్జాతీయ నివేదికలను అనుసరించి, కొత్త mRNA కొవిడ్ వ్యాక్సిన్‌లో ల్యాబ్‌లో తయారు చేసిన మెసెంజర్ ఆర్ఎన్ఎ (mRNA) ఉంటుంది. దీనిని ముక్కు లేదా పై చేయి కండరాల్లోకి ఇంజెక్ట్ చేస్తారు. ఈ mRNA మన కణాల్లోకి వెళ్లి, కరోనా వైరస్‌పై ఉండే స్పైక్ ప్రోటీన్‌ను తయారుచేయమని సూచన ఇస్తుంది. మన శరీర రోగనిరోధక వ్యవస్థ ఆ స్పైక్ ప్రోటీన్‌ను గుర్తించి, దానిపై యాంటీబాడీలు తయారుచేస్తుంది. తద్వారా భవిష్యత్తులో వైరస్ దాడి చేస్తే శరీరం వెంటనే స్పందించగలుగుతుంది. mRNA వ్యాక్సిన్‌లో అసలు వైరస్ ఉండదు, కాబట్టి వ్యాధి వచ్చే ప్రమాదం లేదు. తయారీ వేగంగా, సులభంగా చేయవచ్చు. కొత్త వేరియంట్లకు త్వరగా మార్పులు చేయొచ్చు. రోగనిరోధక ప్రతిస్పందన బలంగా ఉంటుంది. మన RNAను ప్రభావితం చేయదు; కేవలం కణంలోనే పనిచేసి, కొన్ని రోజుల్లోనే mRNA కణం నుంచి బయటపడుతుంది. క్లినికల్ ట్రయల్స్, వాస్తవ ప్రపంచంలోనూ మంచి ఫలితాలు, భద్రత చూపించాయి.భవిష్యత్తు దిశ:కొత్త వేరియంట్లకు అనుగుణంగా mRNA వ్యాక్సిన్లు త్వరగా అభివృద్ధి చేయడం జరుగుతోంది.ఇతర వ్యాధులకు, క్యాన్సర్ వంటి చికిత్సలకు కూడా ఈ టెక్నాలజీ ఉపయోగించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.ఈ విధంగా, కొత్త mRNA కొవిడ్ వ్యాక్సిన్‌లు వేగంగా తయారయ్యే, ప్రభావవంతమైన, సురక్షితమైన టీకాలుగా నిలుస్తున్నాయి.కొత్త mRNA కొవిడ్ వ్యాక్సిన్, గతంలో అభివృద్ధి చేసిన టీకాలతో పోలిస్తే, కొన్ని కీలకమైన విధుల్లో భిన్నంగా ఉంటుంది. mRNA



వ్యాక్సిన్లు వైరస్‌ను నేరుగా లేదా దాని భాగాలను ఉపయోగించకుండా, వైరస్ స్పైక్ ప్రోటీన్‌కు సంబంధించిన జెనెటిక్ సమాచారాన్ని (mRNA) మాత్రమే మన శరీరంలోకి పంపిస్తాయి. ఇది మన కణాలు ఆ ప్రోటీన్‌ను తాత్కాలికంగా తయారు చేయడాన్ని ప్రేరేపిస్తుంది. గతంలో అభివృద్ధి చేసిన టీకాలు వైరస్‌ను అణచివేసిన రూపంలో లేదా వైరస్ భాగాలను నేరుగా శరీరంలోకి ఇంజెక్ట్ చేయడం ద్వారా రోగనిరోధక ప్రతిస్పందనను ప్రేరేపించేవి. mRNA టీకాలు తయారీ ప్రక్రియ వేగంగా ఉంటుంది. కొత్త వేరియంట్లు వచ్చినప్పుడు వాటికి తగిన మార్పులు తక్కువ సమయంలో చేయొచ్చు. ఈ టీకాలు శరీరంలో డిఎన్ఎను ప్రభావితం చేయకుండా, తాత్కాలికంగా మాత్రమే పనిచేస్తాయి. భద్రతా పరంగా కూడా mRNA టీకాలు మెరుగైన ఫలితాలు చూపించాయి. మొత్తం మీద కొత్త mRNA వ్యాక్సిన్‌లు సురక్షితంగా, వేగంగా తయారు చేయదగినవిగా, కొత్త వేరియంట్లకు తగిన మార్పులు త్వరగా చేయదగినవిగా, గత టీకాల కం ఆధునికంగా ఉన్నాయి. కొత్త mRNA కొవిడ్ టీకా దీర్ఘకాలిక రక్షణ కోసం అవసరమైన ప్రత్యేక లక్షణాలు కలిగి ఉంది. ఈ టీకా శరీరంలో రోగనిరోధక వ్యవస్థను బలపరిచేలా స్పైక్ ప్రోటీన్‌ను తాత్కాలికంగా తయారు చేయమని సూచిస్తుంది. తద్వారా శరీరం వైరస్‌ను గుర్తించి, దీర్ఘకాలికంగా యాంటీబాడీలు ఉత్పత్తి చేస్తుంది. mRNA టీకా తయారీ విధానం వల్ల కొత్త వేరియంట్లు వచ్చినప్పుడు త్వరగా మార్పులు చేయడం సాధ్యమవుతుంది. కాబట్టి, భవిష్యత్‌లో వచ్చే కొత్త వైరస్‌ల నుంచి కూడా రక్షణ పొందే అవకాశం ఉంది. సాధారణంగా, ఒక మోతాదు టీకా ఆరు నెలలకు పైగా రక్షణను ఇస్తుంది. ప్రభావం తగ్గినప్పుడు బూస్టర్ డోస్ తీసుకోవడం ద్వారా రోగనిరోధకతను కొనసాగించవచ్చు. ఈ టీకా శరీరంలో డిఎన్ఎను ప్రభావితం చేయదు. తాత్కాలికంగా మాత్రమే పనిచేస్తుంది. భద్రత పరంగా కూడా మంచి ఫలితాలు చూపిస్తుంది. ఈ లక్షణాల వల్ల, కొత్త mRNA టీకా దీర్ఘకాలిక రక్షణలో ఆధునిక, సురక్షితమైన ఎంపికగా నిలుస్తోంది.

## క్రోమోజోమ్స్ లోపంతో ప్రమాదకర డౌన్ సిండ్రోమ్



క్రోమోజోమ్స్‌లో లోపం వల్ల కలిగే శారీరక మానసిక క్షీణతకు చెందిన వ్యాధిగా డౌన్ సిండ్రోమ్‌ను పిలుస్తున్నాం. బ్రిటీష్ వైద్యుడు జాన్ లాంగ్డన్ డౌన్ కృషి ఫలితంగా వివరించబడిన ఈ ప్రత్యేక వ్యాధికి డౌన్ జ్ఞాపకార్థం డౌన్ సింద్రోమ్‌గా నామకరణం చేశారు. డౌన్ సిండ్రోమ్ వ్యాధిగ్రస్తుల్లో క్రోమోజోమ్స్ 21లో రెండేసి పోగులు ఉండడానికి బదులు అసాధారణంగా మూడు ఉండడం వల్ల దీనిని 'ట్రైసోమీ'గా పిలుస్తారు. ఇలాంటి వారిలో సాధారణంగా ఐక్యూ 100కి బదులుగా వీరిలో 50 వరకు మాత్రమే ఉంటూ శారీరక మానసిక అభివృద్ధి కుంటుపడుతుంది. ఈ వ్యాధిని తల్లి గర్భంలోనే గుర్తించే టెక్నాలజీ ఉండడంతో నేటి వైద్యులు అబార్షన్‌ను కూడా సూచించడం చూస్తున్నాం. డౌన్ సిండ్రోమ్‌తో బాధపడుతున్న వయోజనులు కూడా 10 ఏండ్ల లోపు పిల్లల వలె ప్రవర్తించడం గమనించవచ్చు. డౌన్ సిండ్రోమ్ వ్యాధిగ్రస్తుల్లో మానసిక క్షీణత, శారీరక పెరుగుదల తగ్గడం, చిన్న చేతులు/గడ్డం/మెడ/చెవులు, మాట తడబడడం, పెద్ద నాలుగ, అసాధారణ చెవులు, మెడ వెనుక చర్మం పెరుగుదల, కండరాల బలహీనత, పుట్టుకతో గుండె జబ్బులు లాంటి లక్షణాలు కనిపుస్తాయి. కొంత మందిలో గుండె జబ్బులు, క్యాన్సర్, ఎండోక్రైన్, దంత లోపాలు కనిపిస్తూ, సంతానోత్పత్తి కూడా మందగిస్తుంది. ఈ వ్యాధి నిర్ధారణకు క్రోమోజోమ్స్ విశ్లేషణ, ఎక్స్ రే, రక్త పరీక్షలు, క్వాడ్ స్క్రీన్, అల్ట్రా సౌండ్, డిఎన్ఎ పరీక్షలు చేస్తారు. బాల్యం నుంచి సక్రమ కుటుంబ వాతావరణం, వైద్య చికిత్సలు, ఆరోగ్య పరీక్షలు, కొన్ని పనుల్లో శిక్షణలు ఇవ్వడం వల్ల వ్యాధిగ్రస్తుల్లో కొంత శారీరక మానసిక అభివృద్ధి మెరుగుపడవచ్చు. పిల్లలకు విద్యను అందించడంతో పాటు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవడంతో రోగుల్లో సమస్యలు కొంత వరకు తగ్గుతాయని తెలుసుకోవాలి. జన్మతః సంక్రమించే ఈ వ్యాధిగ్రస్తులను తల్లి గర్భంలోనే గుర్తిస్తూ సరైన వైద్యం లేదా అబార్షన్ పరిష్కారం చూపవచ్చు. డౌన్ సిండ్రోమ్ ఉచ్చులో చిక్కిన అన్ని వర్గాల అభాగ్య రోగులకు సమాన హక్కులు, వైద్య ఆరోగ్య సహాయాలు, విద్య, గౌరవ మర్యాదలు కల్పించే విధంగా పౌర సమాజం మేల్కొనాలి. ప్రతి వెయ్యి మంది శిశువుల్లో ఒకరు ఇలాంటి సమస్యలతో జన్మిస్తున్న కారణంగా పుట్టక ముందే గుర్తించే ప్రయత్నాలు చేస్తే చక్కటి పరిష్కారాలు చూపవచ్చని తెలుసుకుందాం, ఈ రోగుల పట్ల గౌరవ మర్యాదలు ప్రదర్శిద్దాం.

## జీవకణాల్లో బైనరీకోడ్

ఈ కాలంలో కంప్యూటర్ల శక్తి విపరీతంగా పెరిగింది. 2+4+=6 లాంటి చిన్న లెక్కలను కంప్యూటర్లు ఒక సెకండులో మిలియన్ పైగా చెయ్యగలవు. మార్పులు జరుగుతున్నప్పుడు ఆ మార్పులను ఒక ఖచ్చితమైన పద్ధతిలో గుర్తించగల ఏ పదార్థంతోనైనా కంప్యూటర్ల నిర్మించవచ్చు.ఎలక్ట్రానిక్ కంప్యూటర్లు రాకముందు గడియారాలలో ఉండే పళ్ళచక్రాలలాంటి వాటిని వుపయోగించి కూడిక, తీసివేత, గుణకారం, భాగహారం లెక్కలను చేయగల యంత్రాలను శాస్త్రజ్ఞులు తయారుచేశారు. మొదట ఎలక్ట్రానిక్ కంప్యూటర్లలో గాజుగొట్టాలలో నింపిన పాదరసం ఉపయోగించటం ద్వారా కంప్యూటర్ల మెమొరీ భాగాన్ని చేసేవారు. ఒక ట్యాప్ కల్గిన నీళ్ళడ్రమ్, కొలత గ్లాసు వాడి నీళ్ల కంప్యూటర్ చేయవచ్చు. ఉదాహరణకు డ్రమ్ లో 4 గ్లాసులు 5 గ్లాసులు, 8 గ్లాసులు, నీళ్ళుపోసి తర్వాత 10 గ్లాసులు, 2 గ్లాసులు నీళ్ళు తీసివేసి డ్రమ్ లోని మిగిలిన నీళ్ళను గ్లాసుతో కొలిస్తే 5 గ్లాసులు నీళ్ళు వుంటాయి. అంటే మనం 0+4+5 +810 2=5 అనే లెక్క కంప్యూటర్ అర్థమేటిక్ అండ్ లాజిక్ యూనిట్ (ఎఎల్‌యు)లో ఎక్యుములేటర్ ఉండే పద్ధతిలో చేసినట్లు చెప్పవచ్చు.




## ముందు జాగ్రత్తలే బ్రెయిన్ ట్యూమర్‌కు ఉత్తమ ఔషధాలు!

ప్రపంచవ్యాప్తంగా 08 జూన్ రోజున ప్రపంచ మెదడు కణితి దినం (వరల్ బ్రెయిన్ ట్యూమర్ డే) పాటించుట 2000 సంవత్సరం నుంచి ప్రారంభమైంది. మెదడు కణితి లేదా బ్రెయిన్ ట్యూమర్ లేదా లంప్స్ లేదా గడ్డల గూర్చి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వ్యాధిగ్రస్థులకు భరోసా ఇవ్వడం నిరంతరం కొనసాగాలి. 2019 అంచనాల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 3.40 లక్షల మెదడు కణితి రోగులు, 2.27 లక్షల బ్రెయిన్ ట్యూమర్ కారం మరణాలు నమోదు అయ్యాయి. భారత్‌లో సాలీనా దాదాపు 28,000 కేసులు, 24,000 మరణాలు జరుగుతున్నాయి. భారత్‌లో 2 శాతం వరకు మెదడు కణితి సమస్యలు వస్తున్నట్లు అంచనా వేస్తున్నారు. కేంద్ర నాడీ మండల సమస్యగా గుర్తించబడిన బ్రెయిన్ ట్యూమర్ సమస్యలు రాకుండా జాగ్రత్త పడడంలో తరుచుగా పరీక్షలు చేయించుకోవడం ఉత్తమమైన మార్గమని గమనించాలి.

**బ్రెయిన్ ట్యూమర్‌కు ప్రధాన కారణాలు:**

మెదడులోని ఏదో ఒక భాగంలో అసాధారణంగా కణజాలం పెరగడంతో కణితులు లేదా ట్యూమర్స్



ఏర్పడి తీవ్ర సమస్యగా ఉత్పన్నం అవుతుంది. మెదడు కణితి సమస్యలకు స్పష్టమైన కారణాలు ఏమీ ఊహించలేము. అనువంశిక, రేడియో (ఎక్స్ కిరణాలు) కిరణాలు సోకడం, పురుగు మందులకు గురి కావడం, ప్రమాదకర రసాయనాల సమీపాన పని చేయడం లాంటి కారణాల వల్ల మెదడు కణితి సమస్యలు రావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అన్ని వయస్సుల వారికి మెదడు కణితి సమస్యలు రావచ్చని, 10 ఏండ్ల లోపు పిల్లలు, 50 ఏండ్లకు పైబడిన వయోజనులకు ఈ సమస్య ఎక్కువగా రావచ్చు మెదడు కణితి సమస్య వల్ల 9 12 మాసాల్లో మరణం సంభవించవచ్చని, కొద్ది రోగులు మాత్రమే 3 ఏండ్ల వరకు బతకవచ్చని తేలింది.

**మెదడు కణితి రోగ లక్షణాలు – చికిత్సా మార్గాలు :**

బ్రెయిన్ ట్యూమర్ వ్యాధి లక్షణాల్లో తీవ్రమైన తలనొప్పి, వణకడం, వాంతులు, జ్ఞాపకశక్తి సమస్యలు, నీరసం, మూర్ఛలు, నిలబడలేక పోవడం, నడకలో ఇబ్బందులు, మాటలో తత్తరపాటు, మింగడంలో సమస్యలు, దృష్టి సమస్యలు లాంటివి కనిపిస్తాయి. మెదడు కణితి గుర్తించడంలో ఎంఆర్ఐ, సిటి స్కాన్, సెరిబ్రల్ ఆంజియోగ్రామ్‌లను వాడతారు. కణితుల పరిమాణం, గ్రేడ్, దశ, లొకేషన్, స్వభావాలను బట్టి వైద్యం అందిస్తారు. రేడియోషన్, కీమోథెరపీ, ఇమ్యూనోథెరపీ, స్టీరాయిడ్స్ వాడకం, మెదడులోని అదనపు ద్రవాలను తొలగించడం లాంటి చికిత్సలు చేస్తారు. శస్త్రచికిత్స ద్వారా కణితిని తొలగించే అవకాశం కూడా ఉంటుంది.
కణితులు ముదిరితే జీవితకాలాన్ని కొంత వరకు పెంచవచ్చని, పూర్తి చికిత్సకు అవకాశం లేదని తెలుసుకోవాలి. మనసుకు, దేహానికి వారధిగా పని చేస్తున్న మెదడును తరుచుగా పరీక్షలు చేయించుకుంటూ చురుకైన, సరళమైన, మంచి అలవాట్లు కలిగిన జీవన విధానాన్ని అలవర్చుకుందాం, ఆరోగ్యంగా కొనసాగుదాం.

ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి

# ఉపాధిహామీ పథకాన్ని ఎత్తివేసే కుట్ర

బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు వెంకటరాములు



**ప్రజాపక్షం/తొర్రూరు :**కేంద్రప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని ఎత్తివేసే కుట్రలను మానుకోవాలని బికెఎంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు టి.వెంకటరాములు, రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య డిమాండ్ చేశారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని అమరజీవి గుండా వెంకటరాములు ప్రాంగణంలో(లయన్స్ క్లబ్)లో మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం మూడవ మహాసభలు కె.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. సభకు వెంకటరాములు, కలకొండ కాంతయ్యలు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తుందని, అందులో భాగంగా వ్యవసాయ కార్పొరేటీకరణకు రైతు వ్యతిరేక నల్ల చట్టాలను దొడ్డిదారిన అమలు చేయుటకు మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఢిల్లీ తరహా రైతు ఉద్యమాలు నిర్వహించినప్పుడే మోదీ ఫాసిస్టు విధానాలను రైతాంగం తిప్పి కొట్టగలదన్నారు. రైతు పండించిన అన్నిరకాల పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం కనీస మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడంలో విఫలమయ్యాయన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, బోనస్ కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. మున్సిపాలిటీల్లో, నగర పాలక సంస్థల్లో గ్రామీణ ఉపాధి హామీ పనులు కల్పించాలనిచ ఉపాధి కూలీలకు సంవత్సరానికి 200రోజులు పనిదినాలు కల్పించాలని, రోజు కూలీ రూ.600 లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాల కోసం వ్యవసాయ కార్మిక సంఘం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. పేదలకు ఇండ్ల స్థలాల కోసం, సాగు భూముల కోసం ఉద్యమించాలన్నారు. యాభై ఏండ్లు నిండిన వ్యవసాయ, ఉపాధి కూలీలకు నెలకు రూ.6వేలు పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరణించిన ఉపాధి కార్మికుడికి రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక నాలుగు నల్ల చట్టాలను రద్దు చేయాలన్నారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బి.అజయ్‌సారధిరెడ్డి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘాన్ని బలోపేతం చేసి కార్మికుల హక్కుల కోసం ఉద్యమించాలన్నారు. సభలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు తమ్మెర విశ్వేశ్వర్‌రావు, బికెఎంయూ జిల్లా కార్యవర్గ సభ్యులు పెరుగు కుమార్, వరిపెల్లి వెంకన్న, ఓమ బిక్షపతి, మండల కార్యదర్శి బందు మహేందర్, పేరబోయిన కిరణ్, గణపురం లక్ష్మణ్, ఎల్లయ్య, జంపాల వెంకన్న, కొమ్ము నారాయణ, రవీందర్, వద్రె వెంకన్న, తండా సందీప్ తదితరులు పాల్గొన్నారు.

**బికెఎంయు జిల్లా నూతన కమిటీ**

సభలో బికెఎంయు జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కట్టెబోయిన శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా చింతకుంట్ల వెంకన్న,వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గణపురం లక్ష్మణ్, జిల్లా ఉపాధ్యక్షులుగా జలగం శ్రీనివాస్, గురుస్వామి, రవీందర్, లచ్చునాయక్, జిల్లా సహాయ కార్యదర్శులుగా కొమ్ము నారాయణ, బస్వ కొమురయ్య, గంగరబోయిన రాజు, వద్రె వెంకన్న, కోశాధికారిగా ధరావత్ వీరన్నలను ఎన్నుకున్నారు.

# సోషలిస్టు వ్యవస్థ నిర్మాణమే కమ్యూనిస్టుల లక్ష్యం

సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రే భిక్షపతి



**ప్రజాపక్షం/హనుమకొండ :** సోషలిస్టు వ్యవస్థ నిర్మాణమే కమ్యూనిస్టుల లక్ష్యమని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రే బిక్షపతి అన్నారు. ఆదివారం బాలసముద్రంలో సిపిఐ జిల్లా కార్యాలయంలో సిపిఐ హనుమకొండ మండల 2వ మహాసభ మండల కార్యదర్శి యేశబోయిన శ్రీనివాస్ అధ్యక్షతన జరగగా సమావేశానికి ముఖ్యఅతిథిగా బిక్షపతి హాజరై మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం విభజన రాజకీయాలు చేస్తున్నదని, ప్రజా వ్యతిరేక చట్టాలు, కార్మిక వ్యతిరేక చట్టాలు, ముస్లిం మైనార్టీ వ్యతిరేక చట్టాలను తీసుకొస్తూ ముస్లింలు, రైతులు, దళితులపై దాడులు కొనసాగిస్తుందన్నారు. ఇలాంటి పరిణామాలను ప్రజాస్వామికవాదులు తిప్పి కొట్టాలన్నారు. మహాసభలో సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి సిరబోయిన కరుణాకర్, రాష్ట్ర సమితి సభ్యులు అదరి శ్రీనివాస్, ఎన్ఎ స్టాలిన్, జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కొట్టేపాక రవి, కండె నర్సయ్య, యాళ్ళ సంజయ్, వినయ్, లక్ష్మి, రజిత, దేవి తదితరులు పాల్గొన్నారు.

**హనుమకొండ దక్షిణ మండల సమితి ఎన్నిక**

సిపిఐ హనుమకొండ మండల సమితిని హనుమకొండ ఉత్తర, దక్షిణ మండల సమితి రెండుగా వేరుచేసి నూతనంగా హనుమకొండ దక్షిణ మండల సమితి 25 మంది సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిపిఐ హనుమకొండ దక్షిణ మండల సమితి కార్యదర్శిగా యేశబోయిన శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా కండె నర్సయ్య, యాళ్ళ సంజయ్‌లతో పాటు 25 మంది కౌన్సిల్ సభ్యులతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# పల్లెప్రజల జీవన ప్రమాణాల మార్పునకు నాంది పలికింది ఎర్రజెండానే

సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా



**ప్రజాపక్షం/లక్ష్మీదేవిపల్లి :** దోపిడీ, అణచివేతకు గురవుతూ దుర్భర జీవితం గడుపుతున్న ఏజెన్సీ పల్లె ప్రజల జీవన ప్రమాణాల మార్పునకు నాంది పలికి ఆధునికత వైపు నడిపించింది ఎర్ర జెండానేనని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా అన్నారు. ఆదివారం లక్ష్మీదేవిపల్లి మండలపరిధిలోని మైలారం, బంగారుచెలక, చింతకుంట, పూనుకుడుచెలక, లక్ష్మీపురం, బొజ్జలగూడెం గ్రామపంచాయతీల పరిధిలోని 31 గ్రామశాఖల సిపిఐ సంయుక్త మహాసభ తిప్పగుట్ట గ్రామంలో జరిగింది. మహాసభ సందర్భంగా గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. పార్టీ జెండాను ఎగురవేసిన మహాసభను సాబీర్‌పాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసమానతలు లేని సమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల అంతిమ లక్ష్యమని, అన్యాయం, దోపిడీ, అణచివేతలున్నంతకాలం ఎర్రజెండా ఉంటుందన్నారు. పేదల పక్షాన నిలబడి అనేక భూపోరాటాలకు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించి వేలాది ఎకరాలను పేదలకు పంచి దని, ప్రజలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు కృషిచేసిందని, ఆ పోరాటాల ఫలితంగానే గ్రామీణ జనం కమ్యూనిస్టు పార్టీకి బలమయ్యారన్నారు. ప్రజలను చైతన్యవంతం చేసి ప్రశ్నించే, ఎదురించే, పోరాడే తత్వాన్ని నేర్పిందని పేర్కొన్నారు. కమ్యూనిస్టులు లేకుండా చేయాలని కుట్రలు చేసిన వారిని ఇండ్లకే పరిమితం చేసిన పోరాట పటిమ ఈ ప్రాంత ప్రజలదన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను, కమ్యూనిస్టులను లేకుండా చేయాలని కేంద్రంలోని మోదీ, అమిత్‌షా ద్వయం కలలు కంటున్నారని, ఎర్ర జెండాను, కమ్యూనిజాన్ని ప్రజల నుంచి దూరం చేయలేరన్నారు. అనంతరం 31 గ్రామాల నూతన కమిటీలను ఎన్నుకున్నారు. సభలో సిపిఐ మండల కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు దీటి లక్ష్మీపతి, నాయకులు నూనావత్ గోవిందు, కంటెం సత్యనారాయణ, దారా శ్రీనివాసరావు, జోగా రామయ్య, సపావట్ రవి, బానోత్ నెహ్రూ, జర్పుల ఉపేందర్, పరిపర్తి రాజు, జోగా రాజబాబు, కోడి లింగయ్య, జలీల్ పాషా, శర్వన్, జనార్ధన్, లాలూ, లక్ష్మీనారాయణ, వరుస రామస్వామి, ముత్తయ్య, మోహన్, శంకర్, గోపాల్, జానయ్య, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# 'ఆపరేషన్ కగార్' నిలిపివేసి మావోయిస్టులతో చర్చలు జరపాలి

సిద్దిపేటలో వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన




**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** కేంద్రం మోదీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట సాగిస్తున్న నరమేధాన్ని వెంటనే నిలుపదల చేసి, కాల్పుల విరమణ ప్రకటించాలని, తక్షణమే మావోయిస్టు పార్టీతో శాంతియుత చర్చలు జరుపాలని వామపక్ష పార్టీ నేతలు డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ సర్కిల్ వద్ద సిపిఐ, సిపిఎం, ఇతర వామపక్ష, ప్రజాసంఘాలు, దళిత ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈసందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, సిపి(ఐ)ఎం జిల్లాకార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, ప్రజా ఫ్రంట్ జిల్లా అధ్యక్షులు సత్తయ్య. సిఎలెసి నాయకులు శ్రీనివాస్, దళిత సంఘాల నేత బీమసేనాలు మాట్లాడుతూ 18 నెలలుగా మధ్యభారత అడవుల్లో బిజెపి ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరిట ఎన్‌కౌంటర్‌లను కొనసాగిస్తుందన్నారు. అడవినుంచి ఆదివాసీలను ఖాళీ చేయించి, అడవి సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ చేపట్టిందని, ఒక వైపు ఆదివాసీలను మావోయిస్టు నాయకులను ఎన్‌కౌంటర్ చేస్తున్న కేంద్రప్రభుత్వం మరోవైపు చత్తీస్‌గడ్, మహారాష్ట్ర, జార్ఖాండ్‌లాంటి రాష్ట్రాల్లో ఆటవీ సంపదను, ఖనిజాలను, కార్పొరేట్ శక్తులను కట్టబెడుతుందని విమర్శించారు. నంబాళ్ల కేశవరావు ఎన్‌కౌంటర్ జరిగి మరునాడు వెయ్యి హెక్టార్ల ఆటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు మైనింగ్ కోసం కేటాయించారని. లక్ష 23వేల చెట్లను కొట్టివేయటానికి వారికి అనుమతులు ఇచ్చారని విమర్శించారు. పొరుగు దేశమైన పాకిస్తాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకున్న ప్రభుత్వం 50 ఏళ్ల నుండి దేశంలో అంతరాలు లేని సమాజం కోసం ఆదివాసీల పక్షాన పోరాడుతున్న మావోయిస్టు పార్టీలతో చర్చలు జరపకపోవటం కేవలం సామ్రాజ్య వాదులతో స్నేహం చేయటానికని మండిపడ్డారు. ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి బలగాలను వెనక్కి రప్పించాలన్నారు. కేంద్రప్రభుత్వం చేస్తున్న ఎన్‌కౌంటర్‌లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేస్తున్న ఈ నరమేధాన్ని ప్రజలు, ప్రజాస్వామిక వాదులు ఖండించాలని వారు కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కిష్టపురం లక్ష్మణ్, కనుకుంట్ల శంకర్, అందే అశోక్, గజబింకార్ బన్సిలాల్. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, రాళ్లబండి శశిదర్, గొడ్డుబర్ల బాస్కర్, సిపిఐ జిల్లా నాయకులు జెర్రిపోతుల జనార్దన్, కర్నాల చంద్రం, రామగళ్ల నరేశ్, మిట్టపల్లి సుధాకర్, బెక్కంటి సంపత్, కానుగుల రమణాకర్, సిపిఎం నేతలు కొంగరి వెంకట్, అమ్ముల బాలనర్సయ్య, ప్రశాంత్, రవీంద్రచారి, రంజిత్‌రెడ్డి, అభిరాం, పివైఎల్ అనిల్, విజయ్ పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బాల్‌నర్సింహ్మా డిమాండ్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** అర్హత కలిగినవారందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మా డిమాండ్ చేశారు. సిపిఐ పెంట్లవెల్లి మండల 1వ మహాసభలు పెంట్లవెల్లి గ్రామంలో ఆదివారం న్యాయవాది చిన్న కుర్మయ్య అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా బాల్‌నర్సింహ్మా హాజరై మాట్లాడుతూ నియోజకవర్గంలో లభించేటటువంటి ముడిసరుకుల ఆధారంగా పరిశ్రమలను ఏర్పాటు చేసి కొల్లాపూర్ ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం పాటుపడాలన్నారు. అభివృద్ధియే లక్ష్యంగా కమ్యూనిస్టుల పోరాటాలు ఉంటాయని , వంద సంవత్సరాల కమ్యూనిస్టుపార్టీ చరిత్రలో పదవులు ఉన్నా లేకున్నా కార్మిక, కర్షక, పేద ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేసినవారు కమ్యూనిస్టులు మాత్రమేనన్నారు. ఇందిరమ్మ ఇళ్లను నిరుపేదలైన ప్రతి ఒక్కరికి ఇవ్వాలన్నారు. దేశం, రాష్ట్రంలో అనేకహక్కు లు సాధించబడ్డాయని వంద సంవత్సరాలుగా ఏనాడు అధికారంలో లేకున్నా నిరంతరం దేశ అభివృద్ధికి ప్రజల పక్షాన పోరాడిన చరిత్ర కమ్యూనిస్టులది అన్నారు. కార్యక్రమంలో ఐఎఎల్ రాష్ట్ర కార్యదర్శి బత్తిని రాముకుమార్, ప్రజానాట్యమండలి రాష్ట్ర నాయకులు గోపాల్, కొల్లాపూర్ మండల కార్యదర్శి తుమ్మలశివుడు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కిరణ్‌కుమార్, నిరంజన్‌నాయుడు, ఎఐటియుసి నాయకులు సువర్ణ రాజు, శేఖర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## 10న ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ బృందం రాక



**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి :** జోగులాంబ గద్వాల జిల్లాలో మంగళవారం 10వ తేదిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కమిటీ సభ్యులతో కలిసి పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ బాధితుల సమస్యల పరిష్కారంతో పాటు భూ సమస్యలు, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు తీరుపై చర్చించేందుకు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని షెడ్యూల్డు కులాల షెడ్యూల్డు తెగల సంఘాల నాయకులు తప్పనిసరిగా హాజరై తమ సమస్యల పట్ల కమిషన్ కు వినతిపత్రాలను సమర్పించుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు.



## కంప్యూటర్ బహుకరణ అభినందనీయం

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకటరెడ్డి

**ప్రజాపక్షం/సూర్యాపేట:** సిపిఐ జిల్లా కార్యాలయానికి కంప్యూటర్ బహుకరించడం అభినందనీయమని సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా నాలుగో మహాసభల సందర్భంగా సిపిఐ జిల్లా కార్యాలయానికి తెలంగాణ సాయుధపోరాట యోధులు కామ్రేడ్ చిల్లంచర్ల రఘునాథం జ్ఞాపకార్థంగా ఆయన కుమారుడు సిపిఐ మునగాల మండల కార్యదర్శి చిల్లంచర్ల ప్రభాకర్ ఉచితంగా కంప్యూటర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ ద్వారా పార్టీకి భవిష్యత్‌లో ఉద్యమాల కార్యక్రమాలు రూపకల్పనలకు ఎంతో ఉపయోగపడతాయని, మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీ శతజయంతి వేడుకలను ఘనంగా జరుకుంటున్న శుభ సందర్భంగా కార్యాలయానికి కంప్యూటర్ బహుకరించడం ప్రశంసనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చ ంద్రశేఖర్, ఎమ్మెల్సీ నల్లికంటి సత్యం, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మహిళ నాయకురాలు ఉస్తేల సృజన, నాయకులు బూర వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధికి కృషి



**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్:** మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో మండలంలోని పెద్ద సూరారం గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరుగుతుందని నల్లగొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు,మాజీ జెడ్పి టిసి గుమ్ముల మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ మండలం పెద్ద సూరారం గ్రామంలో రూ.7లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి రూ.10 లక్షల వ్యయంతో వ్యవసాయ పొలాలకు వెళ్లే రోడ్డు పనులకు మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్యలతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. పెద్దసూరారం గ్రామంలో అన్ని కాలనీలలో సిసిరోడ్లు, మురుగు కాలువల నిర్మాణం చేపట్టి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దరం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించి పలువురి లబ్ధిదారులకు మంజూరి పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పెండెం రత్నమాల పాండు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పిల్లి యాదగిరి యాదవ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఏడుదొడ్ల వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు.

## వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులుగా భిక్షం , సంజీవ



**ప్రజాపక్షం/చండూరు:** వ్యవసాయ కార్మిక సంఘం చండూరు మండల నూతన కమిటీని శుక్రవారం బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్గూరి నర్సింహ్మా సమక్షంలో ఎన్నుకున్నారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడుగా దోనిపాముల గ్రామానికి చెందిన దోటి బిక్షం , కొండాపురం గ్రామానికి చెందిన ఇరిగి సంజీవ సంఘం మండల ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఉపాధ్యక్షులుగా కాశిమల్ల శ్రీను , వట్టి యాదయ్య, సహాయ కార్యదర్శులుగా కట్ట వెంకన్న, కొండ్రెడ్డి రమేష్ , కోశాధికారిగా నాగలగాని సత్తయ్య ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షకార్యదర్శులుగా ఎన్నికైన భిక్షం, సంజీవ మాట్లాడుతూ చండూరు మండలంలో వ్యవసాయ కార్మిక సంఘం సమస్యల పరిష్కారంతో పాటు సంఘం బలోపేతం కోసం కృషి చేస్తామని అన్నారు. తమ ఎన్నికకు సహకరించిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీకి , సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య , సిపిఐ మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## కారు ఢీకొని మహిళ మృతి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రమాదవశాత్తు కారు ఢీకొని మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని కిష్టాపురం గ్రామ శివారులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని షాబునగర్‌కు చెందిన పొట్లూరి అలివేలు (35) తన తల్లి బొజ్జ యశోదతో కలిసి గుంటూరుకు వారి సొంత పనుల నిమిత్తం శనివారం ఉదయం వెళ్లి తిరిగి అదే రోజు సాయంత్రం 6గంటలకు గుంటూరు నుంచి మిర్యాలగూడకు లారీలో వస్తుండగా మార్గమధ్యలో రాత్రి 10గంటల సమయంలో మిర్యాలగూడ మండలం కిష్టాపురం గ్రామ శివారులోకి రాగానే లారీ డ్రైవర్ తన లారీని పక్కకు ఆపి బహిర్భూమికి వెళ్లగా అలివేలు, తన తల్లి యశోదలు మూత్రవిసర్జనకు లారీ దిగి రోడ్డు దాటి అనంతరం లారీ ఎక్కడం కోసం లారీ వద్దకు వస్తుండగా అదే సమయంలో గుంటూరు నుంచి మిర్యాలగూడ వైపు వస్తున్న కారు డ్రైవర్ తన కారును అతివేగంగా అజాగ్రత్తగా నడిపి రోడ్డు దాటుతున్న అలివేలును ఢీకొట్టాడు. దీంతో బలమైన గాయాలపాలైన అలివేలు అక్కడికక్కడే మృతిచెందింది. ఈమేరకు అలివేలు తల్లి బొజ్జ యశోద ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## నూతన్‌కల్ ఎస్ఐగా ప్రవీణ్‌కుమార్

**ప్రజాపక్షం/నూతన్‌కల్:** నూతన్‌కల్ ఎస్ఐగా వాస ప్రవీణ్‌కుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. నూతన్‌కల్ ఎస్ఐగా పనిచేసిన మహేంద్రనాథ్ బదిలీపై వెళ్లడంతో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్‌కుమార్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రాజకీయ పార్టీలు అవలంభిస్తున్న సిద్ధాంతాలన్నీ కమ్యూనిస్టులవే

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/వేములపల్లి:** ప్రపంచ చరిత్రలో సిపిఐకి ప్రత్యేక స్థానం ఉందని పార్టీ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రలో సిపిఐ మండల కార్యదర్శి జిల్లా యాదగిరి అధ్యక్షతన పుట్టల రాములు ప్రాంగణంలో జరిగిన సిపిఐ 7వ మండల మహాసభలో సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీకి ప్రత్యేక స్థానం ఉందన్నారు. సాయుధ రైతాంగ పోరాటంతో పాటు కార్మిక కర్షక పేద మధ్యతరగతి నిరుపేద ప్రజల పక్షాన ఆనాడు బూర్జువాలకు వ్యతిరేకంగా పోరాడి పేద ప్రజల విముక్తి కోసం లక్షల ఎకరాలు పంచి ఇచ్చిన ఘనత ఒక్క సిపిఐకే ఉందన్నారు. మత తత్వ సిద్ధాంతంతో హిందూ వాదం అంటూ ప్రజలను రెచ్చగొడుతూ అధికారం దక్కించుకున్న బిజెపి కార్పొరేట్ వ్యవస్థకు కొమ్ముకాస్తు దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతు అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటుందని అన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ ఎన్నికల ముందు తెలంగాణలో బిజెపి తన బలాన్ని నిర్మించుకోవడం కోసం చేసే ప్రయత్నాన్ని మునుగోడు ఉప ఎన్నికలలో సిపిఐ బిఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చి బిజెపిని తెలంగాణలోకి రానీయకుండా అడ్డుకున్న ఘనత సిపిఐకే దక్కిందని గుర్తు చేశారు. రాజకీయాలలో శాశ్వత మిత్రులు కానీ శాశ్వత శత్రువులు కానీ ఉండాలని ఎవరికైనా మద్దతు ఇచ్చేయడం జరుగుతుందంటే అది ప్రజా సంక్షేమం కోసమే తప్ప మరే ఉద్దేశం ఉండదని తెలిపారు. ఈ మహాసభలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు బంటు వెంకటేశ్వర్లు, మిర్యాలగూడ మండల శాఖ కార్యదర్శి రామచందర్,దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు ఒలంపట్ల వెంకన్న,వేములపల్లి శాఖ కార్యదర్శి పుట్టల నాగయ్య,దామచర్ల శాఖ సభ్యులు శాంతక్క,ఉదయ్ కుమార్,సీనియర్ నాయకులు మద్దిరాల రంగారెడ్డి, నాయకులు జడ భీమయ్య,బస్క పరమేష్,కాల్ వాయిస్ సుధాకర్,బంటు నాగేందర్,మాతంగి సత్యం,ఒలంపట్ల సుధాకర్ పాల్గొన్నారు.



## బౌద్ధ సంస్కృతి పరిరక్షణకు అంతర్జాతీయ అవార్డు

**ప్రజాపక్షం/నందికొండ:** బుద్ధ వనం మెంటర్‌గా విశిష్ట సేవలు అందిస్తున్న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ సిఎండి ప్రస్తుతం బుద్ధ వనం మెంటర్, మహా ఉపాసిక చెన్నూరు ఆంజనేయ రెడ్డిఆదివారం బెంగుళూరులోని మహా బోధి బుద్ధ విహార సొసైటీ నిర్వహించిన కార్యక్రమంలో ప్రతిష్టాత్మకమైన ఆచార్య బుద్ధ రఖిత అంతర్జాతీయ అవార్డును అందుకున్నారు. ఆంధ్ర తెలంగాణలో బౌద్ధ సంస్కృతి దాని పరిరక్షణ కు ఎంతగానో కృషి చేస్తున్న మహా ఉపాసిక చెన్నూరు ఆంజనేయ రెడ్డికి బెంగుళూరు మహాబోధి బుద్ధ విహార బిక్కుల సంఘం ఈ అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బెంగుళూర్ మహాబోధి బుద్ధ విహార సొసైటీ అధ్యక్షులు మహా కశ్యప తెరో, ప్రధాన కార్యదర్శి ఆనంద బంతే, సుగత నంద, బుద్ధదత్త, మహా బోధి బుద్ధ విహార హైదరాబాద్ అధ్యక్షుడు బుద్ధ పాల బంతే ఆంజనేయ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఆంధ్ర తెలంగాణ రాష్ట్రాలలో పర్యాటకంగా, బౌద్ధ సంస్కృతిని పరిరక్షణకు ఎన్నో సంవత్సరాలుగా కృషి చేస్తున్న మహా ఉపాసక చెన్నూరి ఆంజనేయ రెడ్డి ఇంత గొప్ప అవార్డు అందుకోవడంపై బౌద్ధ అభిమానులు, పర్యాటక శాఖ ఉన్నతాధికారులు, బుద్ధవనం అధికారులు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

## తాగునీటి కోసం బారులు

పొలాల్లోని బోర్ల వద్దకు ప్రజల ఉరుకులు



**ప్రజాపక్షం/ఉండవెల్లి:** మిషన్ భగీరథ నీళ్ల సరఫరాలో అంతరాయం ఏర్పడితే వీటి కోసం గ్రామాల్లోనూ ప్రత్యామ్నాయం గా నీటి సౌకర్యం లేకపోవడంతో త్రాగునీటి కోసం బిందెలు పట్టుకుని పరుగులు తీసే పరిస్థితి పొలాల్లోని బోర్ల దగ్గర చేరెందుకు దుస్థితి ఏర్పడింది. అల్లంపూర్ నియోజకవర్గంలోని త్రాగునీటి సమస్య వేధిస్తుంది. గత వారంలోనూ భారత్ మాల పనుల్లో భాగంగా ఐజ దగ్గర రోడ్డు పనుల్లో మిషన్ భగీరథ పైపు పగిలి మూడు రోజులు నీటి సమస్య తీవ్రంగా ఏర్పడింది. ఇలాగ ప్రతిసారి ఏదో ఒక సమస్య మిషన్ భగీరథకు ఏర్పడినప్పుడు నీటి సమస్య గ్రామాల్లో తీవ్రంగా ఉంటుంది. గ్రామాల్లో ఉన్న చేతి పంపులు కనుమరుగవడంతో నీటిని వాడుకోవడానికి స్నానాలకు జంతు సంపదకు తీవ్ర సమస్యగా ఏర్పడింది. రైతు కుటుంబాలు పశువులను అభివృద్ధి పరుచుకోవడానికి నీటి వనరులు లేక ఇబ్బందులతో కాలం చెల్లిస్తున్నారు. గ్రామాల్లోనూ ట్యాంకులు బోర్లు ఉన్న విద్యుత్ అంతరాయం వలన నిండని పరిస్థితి ఏర్పడింది. నియోజకవర్గంలోని మిషన్ భగీరథ నీళ్లు రానప్పుడు పంట పొలాల దగ్గరికి వెళ్లి నీళ్లు తెలుసుకోవాల్సి ఉంది. కొన్ని గ్రామాల్లో నీళ్లు ఫ్లోరైడ్ ప్రభావం వలన వాడుకోవడానికి కూ డా పనికి రాని పరిస్థితి కనపడుతుంది. హోటల్లు దుకాణాల్లోనూ మినరల్ వాటర్‌కి అలవాటు పడి రూ.20 రూపాయల నుంచి 30 దాకా నీళ్లు కొనుగోలు చేసుకుని వాడుకునే పరిస్థితి ఉంది. కొన్ని గ్రామాల్లోనూ దాతల సహకారంతో మినరల్ వాటర్ నిర్వహిస్తున్నారు. చేతి బోర్లు లేకపోవడం వలన అనేక రకాల పద్ధతిలో గ్రామాల్లోనూ నీటి కోసం ప్రత్యేక మార్గాలను ఎదుర్కొంటున్నా రు. మినరల్ వాటర్ పుట్టగొడుగుల పుట్టడం తో వ్యాపారంగా మారింది. ఫంక్షన్లో శుభ కార్యక్రమాలకు ప్రతిచోట మినరల్ వాటర్‌ని ఉపయోగిస్తున్నారు.

## సైబర్ నేరాలపై అవగాహన



**ప్రజాపక్షం/గుండాల:** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల పరిధి లోని వెల్మజాల గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే ఆర్థిక అక్ష రాస్యత అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం కళాకారుల చేత నిర్వహిం చారు. ఈసందర్భంగా సొసైటి ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేన్ కౌన్సిలర్ మల్లేష్ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న ప్రతి ఒక్కరు ఆర్థిక ప్రణాళిక బడ్జెట్‌పై అవ గాహన కలిగి ఉండాలని, సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి జాగ్రత్తగా ఉంటూ సైబర్ నేరాలకు గురైన వాళ్లు 1930 టోల్ ఫ్రి నెంబర్‌కు 24 గంట ల వ్యవధిలో సమాచారం అందించాలని సూచించారు. అనంతరం ఎస్‌బిఐ ఫీల్డ్ ఆఫీసర్ ప్రభాకర్ మాట్లాడుతూ మహిళా సంఘం సభ్యులు, రైతులు తీసుకున్న లోన్లు సకాలంలో చెల్లించి తిరిగి లోన్లను పొందాలని లోన్లు సకాలంలో చెల్లించిన లబ్ధిదారులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిం చే సబ్సిడీలు వర్తిస్తాయని, ప్రతి ఒక్క ఖాతాదారుడు బ్యాంక్‌లకు సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో సొసైటి ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేన్ కౌన్సిలర్ ప్రవీణ్, ఎస్‌బిఐ ఎఫ్ఐ సాంబ, కళాజాత బృందం „విజయ్, వివోఏలు జయమ్మ, కలమ్మ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## సాహిత్యం పురోగమనానికి విమర్శే కీలకం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** సాహిత్యంలో విమర్శ అనే ప్రక్రియ అత్యంత కీలకమైనది అని, సాహిత్యం పురోగమించడానికి విమర్శ ఉపకరిస్తుందని జాతీయ ఉత్తమ సినీ విమర్శకులు డాక్టర్ ఎం పురుషోత్తమాచార్య అన్నారు. శనివారం డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య రచించిన నెరుసు, మెర విమర్శ గ్రంథాల ఆవిష్కరణ సభలో ఆయన ప్రసంగించారు. నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో పెరుమాళ్ళ ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈ సభ లో పురుషోత్తమాచార్య మాట్లాడుతూ రచన యొ క్క సారాన్ని పాఠకులకు అందించడంలో విమర్శ ఎంతగానో తోడ్పడుతుంది అన్నారు. మెర పుస్తక ఆవిష్కరణ మేరెడ్డి యాదగిరిరెడ్డి మాట్లాడుతూ నిత్య అధ్యయనశీలి అయిన కృష్ణ కౌండిన్య పరిశోధనాత్మక దృష్టితో వ్యాసాలు రచించారన్నారు. సమాజాన్ని చైతన్యపరిచే రచనలు చేయవలసిన బాధ్యత సాహిత్య కారులపై ఉందని ప్రముఖ కవి విమర్శకులు డా. పగడాల నాగేందర్ అన్నారు.ఈ వ్యాస సంపుటాలకు నెరుసు మెర అని పేరు పెట్టడంలోనే ఔచిత్యం ఉందని, ఆయా కవులు రాసిన పలు పుస్తకాలను సద్విమర్శ గావించి తనదైన శైలిలో ఆవిష్కరించిన విధానం బాగుందని మునా సు వెంకట్ కొనియాడారు. నెరుసు వ్యాసాలను శీలం భద్రయ్య, మెర వ్యాసాలను డాక్టర్ సాగర్ల సత్తయ్య సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మాదగాని శంకరయ్య, బైరెడ్డి కృష్ణారెడ్డి, కత్తుల శంకర్, డాక్టర్ కనకటి రామకృష్ణ, ధనోజ, చొల్లేటి స్వాతి, రావిరాల అంజయ్య, బి శ్రవణ్, దాసోజు రవికుమార్,కుక్కడపు రమేష్,బండారు శంకర్, సిలివేరు లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలి

బిసి హక్కుల సాధన సమితి ధనుంజయనాయుడు డిమాండ్



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** ఉద్యోగ నోటిఫికేషన్లు వెంటనే విడుదల చేయాలని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బిసి కార్యాలయంలో బొమ్మగాని ధర్మబిక్షం భవన్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. 9 సంవత్సరాల కిందట సూర్యాపేట జిల్లా కొత్తగా ఏర్పడిందని, దాంతోపాటు రెవిన్యూ డివిజన్‌లో కార్యాలయాలు నూత మండలాలు, నూతన గ్రామ పంచాయతీలుగా అవతరించాయని కాని, అందుకు తగ్గ సిబ్బందిలేక ప్రజలకు మెరుగౌన సేవలు అందించడం లేదని, దాదాపు అన్నిచోట్ల ఇన్‌ఛార్జి పాలన కొనసాగుతుందని అన్నారు. విద్యాశాఖలో ఎంఇవోల కొరత,నూతన పోలీస్‌స్టేషన్ ఏర్పడ్డాయని, కాని తగినంత సిబ్బంది లేక ట్రాఫిక్ కానిస్టేబుల్ కొరత ఉ ందని ట్రాఫిక్ కానిస్టేబుల్ కొంత ఉన్నదని కొత్త జిల్లలో మహిళ పోలీస్‌స్టేషన్ లేదని ఎన్నో సందర్భాలు మహిళ పోలీస్‌స్టేషన్ గురించి విజ్ఞప్తి చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. గత శాసన సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మ్యానిపెస్టోలో ఇచ్చిన హామీలలో భాగంగా పార్టీమ్యానిఫెస్టో ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి నేటికి ఇంత వరకు అతీగతి లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు దంతాల రాంబాబు, యల్లోబొయిన సింహాద్రి, పిల్లుట్ల కనకయ్య, చిలకరాజు రాజు శ్రీను, జిల్లా సహాయ కార్యదర్శి కొమ్మరాజు వెంకట్, సిగాపురపు శ్రీనివాసరావు,అనంతుల రాము, బత్తిని శ్రీనివాస్, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

## మృగశిర కార్తె చేపల పండగ

చేపలు కొనుగోలు చేసేందుకు భారీగా తరలివచ్చిన ప్రజలు

రోడ్డెక్కిన చాపల ప్రియులు.. రద్దీగా ఉన్న చేపల మార్కెట్లు





**ప్రజా పక్షం/నల్లగొండ టౌన్:** తావరణం చల్లబడటంతో మన శరీరంలో ఉష్ణోగ్రత తగ్గుతుంది. శరీరంలో వేడి పెంచడానికి మృగశిర కార్తె రోజు నుంచి చేపలు ఎక్కువగా తింటారు. దీని వల్ల గుండె జబ్బులు,ఆస్తమా రోగులకు ఉపశమనం కలుగుతుంది. ఉబ్బసం సమస్యతో బాధపడేవారికి ఈ చేప ప్రసాదం ఇస్తారు. మరోవైపు ఈ కార్తెకు రెండు మూడు రోజుల ముందు నుంచే చేపల మార్కెట్లలో రద్దీ పెరుగుతుంది. అయితే మృగశిర కార్తె ప్రారంభమైన రోజునే చేపలు తింటే మంచి ఆరోగ్యం వస్తుందని ప్రజల నమ్మకం. మృగశిర కార్తె ప్రారంభమైన ఒక్కరోజే కాకుండా మిగతా రోజుల్లోనూ ప్రజలు చేపలు తింటుంటారు. మృగశిర కార్తి నాడు చేపలు తినాలని ఆశతో ధరలు ఎంత ఎక్కువ ఉన్నా కొనుగోలు చేస్తుంటారు. మృగశిర కార్తె రాగానే వర్షాలు ప్రారంభమవుతాయి. ఫలితంగా వాతావరణం చల్లబడుతుంది. 15 రోజుల పాటు శరీరం చల్లగా ఉండటంతో తగినంత వేడి కోసం చేపలను ఎక్కువగా తింటుంటారు. వాతావరణం మారటంతో ఒక్కసారిగా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. దీంతో మాంసాహారులు చేపలను తింటారు. అదే సమయంలో శాఖాహారులైతే బెల్లంలో ఇంగువను కలుపుకొని చిన్న ముద్దలుగా చేసుకుని తినేవారని పెద్దలు చెబుతుండేవారు. నేటికి అదే విధానాన్ని కొనసాగిస్తున్నారు.ఈ నేపథ్యంలో చాపలను కొనుగోలు చేసేందుకు ప్రజలు నల్లగొండ పట్టణంలోని పానగల్ బైపాస్, తోపాటు ప్రధాన కూడలిలలో ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి కొనుగోలు చేశారు. ఒక్కసారిగా చేపల ప్రియులు రోడ్లు ఎక్కడంతో రహదారులన్నీ ఎక్కడకక్కడే ట్రాఫిక్ జామ్ అయ్యి రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో పోలీసులు వచ్చి రోడ్లను క్లియర్ చేశారు. మృగశిర కార్తె రాగానే చాపల ప్రియులు ఇష్టంగా చేపల కూర తింటారు చిన్న పెద్ద అని తేడా లేకుండా చేపల కూర తినేందుకు ఇష్టపడుతుంటారు. ప్రతి సంవత్సరం మృగశిర కార్తి నాడు చాపల మార్కెట్లో సందడి నెలకొంటుంది ఎక్కడ చూసినా చేపలతో మార్కెట్ కళకళలాడుతుంది. ఈ సంవత్సరం మరోసారి సందర్భంగా చాపల ప్రియులు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎగబడి చాపలను కొనుగోలు చేశారు.

## చంద్రకళకు సిపిఐ నేత నివాళి



**ప్రజాపక్షం/నల్లగొండ (కనగల్):** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు నల్లగొండ కమ్యూనిస్టు పార్టీ తాలూకా నిర్మాత అమరజీవి చిలక రాజు మారయ్య కుమార్తె కోమరాజు చంద్రకళ మృతి చెందారు. మరణవార్త తెలుసుకున్న సిపిఐ సీనియర్ నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి కనగల్ మండలంలోని చర్లగౌరారంకు చేరుకొని ఆమె పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసిన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జినుకుంట్ల లింగయ్య, చిలకరాజు రాములు, పండరి, జినుకుంట్ల ఆంజనేయులు, జినుకుంట్ల సూరయ్య, పిల్లుట్ల చరణ్, గట్టిగుండ్ల నాని పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు దూరంగా యువత

**ప్రజాపక్షం/మునగాల:** మత్తు పదార్థాలకు, గంజాయికి యువత దూరంగా ఉండాలని మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ మండల యువతకు ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. మత్తు పదార్థాల వినియోగం కారణంగా యువత జీవితాలు దుర్భరమవుతున్నాయని అన్నారు. మత్తు పదార్థాలకు బానిసలుగా మారి యువత తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని అన్నారు. మత్తుతో జీవితాలు చిత్తు చేసుకోవద్దని, మాదకద్రవ్యాల నిర్మూలన మన అందరి బాధ్యత అని అన్నారు. యువత డ్రగ్స్, మాదక ద్రవ్యాలకు అలవాటు పడటం వల్ల దైనందిన విషయాలపై దృష్టిపెట్టకుండా క్రమేపి ఆరోగ్యం క్షీణించడంతో పాటు అది ఒక వ్యసనంగా మారి, నేర ప్రవృత్తి వైపు దారితీస్తుందని అన్నారు. యువత, పోలీసులు ప్రతి ఒక్కరు కలిసి కట్టుగా పోరాడితే విజయం సాధించగలమని అన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## ‘ఆపరేషన్‌కగార్’ను వెంటనే ఆపాలి

**ప్రజాపక్షం/అచ్చంపేట :** కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని అచ్చంపేట తాలుకాలో సిపిఐ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఆదివారం పట్టణంలోని టిఎన్‌జివో భవనంలో సిపిఐ నాయకులు పెరుమాళ్లగోపాల్, మల్లేష్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటుచేశారు.
ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఆపరేషన్‌కగార్ పేరుతో అమాయకులను ఎన్‌కౌంటర్ చేస్తుందన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేస్తుందన్నారు. ఇప్పటికైనా వెంటనే ఆపరేషన్‌కగార్‌ను ఆపివేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలన్నారు. ఆదివాసిల దైనందిన జీవితం అగమ్యగోచకరంగా మారిందన్నారు.
కార్పొరేట్‌శక్తులకు అడవులను అప్పగించేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సిపిఐ డివిజన్ నాయకుడు అంబయ్య, పౌరహక్కులసంఘం జిల్లా నాయకుడు బాలయ్య, ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు అంజయ్య, బిసి సంఘం నాయకులు యాదయ్య, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్, బిఎస్‌పి పార్టీ నాయకుడు కృపానందం పాల్గొన్నారు.

## మంత్రికి పుస్తకాల రాహుల్ శుభాకాంక్షలు



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** మక్తల్ ఎమ్మెల్యే వాకిటిశ్రీహరి ఆదివారం రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మ సమక్షంలో మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఈసందర్భంగా యువజన కాంగ్రెస్ మాజీ రాష్ట్రఅధికార ప్రతినిధి పుస్తకాలరాహుల్ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మక్తల్ ఎన్‌ఎస్‌యుఐ అధ్యక్షునిగా తన రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టిన ముదిరాజ్ సామాజికవర్గానికి చెందిన వాకిటి శ్రీహరి అంచెలంచెలుగా ఎదుగుతూ సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని తెలంగాణరాష్ట్ర కేబినెట్‌లో మంత్రిగా బాద్యతలు స్వీకరించడం గర్వించదగ్గ విషయమన్నారు. శుభాకాంక్షలు తెలిపినవారిలో యువజన కాంగ్రెస్ కల్వకుర్తి నియోజకవర్గ ఉపాధ్యక్షులు శాబుద్దీన్ ఉన్నారు.

## మంత్రి శ్రీహరికి శుభాకాంక్షలు తెలిపిన దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** నూతన రాష్ట్ర మంత్రిగా ఆదివారం ప్రమాణస్వీకారం చేసిన మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరిని హైదరాబాదులోని ఆయన నివాసంలో డిసిసి అధ్యక్షులు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పూలబోకే అందజేసి శాలువాతో సత్కరించి స్వీటు తినిపించారు. ఉమ్మడి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి సహకరించాలని కోరారు. జిల్లా అభివృద్ధి కోసం అధిక నిధులు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేశారు.

## నూతన మంత్రిని సన్మానించిన ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా, మక్తల్ శాసనసభ్యులు డా॥ వాకిటి శ్రీహరి ని, ప్రమాణస్వీకారం చేసిన అనంతరం మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అభివృద్ధికి అన్ని విధాలా సహకరించాలని మంత్రి ని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, జిల్లా ఒలంపిక సంఘం అధ్యక్షులు ఎన్‌పి వెంకటేష్, బెక్కెరి మధుసూదన్ రెడ్డి, ముకుందం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఇవ్వడంపై బిసి సమాజ్ హర్షం

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** మక్తల్ శాసనసభ్యుడు వాకిటి శ్రీహరికి రాష్ట్ర మంత్రిగా అవకాశం కల్పించడం పట్ల బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు మోడల శ్రీనివాస్ సాగర్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఏకైక ముదిరాజ్ ఎమ్మెల్యేగా ఉన్న బీసీ బిడ్డ వాకిటి శ్రీహరిని గుర్తించి మంత్రి పదవి ఇవ్వడం పై కాంగ్రెస్ అధినాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ రాహుల్ గాంధీ ఆలోచన మేరకు బీసీలకు ప్రాతినిధ్యం దక్కడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి , పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కి కృతజ్ఞతలు తెలిపారు. ఇంకా ఖాళీగా ఉన్న మూడు మంత్రి పదవులలో కనీసం రెండు స్థానాలు ఎంబీసీలకు కేటాయించి గతంలో కాంగ్రెస్ పార్టీ బసవరాజు సారయ్య, నరసప్ప లాంటి ఎంబిసిలకు సరైన గుర్తింపు అప్పట్లోనే ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ మంత్రి మండలిలో సముచిత స్థానం కల్పించి బీసీల పక్షపాతిగా నిలవాలని శ్రీనివాస్ సాగర్ కోరారు.

## శ్రీహరికి మంత్రి పదవి రావడంతో కుటుంబ సభ్యులు సంబరాలు

**ప్రజాపక్షం/ నారాయణపేట్:** మక్తల్ ఎమ్మెల్యే డా॥ వాకిటి శ్రీహరి కి మంత్రి పదవి రావడంతో నారాయణపేట జిల్లా కేంద్రంలోని గొడుగుగేరి అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద మంత్రి కుటుంబీకుల సంబరాలు, కాగ మంత్రి తల్లి రాములమ్మ , వీరి తల్లి శివమ్మ స్వస్థలం నారాయణపేట గొడుగుగేరి, అంటే మంత్రి అమ్మమ్మ ఊరు కావడం తో సంబరాలు చేసుకున్నారు.

## ట్రావెల్ బస్సు ఢీ కొని ఒకరి మృతి

ఇరువురికి గాయాలు



**ప్రజాపక్షం/పెబ్బేరు:** మండల కేంద్రంలో పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా తెల్లవారు జామున మూడున్నర గంటల సమయంలో చిత్తూరు నుండి హైదరాబాద్ వెళ్తున్నటువంటి జగన్ ట్రావెల్ కి సంబంధించిన ప్రైవేట్ బస్సు ఎన్ఎల్ 01బి 9555 గల డ్రైవర్ నరేష్ అను వ్యక్తి బస్సు వేగంగా జాగ్రత్తగా నడిపి తన ముందు వెళ్తున్నటువంటి ఒక కర్ణాటక బస్సు కెఏ 57 ఎఫ్ 1615 తగిలించి దాన్ని తప్పించబోయి దాని పక్కన వెళ్తున్నటువంటి మరొక లారీ ఎంహెచ్ 30బిడి 1334ని ఢీ కొట్టడం వల్ల జగన్ ట్రావెల్స్ బస్సులో డ్రైవర్ పక్కన కూర్చున్నటువంటిహెల్పర్ నాగేంద్ర ప్రసాద్ అను వ్యక్తి బస్సు ముందు అద్దం పగలం వల్ల బస్సు ముందు భాగంలో పడి దాని తర్వాత అదే బస్సు హెల్పర్‌పై ఎక్కడం వల్ల అక్కడికక్కడే మరణించడం జరిగింది. అంతేకాక ఇదే బస్సులో ప్రయాణిస్తున్నటువంటి ప్రయాణికులైన చిత్తూరు జిల్లాకు చెందిన స్వాతి కడప జిల్లాకు చెందిన క్రాంతి ఇద్దరికి కాలు విరగడం జరిగింది. బస్సు నడిపినటువంటి బస్సు డ్రైవర్ నగేష్ కు కూడా కాలు విరగగా గాయపడిన వారిని అందరిని ఆసుపత్రికి పంపించడం జరిగింది. మృతుని తండ్రి సుబ్బారాయుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని స్థానిక ఎస్ఐ యుగంధర్ రెడ్డి తెలిపారు.

# సర్పంచ్ స్థాయి నుంచి రాష్ట్ర మంత్రి దాకా..



**ప్రజాపక్షం/మక్తల్:** మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రజానీక సంకల్ప యాత్ర తెలంగాణ కొత్త మంత్రివర్గంలో చోటు దక్కించుకున్న మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఒక గ్రామ సర్పంచుగా ప్రారంభమైన యాత్ర, రాష్ట్ర పాలనలో కీలక బాధ్యత వరకు చేరింది. ఇది కేవలం రాజకీయ పదవుల మార్పు కాదు. ప్రజల నమ్మకంతో సంక్షేమ లక్ష్యాలతో సాగిన ఒక విశేషమైన ప్రయాణం. రైతు ఇంటి బిడ్డగా జననం బీసీ ముదిరాజు సామాజిక వర్గానికి చెందిన శ్రీహరి, మక్తల్ మండలంలోని ఓ సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. తండ్రి వాకిటి నరసింహులు వ్యవసాయదారులుగా జీవనం సాగించగా, తల్లి వాకిటి రాములమ్మ ఆరోగ్య శాఖలో ఏఎన్ఎంలో బాధ్యతలు నిర్వహించారు. చిన్ననాటి నుంచే సామాజిక స్పృహతో ఎదిగిన శ్రీహరి, పేదల జీవితాలను గమనిస్తూ, ప్రజా సేవ తన దారిగా ఎన్నుకున్నారు.

**ప్రజా సేవలో రాజకీయ ప్రస్థానం..**

2001–2006 మక్తల్ గ్రామ సర్పంచు
2014–2018 జెడ్పిటిసి సభ్యుడు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్
2022 నారాయణపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు
2023 మక్తల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన తర్వాత
2025 తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో సభ్యుడిగా ప్రమాణ స్వీకారం.

**కుటుంబం సేవకే అంకితం..**

ఈ కుటుంబం రాజకీయ పదవుల కోసం కాదు, ప్రజల సేవ కోసం పనిచేసింది.
భార్య లలితమ్మ మక్తల్ మాజీ ఎంపీటీసీ
తమ్ముడు శేషగిరి మక్తల్ మాజీ డిప్యూటీ సర్పంచు
మరదలు రాధికమక్తల్ మాజీ కౌన్సిలర్
ఈ కుటుంబం మొత్తం సామాజిక అభ్యున్నతికే అంకితంగా, ప్రజల మద్దతుతోనే ముందుకు సాగింది.

**కాంగ్రెస్ పార్టీకి నిబద్ధత..**

శ్రీహరి రాజకీయ జీవితమంతా కాంగ్రెస్ పార్టీకి అంకితం. ఒక్కసారి కూడా పార్టీ మారలేదు. ప్రతి ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటి చేసి ప్రజల ఆదరణతో గెలిచారు. సంక్షేమ పథకాలు, సామాజిక సమానత్వంపై ఆయన ప్రత్యేక శ్రద్ధ కొనసాగుతుంది.

**మంత్రిగా ఆశాజనక ప్రారంభం..**

ప్రజల ఆశలు, అభీష్టాలను మంత్రిగా మరింత వృద్ధి దిశగా మలిచేందుకు శ్రీహరి సిద్ధంగా ఉన్నారు. మౌలిక సదుపాయాలు విద్య, వైద్యం, ఉపాధి పై ప్రత్యేక దృష్టితో రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడే నేతగా తలపెట్టారు.
ప్రజలే నా బాలం..సేవే నా లక్ష్యం..
వాకిటి శ్రీహరి పార్టీకి శ్రమను నమ్మకాన్ని ఇచ్చిన శ్రీహరి నాయకత్వం, భవిష్యత్తు తెలంగాణలో బలమైన మార్పులకు దారి చూపుతుందనే నమ్మకం రాజకీయ వర్గాల్లో నెలకొంది.

## ఈ నెల 10న ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ బృందం రాక



**ప్రజాపక్షం/జోగులాంబగద్వాల ప్రతినిధి:** జోగులాంబ గద్వాల జిల్లాలో మంగళవారం 10వ తేదిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య కమిటీ సభ్యులతో కలిసి పర్యటించనున్నారని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. పర్యటన లో భాగంగా మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ బాధితుల సమస్యల పరిష్కారంతో పాటు భూ సమస్యలు, ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు తీరుపై చర్చించేందుకు సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి జిల్లాలోని షెడ్యూల్డు కులాల షెడ్యూల్డు తెగల సంఘాల నాయకులు తప్పనిసరిగా హాజరై తమ సమస్యల పట్ల కమిషన్ కు వినతిపత్రాలను సమర్పించుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ బి.ఎం.సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రతీ జర్నలిస్టుకూ బీమా చేయిస్తా



**ప్రజాపక్షం/వనపర్తి టౌన్:** జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వనపర్తి నియోజకవర్గ పరిధిలోని ప్రతి జర్నలిస్టుకు తానే స్వయంగా భీమా చేయిస్తానని అందుకు సంబంధించిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి జర్నలిస్టులకు హామీనిచ్చారు. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన వనపర్తి నియోజకవర్గం స్థాయి జర్నలిస్టుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని వారి సందర్భంగా మాట్లాడారు. ప్రజలు తనకు ఇచ్చిన అవకాశాన్ని ఒక సామాన్య వ్యక్తిగా ప్రజలతో మమేకమై నియోజకవర్గం అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. నియంత్రుత్వ పోకడాతో కాకుండా స్నేహపూర్వకంగా ఎవరి ఆత్మగౌరవం దెబ్బతీయకుండా స్వేచ్ఛ వాతావరణంలో పరిపాలనందిస్తానన్నారు. ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉన్న జర్నలిస్టుల నిజాలను, సమస్యలను నిర్భయంగా రాయాలని సూచించారు. గత ప్రభుత్వ హయంలో సామాన్య ప్రజలకు నిత్యావసరాలను సమకుర్చడంల, రైతులకు, వ్యాపారస్తులకు మౌలిక వసతులు, సాగు నీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించడం విఫలమైదన్నారు. నిర్లక్ష్యానికి , నిస్పృహలకు లోనైనా ప్రతి రంగాలను కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధికి తార్కణం నిలిచేలా చేసి చూపిస్తామన్నారు. చాలా ఏండ్లుగా అసంపూర్తిగా మిగిలిపోయినా వనపర్తి జిల్లా మండలాల ప్రెస్ క్లబ్ స్థలం, భవన నిర్మాణం, అర్హులైన ప్రతి జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపు రాజీవ్ యువ శక్తి పథకం వర్తింపు ప్రక్రియ పూర్తి చేసేందుకు తాను బాధ్యత తీసుకుంటానని జర్నలిస్టులకు భరోసా కల్పించారు. జర్నలిస్టుల కుటుంబాలకు విద్యా, వైద్యం రంగాలలో రాయితీలను కల్పించేలా, నియోజకవర్గంలోని ప్రతి జర్నలిస్టులకు భవిష్యత్తులో ప్రభుత్వం తరపున ఎటువంటి సహాయం చేసేందుకు ఏళ్ల వేళల అందుబాటులో ఉంటానని భరోసా కల్పించారు. జర్నలిస్టులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానన్నారు. వనపర్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## గొలుసుకట్టు వ్యాపారాల జోలికి వెళ్లొద్దు

జిల్లా ఎస్‌పి యోగేష్ గౌతమ్



**ప్రజాపక్షం/నారాయణపేట్:** మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీములతో ప్రజలు అప్రమత్తంగా వుండాలి ప్రజల సోమ్ము దోచుకోనేందుకు సైబర్ నేరగాళ్లు రోజు, రోజుకి కొత్త కొత్త పోకడలతో ప్రజల బలహీనతలను పెట్టుబడిగా చేసుకోనేందుకు సైబర్ నేరగాళ్లు కొత్త పంథాలను ప్రయోగిస్తున్నారు. మోసపూరిత వాగ్దానాలు, ప్రకటనతో మోసాలకు పాల్పడుతున్న మల్టీ లెవెల్ మార్కెటింగ్ స్కీముల పట్ల ప్రజలు అప్రమత్తంగా వుండాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్, ఐపీఎస్ ప్రజలకు ఒక ప్రకటనలో తెలిపారు. గొలుసుకట్టు వ్యాపారాలు చేస్తూ ప్రజలకు మోసం చేసే మల్టిలెవెల్ వ్యాపారాలు పెరుగుతున్నాయి. మీ కింద ఎక్కువ మంతి ఏజెంట్లను చేర్పించి తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు పొందండి అనే వాటిని నమ్మవద్దు అని ఎస్పీ అన్నారు. ఇలాంటి మల్టీలెవల్ వ్యాపారం చేస్తూ ప్రజల నుండి డబ్బులు సేకరించి ఆర్థికంగా మోసం చేస్తూ ప్రజల చైన్ సిస్టం మార్కెటింగ్ వ్యాపారాల ద్వారా ఆర్థికపరమైన మోసాలు జరుగుతున్నాయని ప్రజలు గుర్తించాలని కోరారు. ఎక్కువమంది ఏజెంట్లను చేర్పిస్తే రివార్డులు, పాయింట్లు లభిస్తాయని కేటుగాళ్ల ఆశ రివార్డులు, పాయింట్లు లభిస్తాయని కేటుగాళ్లు ఆశ చూపుతారు. ఇలాంటి వారి మాయ మాటలు నమ్మి అత్యాశకు పోతే భారీగా ఆర్థిక నష్టం జరుగుతుంది అన్నారు. సైబర్ మోసగాళ్ళు కొత్త పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. సూబర్ మోసాల పట్ల ప్రజల్లో అవగాహన పెరగడంతో సైబర్ మోసగాళ్లు మల్టీలెవెల్ మార్కెటింగ్ పై దృష్టి సారించి గొలుసుకట్టు వ్యాపారాల పేరుతో వాట్సప్, టెలిగ్రామ్, ఫెస్బుక్ లాంటి సోషల్ మీడియా వేదికల ద్వారా ప్రకటనలు చేసి అమాయకులను ఆకర్షించి మోసగించి ఆర్థిక నష్టాన్ని కలగజేస్తారు. మల్టీ లెవెల్ మార్కెటింగ్‌ను చాలామంది విదేశాల్లో ఉండి ఒక రాకెట్ లా నడుపుతారు. సోషల్ మీడియాలో వచ్చే అబద్ధపు ప్రకటన పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలి, అనుమానాస్పద ప్రకటనలు, వెన్ లింకులు, ఏపీకే ఫైల్ లాంటివి డౌన్లోడ్ చేయవద్దు. మోసపూరిత ప్రకటనల పై, ఆర్థిక మోసాల పై వెంటనే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు ఫిర్యాదు చేయండి అని ఎస్పీ తెలిపారు.

## బడిబాట కార్యక్రమం



**ప్రజాపక్షం/ ధన్వాడ :** ధన్వాడ మండలం చర్లపల్లి గ్రామంలో ఎంపీ యుపిఎస్ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాత్రి ఇల్లు తిరుగుతూ తల్లిదండ్రులకు గ్రామ ప్రజలతో మాట్లాడుతూ మన ఊరి పిల్లలను మనబడి లో చేర్పించాలని ప్రభుత్వ పాఠశాలలో మన ఊరి పిల్లల్ని చేర్పించి విద్యార్థుల బంగారు భవిష్యత్తు కు బాటలు వేయాలని ఉపాధ్యాయుల నవనీత తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తక్షణమే తెలంగాణ క్యాబినెట్లో మైనార్టీలకు అవకాశం కల్పించాలి

కాంగ్రెస్ సీనియర్ నాయకులు హనీఫ్ అహ్మద్

**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిది:** తెలంగాణ క్యాబినెట్లో తక్షణమే మైనారిటీలకు చోటు కల్పించాలని తెలంగాణ ఉద్యమకారుడు, ప్రముఖ సామాజికవేత్త, కాంగ్రెస్ సీనియర్ నాయకులు హనీఫ్ అహ్మద్ ప్రముఖ మేధావులు హనీఫ్ అహ్మద్, సాదుల్లా, మదీనా మజీద్ కమిటీ ప్రెసిడెంట్ అవాజ్ బిల్ సుల్తాన్, ఆల్ ఇంటియా సున్నీ బోర్డు జనరల్ సెక్రెటరీ మౌలానా మోసిన్ పాషీ ఖాద్రి, జమాయేతుల్ గులేమా ఏ ఇందు ప్రెసిడెంట్ మౌలానా నాసర్ సాహెబ్ కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర రాజకీయ చరిత్రలోనే తొలిసారిగా మంత్రివర్గంలో మైనారిటీలకు స్థానం కల్పించకపోవడం మైనార్టీ వర్గాలను తీవ్ర ఆందోళనకు ఆవేదనకు గురిచేస్తుందని చెప్పారు. నేడు జరిగిన మంత్రివర్గ విస్తరణలో మైనార్టీలకు ప్రాతినిధ్యం ఉంటుందని తాము అశించామని, మైనిరిటీ ఆశల పై నీళ్లు చల్లే విధంగా క్యాబినెట్ విస్తరణ ఉందని చెప్పారు. తెలంగాణలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు 40 అసెంబ్లీ నియోజకవర్గాల్లో మైనారీటలు 18 శాతం ఓటు బ్యాంకు కలిగి ఉన్నారని మైనర్టీలు ఏకపక్షంగా ఆ 45 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడం వలన కాంగ్రెస్ అధికారంలోకి రావడం మరింత సులమైందని తెలిపారు. మైనారిటీల ఏకపక్ష ఓటు బ్యాంకు కారణంగానే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది తెలిపారు. సామాజిక న్యాయం కోసం పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహూల్ గాంధీ, మల్లికార్జున , ఖర్గే ఇచ్చిన అవకావాన్ని వారు సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు.

## నీటి కోసం పొలాల్లోని బోర్లవద్దకు పరుగులు...



**ప్రజాపక్షం/ఉండవెల్లి:** మిషన్ భగీరథ నీళ్ల సరఫరాలో అంతరాయం ఏర్పడితే వీటి కోసం గ్రామాల్లోనూ ప్రత్యామ్నాయంగా నీటి సౌకర్యం లేకపోవడంతో త్రాగునీటి కోసం బిందెలు పట్టుకుని పరుగులు తీసే పరిస్థితి పొలాల్లోని బోర్ల దగ్గర చేరెందుకు దుస్థితి ఏర్పడింది. అల్లంపూర్ నియోజకవర్గంలోని త్రాగునీటి సమస్య వేధిస్తుంది. గత వారంలోనూ భారత్ మాల పనుల్లో భాగంగా ఐజ దగ్గర రోడ్డు పనుల్లో మిషన్ భగీరథ పైపు పగిలి మూడు రోజులు నీటి సమస్య తీవ్రంగా ఏర్పడింది. ఇలాగ ప్రతిసారి ఏదో ఒక సమస్య మిషన్ భగీరథకు ఏర్పడినప్పుడు నీటి సమస్య గ్రామాల్లో తీవ్రంగా ఉంటుంది. గ్రామాల్లో ఉన్న చేతి పంపులు కనుమరుగవడంతో నీటిని వాడుకోవడానికి స్నానాలకు జంతు సంపదకు తీవ్ర సమస్యగా ఏర్పడింది. రైతు కుటుంబాలు పశువులను అభివృద్ధి పరుచుకోవడానికి నీటి వనరులు లేక ఇబ్బందులతో కాలం చెల్లిస్తున్నారు. గ్రామాల్లోనూ ట్యాంకులు బోర్లు ఉన్న విద్యుత్ అంతరాయం వలన నిండని పరిస్థితి ఏర్పడింది. నీయోజకవర్గంలోని మిషన్ భగీరథ నీళ్లు రానప్పుడు పంట పొలాల దగ్గరికి వెళ్లి నీళ్లు తెలుసుకోవాల్సి ఉంది. కొన్ని గ్రామాల్లో నీళ్లు ఫ్లోరైడ్ ప్రభావం వలన వాడుకోవడానికి కూడా పనికిరాని పరిస్థితి కనపడుతుంది. హోటల్లు దుకాణాల్లోనూ మినరల్ వాటర్ కి అలవాటు పడి 20 రూపాయల నుంచి 30 రూపాయలు దాకా నీళ్లు కొనుగోలు చేసుకుని వాడుకునే పరిస్థితి ఉంది. కొన్ని గ్రామాల్లోనూ దాతల సహకారంతో మినరల్ వాటర నిర్వహిస్తున్నారు. చేతి బోర్లు లేకపోవడం వలన అనేక రకాల పద్ధతిలో గ్రామాల్లోనూ నీటి కోసం ప్రత్యేక మార్గాలను ఎదుర్కొంటున్నారు. మినరల్ వాటర్ పుట్టగొడుగుల పుట్టడం వలన వ్యాపారంగా మారింది. ఫంక్షన్లో శుభ కార్యక్రమాలకు ప్రతి చోట మినీ రల్ వాటర్ ని ఉపయోగిస్తున్నారు.


## సీడ్ కంపెనీల చూపు కర్ణాటక వైపు

నడిగడ్డలో తగ్గుతున్న సీడ్ పత్తి సాగు విస్తీర్ణం


జివోటి పరిక్షల్లో ఎక్కువ శాతం ఫెయిల్

ప్రస్తుతం ప్యాకెట్‌పై రూ.100 తగ్గించిన కంపెనీలు

నడిగడ్డలో తగ్గిన సాగు విస్తీర్ణం







**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల్:** దేశంలోనే నడిగడ్డలో కాటన్ సీడ్ కు ప్రసిద్ధిగాంచింది. గత కొన్ని సంవత్సరాలుగా కాటన్ సీడ్ ను సాగు చేస్తూ వేలాది కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ఇలాంటి తరుణంలో కంపెనీల లాభాపేక్షతో పక్క రాష్ట్రమైన కర్ణాటకలో తక్కువ ఖర్చు ఎక్కువ లాబాపేక్షతో అక్కడ సాగుకు ప్రాధాన్యతనిస్తోంది. ఈ పరిస్థితిలో కాటన్ సీడ్ సాగుపై రైతులకు ఆసక్తి ఉన్నా కంపెనీలు విత్తనాలు ఇచ్చేందుకు కోత పెట్టడంతో ప్రత్యామ్నాయ పంటల సాగుపై ఆధారపడాల్సి వస్తోంది.

**కంపెనీల చూపు కర్ణాటక వైపు**

కర్ణాటకలోని గజేంద్ర గౌడ్ ఏరియాలో కూలీల ఖర్చుతో పాటు విత్తన ప్యాకెట్ ధరలు తక్కువగా ఉండడంతో నడిగడ్డ ప్రాంతాన్ని వదిలి కర్ణాటకలోని పలు ప్రాంతాలలో సీడ్ పత్తి సాగుకు ప్రాధాన్యాత ఇస్తున్నాయి. ముఖ్యంగా నూజివీడు, రాశి మైకో, కావేరి, దాన్య సీడ్ కంపెనీలు, వేద, రాయల్, కోహినూర్ కు చెందిన సీడ్ పత్తి విత్తనాలు కేటాయించడంతో సాగు విస్తీర్ణం తగ్గనుంది. జిల్లాలో ప్రతి సంవత్సరం పలు ప్రధాన కంపెనీల నుంచి ప్రతి విత్తనాలను 150 మంది ఆర్గనైజర్లు 250 మంది సబ్ ఆర్గనైజర్లు ద్వారా 45 వేల ఎకరాలకు పైగా సీడ్ సాగు విస్తీర్ణం ఉండగా ప్రధానంగా గద్వాల నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం అధికంగా ఉండగా అలంపూర్ తాలూకాలోని కొన్ని మండలాల గ్రామాలలోని ఆసక్తి ల వ్యవధి తక్కువ కాలం ఉండడం, అధిక లభాలు వస్తుండడంతో రైతులు విత్తనపత్తిపై ఆసక్తి చూపుతున్నారు. ప్రతి సంవత్సరం జూన్, జూలై నెలల్లో ఈ పంట పూతకొస్తుంది.అయితే మగ పుష్పాలకు పుప్పొడి వచ్చిన తర్వాత దాన్ని ఆడ పుష్పాల మీద రాయడం ద్వారా ఫలదీకరణం చేస్తారు. ఈ పుప్పొడిని రైతులు సుంకు వస్తేనే ఈ ఫలదీకరణ ప్రక్రియ నిర్వహించడం సాధ్యం అవుతుంది. ఫలదీకరణం జరిగితేనే విత్తనాలు ఏర్పడతాయి. ఈ విత్తనాల ప్యాకెట్ కు 600 రూపాయలు ఉండగా ప్రస్తుతం రూ.500 కు పడిపోయింది. మరో రకమైన స్టెరల్ పండే పత్తి గింజలకు ప్యాకెట్ కు 500 ఉండేది ప్రస్తుతం వాటి ధర 410 నుంచి 430 దాకా ఉంది. సీడ్ సాగుకు గట్టు ,ధరూర్ మండలాలలో ఒక కూలీకి నెలకు 18 నుంచి 20 వేల వరకు ఖర్చు వస్తుండగా ఐజ, మల్దకల్ మండలాల్లో ఒక్కొక్క కూలికి 22 నుంచి 24 వేల వరకు ఖర్చు వస్తోంది ఎకరా సాగుకు 1.50 లక్షల వరకు ఖర్చు వస్తోంది.

**జిల్లాలో తగ్గుతున్న సాగు విస్తీర్ణం**

సీడ్ ప్రధాన కంపెనీలైన వేద, రాశి, నూజివీడు క్రిస్టల్ వంటి కంపెనీల విత్తనాలు సాగుకు నడిగడ్డలో డిమాండ్ ఉంది. కానీ ప్రస్తుతం ఆ కంపెనీలు మార్కెట్ కి మించి అధిక పంట వచ్చిందనే కారణంతో ప్రస్తుతం ఆర్గనైజర్లకు విత్తనాలు ఇవ్వకపోవడంతో ముందుకు వచ్చాయి. మార్కెట్ కోసం ఏరియా పెంచి ప్రస్తుతం డిమాండ్ మీద ఇవ్వకుండా కర్ణాటకకు ముగ్గు చూపుతున్నారని. పెద్ద కంపెనీల తీరుపై ప్రధాన ఆర్గనైజర్లు ఆరోపిస్తున్నారు. సీడ్ అసోసియేషన్ సభ్యులు ఐక్యతగా ఉండి, అందరికీ విత్తనాలు వచ్చేలా కృషి చేయకపోవడం, ప్యాకెట్ పై కమిషన్ సొంత లాభం కోసం విత్తనాలు కేటాయింపు పై లాబీయింగ్ కారణంగా ఇక్కడ సాగుపై కంపెనీలు విముఖత చూపుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. పాత కంపెనీలైన కావేరి, బయో సీడ్స్ వారు ప్యాకెట్ కు రూ.600 లు ఇచ్చేందుకు ముందుకు వస్తున్న విత్తనాలు తీసుకునేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. గత సంవత్సరం పండించిన విత్తనాలలో ఎక్కువ శాతం రైతుల లాట్లు జీవోటి పరీక్షల్లో ఫెయిల్ అయ్యాయి. ముఖ్యంగా గత 20 సంవత్సరాలుగా సీడ్ సాగు విస్తీర్ణం గణనీయంగా పెరుగుతుండగా గత ఐదు సంవత్సరాల నుంచి సీడ్ సాగులో అనేక ఆటుపోట్లు చోటు చేసుకుంటున్నాయి. . రైతులకు కంపెనీలు విత్తనాలు ఇచ్చిన వివరాలు, సాగు విస్తీర్ణం విత్తనాలు ఫలితాలకు సంబంధించిన డేటా ఇవ్వడం లేదని డిఏఓ కలెక్టర్ కు తెలిపారు. రీజిఒటి నిర్వహించి రైతులకు న్యాయం చేయాలన్నారు.

# క్రీడ

# టీమిండియా ప్రాక్టీస్ షురూ!



ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ (WTC 2025–27) కొత్త సైకిల్‌లో తొలి సిరీస్‌కు భారత జట్టు పక్కాగా సిద్ధమవుతోంది. ఇంగ్లాండ్ గడ్డపై 18 ఏళ్లుగా చేజారుతున్న సిరీస్‌ను ఒడిసిపట్టేందుకు సమాయత్తమవుతోంది. ఆతిథ్య జట్టుతో ఐదు టెస్టుల సిరీస్‌లో విజయమే లక్ష్యంగా పెట్టుకున్న టీమిండియా.. ఏమాత్రం ఆలస్యం చేయకుండా ప్రాక్టీస్ షురూ చేసింది. పర్యటన మొదలైన రెండో రోజే ఆటగాళ్లు కసరత్తు చేస్తూ కనిపించారు. లార్డ్స్‌లోని ఇండోర్ స్టేడియంలో హెడ్‌కోచ్ గౌతం గంభీర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నేతృత్వంలో స్క్వాడ్‌లోని 15 మంది వామప్ వ్యాయామాలు, ఫీల్డింగ్ విన్యాసాలతో చెమటోడ్చారు. భారత క్రికెటర్ల ప్రాక్టీస్‌కు సంబంధించిన వీడియోను ఆదివారం బీసీసీఐ ఎక్స్‌లో షేర్ చేసింది.

ఐదు టెస్టుల సిరీస్ కోసం టీమిండియా బృందం శనివారం ఇంగ్లాండ్ చేరుకుంది. డబ్ల్యూటీసీలో కీలకమైన సిరీస్ కావడంతో భారత ఆటగాళ్లు మరుసటి రోజే శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. సిరాజ్, బుమ్రా, ప్రసిధ్ కృష్ణ, అర్ష్‌దీప్ సింగ్‌లతో కూడిన పేస్ దళం వామప్ వ్యాయమాల తర్వాత బౌలింగ్ ప్రాక్టీస్‌తో బిజీగా గడిపింది. ఇక కెప్టెన్ గిల్, సిరాజ్, ప్రసిధ్‌లతో ఫుట్‌బాల్ ఆడుతూ కనిపించాడు. ఫీల్డింగ్ కోచ్ టి.దిలీప్ సమక్షంలో క్యాచ్‌లు పట్టడం, బంతిని వికెట్లవైపు త్రో చేయడం, వికెట్లను గురి చూసి కొట్టడం వంటివి సాధన చేశారు.

### 4 రోజుల ప్రాక్టీస్ మ్యాచ్

భారత్, ఇంగ్లాండ్‌ల మధ్య తొలి టెస్టు జూన్ 20 మొదలవ్వనుంది. అయితే.. అంతకంటే ముందు ఇంగ్లాండ్‌లోనే ఉన్న ఏ జట్టుతో సీనియర్ టీమ్ నాలుగు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్ ఆడనుంది. ఇంగ్లాండ్ పరిస్థితులను అర్థం చేసుకునేందుకు ఈ మ్యాచ్ చాలా ఉపయోగపడనుంది. కానీ, రికార్డులు మాత్రం ఆతిథ్య జట్టుకే అనుకూలంగా ఉన్నాయి. 2007లో చివరిసారిగా ఇక్కడ సిరీస్ గెలుపొందింది టీమిండియా. ఆ తర్వాత పలు మార్లు వెళ్లినా పరాజయమే పలకరించింది. కుర్రాళ్లు, సీనియర్లతో కూడిన భారత జట్టు ఈసారి 18 ఏళ్ల నిరీక్షణకు తెరదించాలనే పట్టుదలతో ఉంది. అనుభవజ్ఞులైన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, అశ్విన్‌లు లేకుండా సిరీస్ విజయం కష్టమే. కానీ, అసాధ్యం కాదని చాటాలనుకుంటున్నాడు గంభీర్. ఇప్పటికే స్క్వాడ్‌లోని కేఎల్ రాహుల్ సెంచరీతో, కరుణ్ నాయర్ ద్విశతకంతో ఇంగ్లాండ్ లయన్స్‌పై విరుచుకుపడ్డారు. సో.. వీళ్లు ఐదు టెస్టుల సిరీస్‌లో పరుగుల వరద పారించే అవకాశముంది.

# భారత అథ్లెట్లకు 4 స్వర్ణాలు..

## రజతంతో మెరిసిన యశాస్!











భారత అథ్లెట్లు తైవాన్ ఓపెన్‌లో పతకాల పంట పండించారు. శనివారం జ్యోతి ఎర్రాజీ, అబ్దుల్లా, పూజలు స్వర్ణాలతో మెరవగా.. పోటీల చివరి రోజైన ఆదివారం కూడా మరో నాలుగు గోల్డ్ మెడల్స్ వచ్చాయి. మూడు సార్లు జాతీయ ఛాంపియన్ విథ్యా రామరాజ్, రోహిత్ యాదవ్, పూజా, క్రిష్ణ కుమార్‌లు తమ తమ విభాగాల్లో పసిడితో గర్జించారు. పురుషుల 400 మీటర్ల హర్డిల్స్ ఫైనల్లో యశాస్ పలాక్ష వెండి వెలుగులు విరజిమ్మాడు.

తైవాన్ చివరిరోజున భారత అథ్లెట్లు పసిడి మోత మోగించారు. మహిళల 400 మీటర్ల హర్డిల్స్‌లో విథ్యా చిరుతలా పరుగెత్తి స్వర్ణం కొల్లగొట్టింది. ఆదివారం జరిగిన ఫైనల్లో ఆమె 56.53 సెకన్లలోనే లక్ష్యానికి చేరుకుంది. తద్వారా త్వరలో జరుగబోయే వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో విథ్య ర్యాంకింగ్స్ మెరుగవ్వనుంది. జావెలిన్ త్రోలో రోహిత్ అత్యుత్తమ ప్రదర్శన చేయకపోయినా 74.42 మీటర్ల దూరం ఈటెను విసిరి బంగారు పతకం సాధించాడు.

ఇక మహిళల, పురుషుల 800 మీటర్ల పరుగులో భారత అథ్లెట్లు అదరగొట్టారు. అంచనాలను అందుకుంటూ పూజ భారత్‌కే చెందిన ట్వింకిల్ చౌదరీని రెండో స్థానానికి పరిమితం చేస్తూ 2.02 79 సెకన్లలో ఫినిషింగ్ లైన్ దాటింది. పురుషుల ఫైనల్లో క్రిష్ణ కుమార్ ప్రత్యర్థులకు షాకిస్తూ 148 46 సెకన్లలోనే లక్ష్యానికి చేరుకొని గోల్డ్ మెడల్ ఖాతాలో వేసుకున్నాడు.

### 100 మీటర్ల హర్డిల్స్‌లో..

పది రోజుల క్రితం ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో స్వర్ణం సాధించిన జ్యోతి ఎర్రాజీ మరోసారి మెరిసింది. 100 మీటర్ల హర్డిల్స్‌లో తనకు తిరుగులేదని చాటుతూ తైవాన్ ఓపెన్ లోనూ పసిడి వెలుగులు విరజిమ్మింది. శనివారం జరిగిన 100 మీటర్ల హర్డిల్స్ ఫైనల్లో చిరుతలా పరుగెత్తిన జ్యోతి 12.99 సెకన్లలోనే లక్ష్యాన్ని చేరుకుంది. పురుషుల ట్రిపుల్ జంప్‌లో అబ్దుల్లా అబూబాకర్, మహిళల 1500 మీటర్ల పరుగులో పూజలు కూడా స్వర్ణంతో మనదేశ కీర్తిని విశ్వవ్యాప్తం చేశారు.

# చిరంజీవిని కలిసిన కుబేర నిర్మాత



ధనుష్ హీరోగా నాగార్జున కీలక పాత్రలో శేఖర్ కమ్ముల దర్శకత్వంలో తెరకెక్కిన కుబేర సినిమా విడుదలకు సిద్ధం అయిన నేపథ్యంలో నిర్మాత సునిల్ నారంగ్ చిరంజీవిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈనెల 20న కుబేర సినిమా విడుదల అవుతున్న సందర్భంగా చిరంజీవిని కలిసిన నిర్మాత సునిల్ నారంగ్ ఆశీర్వాదం తీసుకున్నారు. కుబేర సినిమా పెద్ద హిట్ కావాలని చిరంజీవి ఆకాంక్షించారు.

# రీల్

# నేడు అఖండ–2 టీజర్



బాలకృష్ణ, బోయపాటి కాంబినేషన్‌లో వచ్చిన అఖండ సినిమా ఘన విజయం సాధించిన నేపథ్యంలో ఇప్పుడు అఖండ 2 సీక్వెల్ తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే రెగ్యులర్‌గా షూటింగ్ జరుపుకుంటున్న అఖండ 2 సినిమా టీజర్‌ను నేడు సాయంత్రం ఆరున్నర గంటలకు విడుదల చేయనున్నారు. 14రీల్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ సినిమాను రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు.



# అల్లు అర్జున్ సరసన దీపికా పదుకొనె

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీ, సన్ పిక్చర్స్ కాంబోలో రూపొందుతోన్న భారీ విజువల్ వండర్ పాన్ ఇండియా చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ క్వీన్ దీపికా పదుకొనె నటిస్తోంది. ప్రస్తుతానికి ప్రాజెక్ట్ AA22 x A6 అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతోన్న ఈ చిత్రం భారతీయ సినీ చరిత్రలో ఓ మైలురాయిగా నిలవనుంది. హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాలు, రోమాలు నిక్కబొడిచే యాక్షన్ సన్నివేశాలు, గ్రాండ్ విజువల్స్, మన సంస్కృతికి అద్దం పట్టే కథ, గ్లోబల్ లుక్‌తో ప్రేక్షకులను మెప్పించేలా ఉండనుంది. ఈ సంవత్సరం చివరలో సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. త్వరలోనే నటీనటులు, సాంకేతిక నిపుణులకు సంబంధించిన మరిన్ని వివరాలను తెలియజేయనున్నారు.

ఈ సందర్భంగా దర్శకుడు అట్లీ మాట్లాడుతూ 'జవాన్ సినిమాలో దీపిక మేడమ్‌తో కలిసి పని చేశాను.అదొక అద్భుతమైన అనుభవం. ఆమె నటనకు సంబంధించిన పరిధి, శక్తి, ప్రతి ఫ్రేమ్‌లో ఆమె అందరినీ తనవైపు తిప్పుకునేలా చేసిన గ్రేస్ గొప్పగా ఉంటాయి. ఇప్పుడు అల్లు అర్జున్ తో పాటు దీపికా పదుకొనె కలిసి సినిమా చేయటం అనేది దర్శకుడి కల నేరవేరినట్టయ్యింది. మరచిపోలేని ఓ గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్ ఇందులో సృష్టించబోతున్నాం' అన్నారు.

# ఓజీతో వస్తున్న పవన్




పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన ఓజీ చిత్రం విడుదలకు సిద్ధం అవుతోంది. హరిహర వీరమల్లు సినిమా విడుదల వాయిదా పడటంతో ఓజీ ముందుకు వస్తోంది. ఈ సినిమా షూటింగ్ దాదాపుగా పూర్తి కావచ్చిన నేపథ్యంలో ఈ సినిమా పనులు వేగవంతం చేశారు. అన్ని పనులు పూర్తి చేసి సెప్టెంబర్ 25న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. పవన్ సరసన ప్రియాంక మోహన్ హీరోయిన్‌గా నటిస్తుంది. సుజీత్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ఇమ్రాన్ హాష్మి ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాను డివివి దానయ్య నిర్మిస్తున్నారు.

# 'పయనం' షూటింగ్ ప్రారంభం



రోటి కపడా రొమాన్స్ చిత్రంతో కథానాయకుడిగా తనకంటూ ఓ గుర్తింపు పొందిన సుప్రజ్ హీరోగా, 'జనక అయితే గనక' చిత్రంలో తన అభినయంతో మెప్పించిన సంగీర్తన విపిన్ నాయికగా నటిస్తున్న నూతన చిత్రం 'పయనం' ఆదివారం హైదరాబాద్‌లో షూటింగ్ ప్రారంభమైంది. ఛాయచిత్రాలు పతాకంపై చందురామ్ దర్శకత్వంలో స్వర్ణ కమల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. హీరో, హీరోయిన్లపై చిత్రీకరించిన ముహుర్తపు సన్నివేశానికి ప్రముఖ కొరియోగ్రాఫర్ రఘు మాస్టర్ క్లాప్ నివ్వగా, నటుడు, సంగీత దర్శకుడు రఘు కుంచె కెమెరా స్విచాన్ చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఇదొక కొత్త కాన్సెప్ట్‌తో రూపొందిస్తున్న చిత్రమిది. డ్రామా సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రంలో ఆడియన్స్‌ను సర్‌ప్రైజ్ చేసే అంశాలు చాలా ఉంటాయి. అవసరాల శ్రీనివాస్ మా చిత్రంలో ఓ ముఖ్యపాత్రలో కనిపిస్తారు. మంచిర్యాల, తమిళనాడు, ఒరిస్సా పరిసర ప్రాంతాల్లో చిత్రీకరణ పూర్తిచేస్తాం. జూలై 7 నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం' అన్నారు.

# సామాజిక శాంతి–ఐక్యత కోసం మీడియా కృషి చేయాలి

## శాంతి స్థాపనలో బ్రహ్మకుమారీస్ కృషి ప్రశంసనీయం : రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి





ప్రజాపక్షం/బీబీనగర్ : ప్రపంచ వ్యాప్తంగా అనేక సమస్యలతో అశాంతి ప్రబలుతున్న ప్రస్తుత తరుణంలో సమాజంలో శాంతిని నెలకొల్పే బాధ్యతని మీడియా చేపట్టాలని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. కుల మతాల పేరిట విడిపోతున్న సమాజాన్ని ఐక్యత, సామరస్యత వైపు నడిపేందుకు మీడియా సంస్థలు, జర్నలిస్టులు అంకితమవ్వాలని ఆయన సూచించారు. ప్రగతి, ప్రశాంతత సమానంగా వృద్ధి చెందితేనే సామాజిక వికాసం జరుగుతుందన్నారు. బీబీనగర్ సమీపంలోని బ్రహ్మ కుమారీస్ సైలెన్స్ రిట్రీట్ సెంటర్లో ఆదివారం సామాజిక ఐక్యత, శాంతి స్థాపనలో మీడియా పాత్ర అనే అంశంపై జరిగిన సదస్సు చర్చా వేదికలో శ్రీనివాసరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక అసమానతలు, సామాజిక విభేదాలను తొలగించటంలో జర్నలిస్టుల పాత్ర కీలకమైనదని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా బ్రహ్మ కుమారీస్ శాంతి స్థాపన కోసం అంకితభావంతో చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. కుల,మత విభేదాలు లేకుండా అన్ని వర్గాల వారికి సేవలు అందిస్తున్నారని ఆయన కొనియాడారు. పాత్రికేయ వృత్తికి సత్యత అతి ముఖ్యమని, దీని ద్వారానే జర్నలిస్టులు సమాజంలో విశ్వసనీయతను పొందుతారని శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. ప్రజా ప్రయోజనాలు, సామాజిక సంక్షేమాన్ని పరిరక్షించడానికి పాత్రికేయులు కట్టుబడి ఉండాలని సూచించారు. బ్రహ్మ కుమారీలు ఆధ్యాత్మిక, నైతిక విలువల ద్వారా సమాజంలో పాజిటివ్ వాతావరణాన్ని పెంచేందుకు మీడియాతో పాటుగా అనేక ఇతర రంగాల్లో చక్కగా కృషి చేస్తున్నారని వివరించారు. సోషల్ మీడియాకు తగిన నియంత్రణ ఉండాలని, జర్నలిస్టులు నైతిక విలువలకు ప్రాధాన్యతనిస్తూ టెక్నాలజీలో అప్‌గ్రేడ్ అవుతూ ఉండాలని ఆయన సూచించారు. బ్రహ్మ కుమారిస్ మౌంట్ అబూ మీడియా వింగ్ వైస్ చైర్ పర్సన్ బి.కె.సరళ, కోఆర్డినేటర్ శాంతను, సైలెన్స్ రిట్రీట్ సెంటర్ డైరెక్టర్లు బి.కె.రాజకుమారి, బి.కె.సునీత ఆధ్వర్యంలో ఈ రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలు, జంట నగరాల నుంచి పెద్ద సంఖ్యలో పాత్రికేయులు ఈ సదస్సుకి హాజరయ్యారు. సమాజంలో దుఃఖం ఇవ్వడం తీసుకోవడం అనే ధోరణి మారితే శాంతి నెలకొంటుందని, జర్నలిస్టుల్లో వ్యక్తిగతంగా ప్రశాంతత, సానుకూల వైఖరి పెంచాలననే ఉద్దేశంతో ఈ సదస్సుని నిర్వహించామని బి.కె.సరళ వివరించారు. రాజయోగ శిక్షణ ద్వారా సమాజంలో అన్ని వర్గాల వారికి శాంతిని పంచేందుకు బ్రహ్మ కుమారీస్ సంస్థ కృషి చేస్తోందని ఆమె చెప్పారు. కుల, మతాల మధ్య ఘర్షణ వాతావరణాన్ని నివారించే విధంగా వార్తలు ప్రచురిస్తే సమాజంలో ఐక్యత శాంతి నెలకొంటాయని ప్రెస్ కౌన్సిల్ మాజీ సభ్యుడు ఉప్పల లక్ష్మణ్ అన్నారు. సమాజంలో, మీడియాలో ఆధ్యాత్మిక, నైతిక విలువలని పెంపొందించడం కోసం బ్రహ్మ కుమారీస్ ఇలాంటి సదస్సులను నిర్వహించటం అభినందనీయమని చెప్పారు. హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎల్ వేణుగోపాల నాయుడు మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజంలో సహృద్భావాన్ని, సామరస్యతను పెంపొందించే విధంగా పనిచేయాలన్నారు. కుల మత వర్గ విభేదాలు పెరుగుతున్న ప్రస్తుత కాలంలో సామాజిక ఐక్యత కోసం బ్రహ్మ కుమారీస్ అందిస్తున్న ఆధ్యాత్మిక సేవలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని చెప్పారు. మహిళల ద్వారా ఆధ్యాత్మిక రంగంలో విశ్వవ్యాప్తంగా శాంతి, ఐక్యతల కోసం కృషి చేస్తున్న ఏకైక ఆధ్యాత్మిక సంస్థ బ్రహ్మ కుమారీస్ అని మౌంట్ అబూ మీడియా కోఆర్డినేటర్ శాంతను అన్నారు పాత్రికేయులు ప్రజాస్వామ్య, రాజ్యాంగ మౌలిక అంశాలను అధ్యయనం చేస్తేనే సమాజానికి మేలు చేయగలుగుతారని ఇండోర్ కేబీటీ జర్నలిజం యూనివర్సిటీ మాజీ ఉపకులపతి మాన్సింగ్ పర్మార్ అన్నారు. సదస్సు అనంతరం పర్యావరణ దినోత్సవం వేడుకలు నిర్వహించి అందరికీ మొక్కలను అందజేశారు. మానసిక ఒత్తిడిని ఎదుర్కొనేందుకు మెడిటేషన్ చిట్కాలను వివరించి, సామూహిక ధ్యానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనమంత్ర, శ్రీమత్ ఎక్స్‌ప్రెస్ ప్రధాన సంపాదకులు విశాల్, దీన్ దయాల్, భారత్ ఎక్స్ ప్రెస్ ఛానల్ ఎడిటర్ ప్రియాంక, మాజీ ఉపకులపతి ఆచార్య విద్యావతి, బి.కె. మీడియా వింగ్, ప్రతినిధులు బి.కె.మంజు, బి.కె.యోగిని తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన వరద పరిస్థితి

(మొదటి పేజీ తరువాయి)

నిలిపివేయబడ్డ ఫెర్రీ సర్వీసులు పగటిపూట పాక్షికంగా పునరుద్ధరించబడనున్నాయి. శనివారం సాయంత్రం వరకు ధరమ్‌తుల్ వద్ద కొపిలి, ధుబ్రి, బిపి ఘాట్ వద్ద బరాక్, శ్రీభూమి వద్ద కుషియారా వద్ద బ్రహ్మపుత్ర నది ప్రమాదస్థాయిని మించి ప్రవహిస్తోంది. జిల్లాలోని 41 సర్కిళ్లు, 999గ్రామాలలో మొత్తం 3,37, 358 మంది వరద ప్రభావానికి గురయ్యారు. శ్రీ భూమిలో అత్యధికంగా 1.93లక్షల మందికి పైగా వరదలు బారిన పడ్డారు.హైలాకండిలోఏ 73,724మంది వరద ప్రభావానికి లోనయ్యారు. కాచర్‌లో 56,398మంది ఇప్పటికే వరదల బారిన పడ్డారు. 36,000మందికి పైగా నిరాశ్రయులైన ప్రజలు 133 సహాయ శిబిరాలలో ఆశ్రయం పొందుతున్నారు. 68 సహాయ పంపిణీ కేంద్రాలు కూడా పనిచేస్తున్నాయి. కాగా 12,659 హెక్టార్ల పంట భూములు ఇప్పటికే నీటమునిగాయి. రెండు జిల్లాలు ఇప్పటికీ పట్టణ వరదలతో అల్లకల్లోలంగా మారుతున్నాయి.284మంది ఈ వరదల ప్రభావం బారినపడ్డారు. కజిరంగా నేషనల్ పార్క్‌చ పొబిటోరా వైల్డ్‌లైఫ్ శాంక్చువరీ కూడా వరదల బారిన పడ్డాయని అధికారులు చెప్పారు. ఇదే సమయంలో గువహతిలోని బ్రహ్మపుత్రలో ఆదివారం ఫెర్రీ సేవలు పాక్షికంగా తిరిగి ప్రారంభం అవుతాయని ఇన్లాండ్ వాటర్ ట్రాన్స్‌పోర్ట్ (ఐడబ్ల్యుటి) డిపార్ట్‌మెంట్ ఇక్కడ విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలియజేసింది.గువహతిమధ్యంఖండా ఫెర్రీ సర్వీస్ గువహతిరాజదువార్ ఫెర్రీ ఘాట్ నుంచి ఉత్తర ఒడ్డు వైపు అప్రోచ్ రోడ్డు పునరుద్ధరించబడి ఫెర్రీ ప్రయాణికులకు సురక్షితంగా భావించే వరకు తాత్కాలికంగా నడపబడుతుంది. గువహతి కురువా సర్వీస్ సోమవారం నుంచి తిరిగి ప్రారంభం అవుతుంది. గువహతిలో చెక్కపడవల నిర్వహణ నిషేధించబడుతుందని, నది పరిస్థితులను సమీక్షించిన తర్వా వాటి సేవలను తిరిగి ప్రారంభించడంపై నిర్ణయం తీసుకుంటామని ఐడబ్ల్యుటి విడుదల చేసిన ప్రకటన తెలిపింది.



# ఉద్యమాలే ఊపిరిగా ముందుకు

(మొదటి పేజీ తరువాయి)

పనిచేస్తున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రంలోని బిజేపికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సిపిఐ అతిపెద్ద పార్టీ అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంతో మనకు పొత్తులేదని, కేవలం ఎన్నికల సర్దుబాటు మాత్రమేనని చెప్పారు. కష్టజీవుల పార్టీ సిపిఐ అని కార్మిక, కర్షకుల పక్షాన పోరాటాలు చేసి ప్రాణాలువదిలిన ఘన చరిత్ర ఎర్రజెండాకు ఉందన్నారు. బిజేపి ప్రభుత్వం అయోధ్య రామున్ని అడ్డంపెట్టుకుని దేశంలో రాజకీయం చేస్తుందన్నారు. మొన్నటికి మొన్న పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్‌పై చేసిన యుద్ధానికి సింధూర్ పేరుపెట్టి ప్రజలను మతంవైపు లాగడం సిగ్గుచోటని అన్నారు. గుజరాత్ రాష్ట్రంలో గోద్రా సంఘటనలో నరమేధాన్ని సృష్టించిన కేంద్ర హోంశాఖ మంత్రి అమీత్‌షా నేడు నక్సలిజాన్ని నామరూపాలు లేకుండా చేస్తామంటూ అపరేషన్ కగార్ పేరుతో తిరిగి నరమేధం సృష్టిస్తున్నాడని అన్నారు. ప్రభుత్వంతో తాము చర్చలకు సిద్ధమని చెబుతున్న వినకుండా పిట్టలను కాల్చినట్లు కాల్చి నక్సల్‌ను చంపుతున్నారని అన్నారు. మావోయిస్టు కేంద్ర కమిటి కార్యదర్శి సంబాల కేశవరావు అలియాస్ బస్వరాజు కాల్చి చంపిన తర్వాత కోట్లాదిమంది ప్రజలు స్పందించారని అన్నారు. చట్టం ప్రకారం కాకుండా కాల్పులు జరపడాన్ని ప్రతి ఒక్కరు ఖండించారని చెప్పారు. కేంద్రంలోని బిజేపికి వ్యతిరేకంగా ముందుకు సాగి ప్రజా ఉద్యమాల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

### పేదలకు అండ ఎర్రజెండా : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

పేదలకు అండా ఎర్రజెండా అని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సిపిఐకి వందేళ్ల చరిత్ర ఉందని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కేంద్రంగా సూర్యాపేట చరిత్రపూటల్లో నిలిచిందన్నారు. సామాజిక ఉద్యమాలు, పీడిత ప్రజల పక్షాన కామ్రెడ్ బొమ్మగాని ధర్మబిక్షం, భీంరెడ్డి నర్సింహారెడ్డి తదితర యోధులు ఎన్నో పోరాటాలు నిర్వహించారని అన్నారు. భూమి, భుక్తి, విముక్తి కోసం సాగిన పోరాటం మరువలేనిదన్నారు. తమ పార్టీ ఎంతోగొప్ప చెప్పుకునే బిజేపికి ఏ చరిత్ర లేదని అన్నారు. ఒక్క రక్తపు బొట్టు కూడా చిందించి దేశం కోసం పోరాడిన ఆనవాళ్లు లేవన్నారు. హిందుత్యం గురించి గొప్పగా చెప్పే బిజేపి రామజన్మ భూమిలో కూడా ప్రజలు ఆ పార్టీని అసయించుకున్నారని చెప్పారు. న్యాయ వ్యవస్థలను స్వయంప్రతిపత్తి గల సంస్థలను మోడి సర్కారు నిర్వీర్యం చేసిందన్నారు. కార్పోరేట్ శక్తులను పెంచి పోషిస్తూ రాజకీయాల్లోకి కూడా తీసుకవచ్చిందన్నారు. అధికారం లేకుండా ఉండలేమనే స్థాయికి దిగజారిందన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నేరవేర్చాలన్నారు. బిసి,ఎస్సీ కులగణను ప్రజలను ప్రభావితం చేశాయన్నారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సంఘటితమై అందరూ పోరాడాలన్నారు.

### స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి : పల్లా వెంకటరెడ్డి

స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు పోటీ చేసి తమ సత్తా చాటాలని పార్టీ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కాంగ్రెస్‌తో పొత్తు కుదిరిన, కుదరకున్నా ఆయా గ్రామాల్లో పార్టీ నుండి అభ్యర్థులను ఎన్నికల బరిలోకి దింపాలన్నారు. పార్టీ మరింతగా విస్తరించాలంటే ఎన్నికల్లో పోటీ చేయాల్సిందేనని అన్నారు. చట్ట సభలలో బిసి గణన అమోదం అయ్యేంత వరకు పార్టీ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతూనే ఉంటుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోవడంతో అభివృద్ధి కుంటు పడిందని, తక్షణమే ఎన్నికలు జరిపించాల్సిన అవసరం ప్రభుత్వం కూడా ఈనెల 15 తర్వాత ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ వచ్చేలా ప్రయత్నాలు చేస్తుందన్నారు. లౌకికశక్తులు ఏకమై మతోన్మాద బిజేపిపై ఉద్యమించాలన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగానే కేంద్రంలో ఇండియా కూటమికి పొత్తుపెట్టుకున్నామని అన్నారు. పార్టీ అనుబంధ సంఘాలు, పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

### సిపిఐ చరిత్ర త్యాగభరితం : బొమ్మగాని ప్రభాకర్

పార్టీకి వంద సంవత్సరాల చరిత్ర త్యాగభరితమని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. తెలంగాణ పోరాటంలో రావి నారాయణరెడ్డి, బొమ్మగాని ధర్మబిక్షం లాంటి ఎంతోమంది యోధులు విరోచిత పోరాటం చేశారని అన్నారు. భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం జరిగిన పోరాటంలో నాటి ప్రధాని ఇందిరగాంధీ భూ సంస్కరణలు, బ్యాంకుల జాతీయకరణ చేయడం జరిగిందన్నారు. అలాగే రాజ భరణాల రద్దు కూడా చేసిందన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. కేంద్రంలోని మోడి ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని అన్నారు. నిజమైన ఉద్యమాల ద్వారా ప్రజల్లోకి వెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

### ఎన్నో ఒడిదొడుకులకు ఓర్చి ముందుకు : గన్నా చంద్రశేఖర్

ఎన్నో ఒడిదొడుకులకు ఓర్చి జిల్లాలో పార్టీని ముందుకు తీసుకపోతున్నామని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్ అన్నారు. జిల్లాలోని తుంగతుర్తి నియోజకవర్గంలో పార్టీకి మొదట పట్టులేకున్నా ఆరు మండలాలకు విస్తరించడం జరిగిందన్నారు. పార్టీ నేతల స్ఫూర్తితో ప్రజల సమస్యలపై పాలకులు అనుసరిస్తున్న విధానాలపై పోరాటం చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో మరింత ముందుకు సాగుతామన్నారు. దీనికి ముందు స్వాతంత్ర సమరయోధులు దొడ్డా నారాయణరావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యావత్తు ప్రపంచానికి దిక్సూచి ఎర్రజెండానేనని చెప్పారు. మహాసభల్లో పార్టీ జెండాను ఆవిష్కరించటం అన అదృష్టం దక్కడం పట్ల సంతోషించారు. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పార్టీ పెద్దలకు సూచించారు. రైతాంగ, కార్మిక సమస్యలపై నిరంతరం పోరాడాలన్నారు. దీనికి ముందు ఇటీవల అమరులైన పార్టీ నాయకులకు మౌనం పాటించి శ్రద్ధంజలి ఘటించారు. ప్రజానాట్య మండలి కళాకారుల పాటలు సభికులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాయకులు ఉస్తేల సృజన, కెవిఎల్, అనంతుల మల్లేశ్వరి, బద్దం భద్రారెడ్డి, బత్తిని హనుమంతరావు, బద్దం కృష్ణారెడ్డి, మేకల శ్రీనివాసరావు, గుండు వెంకటేశ్వర్లు, దూళిపాళ ధనుంజయనాయుడు, ఎస్‌కె లతీఫ్, కొండా కోటయ్య, మండవ వెంకటేశ్వర్లు, బూర వెంకటేశ్వర్లు, చామల అశోక్‌కుమార్, చిల్లంచర్ల ప్రభాకర్ పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com